విలేకరులు కావలెను
కర్నూలు నుండి వెలువడుతున్న 'విజయ సారథి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను.. తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాలు మరియు అన్ని మండల కేంద్రాలలో స్థానిక సమస్యలపై పోరాడేందుకు ఆసక్తి ఉన్న రిపోర్టర్లు వెంటనే సంప్రదించండి.. సెల్ నెం : 9700370499
సీనియర్ జర్నలిస్ట్, ఎడిటర్ : పి.వెంకటేశ్వర్లు



# విజయ సారథి
తెలుగు దినపత్రిక
RNI / APTEL/2015/64956



A.P. VISION TV
టీవీ రిపోర్టర్లు కావలెను
రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనం సృష్టిస్తున్న విజన్ టీవీలో రిపోర్టర్లు & వీడియో గ్రాఫర్లు, కెమెరామెన్లు కావలెను. ఆసక్తి ఉన్న వారు వెంటనే సం॥ సెల్ నెం : 9700370499
యండి. పి.వెంకటేశ్వర్లు



చీఫ్ఎడిటర్ : పేరపోగు వెంకటేశ్వర్లు | గురువారం 18-09-2025 | సంపుటి : 11 | సంచిక : 220 | పేజీలు : 8 | వెల : రూ 3-00

కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, విజయవాడ, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి,శ్రీకాకుళం, కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్.


# నెల్లూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**రాంగ్‌రూట్‌లో వచ్చి కారును ఢీకొన్న టిప్పర్**

**ప్రమాదంలో ఏడుగురు అక్కడిక్కడే మృతి**

**ఘటనపై సిఎం చంద్రబాబు, మంత్రులు దిగ్భ్రాంతి**



నెల్లూరు,సెప్టెంబర్17: శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సంగం మండలం పెరమన వద్ద జాతీయ రహదారిపై కారును టిప్పర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో చిన్నారి సహా ఏడుగురు మృతిచెందారు. రాంగ్ రూట్‌లో టిప్పర్ వేగంగా వచ్చి కారును ఢీకొట్టి కొద్దిదూరం లాక్కెళ్లింది. టిప్పర్ కిందకు కారు వెళ్లడంతో అందులోని మృతదేహాలు నుజ్జునుజ్జయ్యాయి. కారు నెల్లూరు నుంచి కడప వైపు వెళుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు, స్థానికులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతుల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. నెల్లూరు ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉండాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. సంగం మండలం పెరమన వద్ద ముంబై జాతీయ రహదారిపై ఈఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా దూసుకొచ్చిన ఇసుక టిప్పర్ రాంగ్ రూట్‌లో వెళ్లి కారును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఏడుగురు అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. కారును ఢీకొట్టి ఆపై కొంత దూరం వరకు టిప్పర్ లాక్కెళ్లింది. దీంతో కారు పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యింది. మృతుల్లో నలుగురు పురుషులు, ఇద్దరు మహిళలు, ఒక పాప ఉన్నట్లు- తెలుస్తోంది.సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కారు తాళ్లూరు రాధా పేరుపై రిజిస్ట్రేషన్ అయినట్లు- పోలీసులు గుర్తించారు. మృతులు నెల్లూరు జిల్లా కేంద్రంలోని ముత్తుకూరు గేటు- సమీపంలో గుర్రంవారివీధికి చెందినవారిగా తెలుస్తోంది. మృతుల్లో శేషం శేర(42), శేషం బాలవెంగ(40), తాళ్లూరి రాధా(38), తాళ్లూరి శ్రీనివాసులు (42), తెల్లగుండ్ల లక్ష్మి(40), తెల్లగుండ్ల శ్రీనివాసులు ఉన్నారు. కాగా.. డ్రైవర్ పేరు తెలియాల్సి ఉంది. ఆత్మకూరులో ఒకరిని పరామర్శించేందుకు ప్రభుత్వ వైద్యశాల వద్దకు వెళుతూ ఉండగా ఈ ప్రమాదం జరిగినట్టు- సమాచారం. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.రోడ్డు ప్రమాదంపై రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆరా తీశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

# పటేల్ చొరవతో హైదరాబాద్‌కు విముక్తి

**పాక్ అణుబెదరింపులకు లొంగేది లేదు**

**ఆపరేషన్ సిందూర్‌తో మన సత్తా చాటాం**

**మధ్యప్రదేశ్ పర్యటనలో ప్రధాని మోడీ**

భోపాల్,సెప్టెంబర్17: నిజాం పాలనలో హైదరాబాద్ సంస్థానంలో అనేక దారుణాలు జరిగాయని ప్రధాని నరేంద్ర మోదీ గుర్తుచేశారు. బుధవారం మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లాలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఈ రోజు సెప్టెంబర్ 17. ఇది మరో చరిత్రాత్మకమైన రోజు. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఎంతో ధైర్య సాహసాలు చూపించి హైదరాబాద్‌ను దేశంలో విలీనం చేశారు. దీంతో నిజాం అకృత్యాల నుంచి సంస్థానానికి విముక్తి లభించింది. దానికి గుర్తుగా హైదరాబాద్ విమోచన దినం నిర్వహిస్తున్నాం అని మోదీ అన్నారు. దేశ ఐక్యత కోసం మన సైనికులు అనేక త్యాగాలు చేశారని కొనియాడారు. అణు ముప్పులకు నవ భారతం భయపడదని మోదీ అన్నారు. ఇది నవభారతం. ఎవరికీ భయపడదు. శత్రువుల భూభాగంలోకి వెళ్లి వారిని మన బలగాలు మట్టుపెట్టాయి.



అణుబెదిరింపులకు తలొగ్గదని స్పష్టం చేశారు. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసీం మునీర్ అణు బెదిరింపులపై మరోసారి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. పహల్గాం ఉగ్రదాడికి ఆపరేషన్ సిందూర్ తో భారత్ గట్టి బదులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ దాడుల్లో జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్ కుటుంబంలోని పలువురు ప్రాణాలు కోల్పోయినట్లు కథనాలు వచ్చాయి. తాజాగా ఈ విషయాన్ని జైషే కమాండర్ మసూద్ ఇలియాస్ కశ్మీరీ అంగీకరించిన సంగతి తెలిసిందే. భారత్ ఆర్మీ తమ రహస్య స్థావరాల్లోకి ప్రవేశించి ఎలా దాడులు చేసిందనే విషయాలను వెల్లడించాడు. పాకిస్థాన్ బుద్ధిని వారు బయటపెట్టారంటూ దీనిని ఉద్దేశించి మోదీ వ్యాఖ్యలు చేశారు.

# 15 నెలల్లో ఏపీకి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు

**చంద్రబాబు కృషి వల్లనేపెట్టుబడుల రాక**

**యూకే బిజినెస్ ఫోరమ్ కార్యక్రమంలో లోకేశ్**

లండన్,సెప్టెంబర్17: స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను చేతల్లో చూపిస్తున్నామని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. యూకేలో బిజినెస్ ఫోరమ్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం చంద్రబాబు




వల్లే 15 నెలల్లో ఏపీకి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. క్వాంటమ్ వ్యాలీ, డేటా సిటీలతో ఏపీ రూపురేఖలు మారిపోతాయన్నారు. పరిశ్రమల స్థాపనకు ప్రతిబంధకంగా ఉన్న నిబంధనలను సవరిస్తున్నట్లు- వివరించారు. భారతదేశంలో అతిపెద్ద స్టీల్ ప్లాంట్‌ను ఆర్సెలార్ మిత్తల్ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు- చేయబోతోంది. నవంబర్‌లో దీని నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. దేశంలో అతిపెద్ద డేటా సెంటర్ త్వరలో విశాఖపట్నానికి రాబోతోంది. టీసీఎస్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలను రాష్ట్రానికి రప్పించేందుకు మేం ఎకరా 99 పైసలకే భూములు ఇచ్చాం. మా వద్ద కొత్తతరం యువ నాయకత్వం ఉంది. మొత్తం శాసనసభలో 50 శాతం తొలిసారి గెలిచినవారున్నారు. మంత్రివర్గంలోని 25 మందిలో 17 మంది కొత్తవారే. వారందరికీ స్టార్టప్ మైండ్‌సెట్ ఉంది. ఆంధ్రప్రదేశ్ ఒక స్టార్టప్ స్టేట్. మేమంతా రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలన్న తపన, పట్టుదలతో పనిచేస్తున్నాం అన్నారు. దక్షిణాసియాలో తొలి 158 బిట్ క్వాంటమ్ కంప్యూటర్ జనవరిలో అమరావతికి రాబోతోంది. ప్రధాని మోదీ క్వాంటమ్ మిషన్‌ను ముందుండి నడిపించేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. దీని ద్వారా అమరావతిలో అద్భుతమైన ఎకో సిస్టమ్ ఏర్పాటు- కాబోతోంది.

# 140 కోట్ల మందికి ప్రయోజనం కలిగేలా జీఎస్టీ

**జీఎస్టీ సంస్కరణలతో పేద, మధ్య తరగతికి ఊరట**

**ముఖ్యంగా వ్యవసాయరంగంపై భారీ ఓదార్పు**

**ఉప్పులు, పప్పులు,సబ్బులవంటి నిత్యావసరాల ధరలు తగ్గుదల**

**కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి**




విశాఖపట్నం,సెప్టెంబర్17: దేశంలోని 140 కోట్ల మందికి వర్తించే విధంగా జీఎస్టీపై పెద్ద నిర్ణయం తీసుకున్నామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాలు ఈనెల 22 నుంచి అమల్లోకి వస్తాయని చెప్పారు. విశాఖపట్నంలోని మధురవాడలో జీఎస్టీ సంస్కరణలపై నిర్వహించిన సమావేశంలో నిర్మలా సీతారామన్ మాట్లాడారు. ప్రధానంగా వ్యవసాయరంగానికి ఎంతో మేలు చేకూర నుందని అన్నారు. రైతులకు మేలు చేసే విషయంలో నష్టమైనా ఫర్వాలేదని ప్రధాని మోడీ పట్టుబట్టారని అన్నారు. ఇప్పటికే అనేక రంగాల్లో జీఎస్టీ ప్రయోజనాలు చేకూరాయి. నాలుగు శ్లాబ్‌ల నుంచి రెండు శ్లాబ్‌లకు తగ్గించాం. 12 శాతంలో ఉండే వస్తువులు దాదాపు 99 శాతం 5 శాతం శ్లాబ్ పరిధిలోకి తీసుకొచ్చాం. 28 శాతం శ్లాబ్‌లో ఉండే సిమెంట్ సహా 90 శాతం వస్తువులు 18 శాతం శ్లాబ్ పరిధిలోకి తెచ్చాం. 2017కు ముందు 17 రకాల పన్నులు ఉండేవి.. వాటిపై 8 సెస్సులు కూడా ఉండేవి. ఉదాహరణకు 2017కు ముందు సబ్బు ధర ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా ఉండేది. అన్నింటినీ కలిపి దేశవ్యాప్తంగా ఒకే పన్ను.. నాలుగు శ్లాబ్‌ల రూపంలో తీసుకొచ్చిందే జీఎస్టీ అని అన్నారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ ద్వారా రూ.7.19లక్షల కోట్ల ఆదాయం వచ్చింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.22.08 లక్షల కోట్ల ఆదాయం లభించింది. ప్రజలపై భారం తగ్గించేందుకే జీఎస్టీ తీసుకొచ్చాం. పాలు, పెరుగు సహా పలు నిత్యావసరాలను 5 శాతం శ్లాబ్ నుంచి సున్నా శాతానికి తీసుకొచ్చాం. మధ్యతరగతికి ఉపశమనం కలిగించేలా చర్యలు తీసుకున్నాం. కారు, ఫ్రిజ్, ఏసీని 28 శాతం నుంచి 18 శాతానికి తీసుకొచ్చాం. ఆత్మనిర్భర్ భారత్‌కు జీఎస్టీ నూతన సంస్కరణలు పెద్ద ఊతం. మహిళల ఆరోగ్యం కోసం శానిటరీ న్యాప్‌కిన్స్‌పై పన్నును సున్నా చేశాం. యూపీఏ ప్రభుత్వంలో 30 శాతం ఉన్న వస్తువులను ఇప్పుడు 5 శాతానికి తెచ్చాం. సరళతరమైన పన్ను విధానాన్ని తీసుకురాలేని వాళ్లు ఇప్పుడు విమర్శలు చేస్తారా? గతంలో 65 లక్షల మంది పన్ను చెల్లింపుదారులు ఉండేవాళ్లు. ఈ 8 ఏళ్లలో ఆ సంఖ్య 1.51 కోట్లకు చేరిందని నిర్మలా సీతారామన్ వివరించారు. ఇప్పటికే అనేక రంగాల్లో జిఎస్టి ప్రయోజనాలు చేకూరాయని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. జిఎస్టి స్లాబులను నాలుగు నుంచి రెండుకు తగ్గించామని అన్నారు.అన్నింటినీ కలిపి ఒకే పన్ను, నాలుగు స్లాబ్ లుగా తీసుకొచ్చిందే జిఎస్టి అని తెలియజేశారు.

# యూరియా కొరత లేకుండా చర్యలు

**ప్రజలుసంతోషంగా ఉన్నా..వైసిపికి కడుపుమంటే**

**మంత్రి కొల్లు రవీంద్ర ఘాటు విమర్శలు**



అమరావతి,సెప్టెంబర్17:రైతులకు యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజలు ఆదరిస్తున్నారని మీడియా సమావేశంలో వెల్లడించారు. రైతులకు ఎప్పుడు ఇబ్బంది వచ్చినా ఆదుకుంటున్నామన్నారు. ప్రజలంతా సంతోషంగా ఉన్నారని.. కానీ, వైకాపాకు మాత్రం కడుపుమంటగా ఉందని విమర్శించారు.

# నేటినుంచి ఎపి అసెంబ్లీ సమావేశాలు

**అధికారులతో సమీక్షించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు**

**వైకాపా ఎమ్మెల్యేలు సభకు రావాలని సూచన**

అమరావతి,సెప్టెంబర్17: రాష్ట్ర నుంచి అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 9:00 గంటలకు శాసనసభ, 10:00 గంటలకు శాసన మండలి సమావేశాలు మొదలవుతాయి. అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి చీఫ్ సెక్రటరీ , డీజీపీతో పాటు- ఇతర కీలక అధికారులు హాజరయ్యారు. అసెంబ్లీ సమావేశాలకు పటిష్ట భద్రతపై చర్చించారు. ఉభయ సభలు ప్రశ్నోత్తరాలతో ప్రారంభం కానున్నాయి. ప్రజలకు సంబంధించిన కీలక అంశాలపై సభ్యులు ప్రశ్నలు వేస్తారు. ప్రశ్నోత్తరాల అనంతరం శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ సమావేశమవుతుంది. సీఎస్,




డీజీపీ, ఉన్నతాధికారులతో సమీక్ష ముగిసిన అనంతరం సభ్యులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు- చేయాలని అయ్యన్నపాత్రుడు ఆదేశించారు. ఇదిలావుంటే ఎమ్మెల్యేలంతా అసెంబ్లీకి రావాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు కోరారు. తమ తమ ప్రాంత సమస్యల పరిష్కారానికి ఇదో సదావకాశంగా ఎమ్మెల్యేలు తీసుకోవాలని సూచించారు. అయ్యన్నపాత్రుడుగా నాకు గౌరవం ఇమ్మనట్లేదు, కానీ సభాపతి స్థానానికి గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత వైసీపీ ఎమ్మెల్యేలకు ఉందని గుర్తుచేశారు. సభకు వస్తే ప్రజా సమస్యలు చర్చించేందుకు అందరికీ అవకాశం కల్పిస్తానన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకుండా తిరగటం మంచిది కాదని హెచ్చరించారు. ఉదయం బీఏసీ సమావేశంలో సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలనే దానిపై నిర్ణయిస్తామని పేర్కొన్నారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో సభ్యులకు సమాధానాలు సకాలంలో చేరాలని అధికారుల్ని ఆదేశించి నట్లు అయ్యన్నపాత్రుడు చెప్పారు.

# ఓటర్ల జాబితా ప్రక్షాళలను స్వాగతిస్తున్నాం

**చొరబాటుదారులను కాపాడే యత్నంలో రాహుల్**

**మండిపడ్డ కేంద్రహోంమంత్రి అమిత్ షా**



న్యూఢిల్లీ,సెప్టెంబర్17: ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసం 'ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియకు భాజపా మద్దతిస్తోందని కేంద్ర మంత్రి అమిత్ షా వెల్లడించారు. చొరబాటుదారుల ఓట్లతో గెలవాలని కాంగ్రెస్ చూస్తోందని ఆరోపించారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా దిల్లీలోని త్యాగరాజ్ స్టేడియంలో స్థానిక ప్రభుత్వ పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. చొరబాటుదారులను కాపాడేందుకే రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఇటీవల 'ఓటర్ అధికార్ యాత్ర' నిర్వహించింది. వారి ఓట్లతో ఎన్నికల్లో గెలవాలని చూస్తోంది.

# సంపాదకీయం

గురువారం 18-09-2025

## వలసల ఉద్యమం...

అభివృద్ధి చెందిన దేశాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య వలసలు. ఆయా దేశాల్లో జీవన ప్రమాణాలు అత్యున్నతంగా ఉండటం, ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెండుగా ఉండటంతో ఇతర దేశాల నుంచి వలసలు బాగా పెరిగిపోయాయి. గతంలో వారికి సాదర స్వాగతం లభించేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. చాలా దేశాలలో "స్థానికులకే ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు దక్కాలి" అనే నినాదంతో నిరసనలు, ఉద్యమాలు ఊపందుకుంటున్నాయి.లండన్ నగర కేంద్రంలో వలసదారుల వ్యతిరేకంగా భారీ ఆందోళన జరిగింది. వేలాది మంది ప్రజలు పాల్గొన్న ఈ నిరసనలో, ప్రభుత్వం విధానాలను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. యూరప్‌లో వలసదారులపై పెరుగుతున్న వ్యతిరేకత మరోసారి స్పష్టమవుతోంది. యూనైటెడ్ కింగ్ డమ్ (బ్రిటన్) రాజధాని లండన్ లో అనూహ్య రీతిలో చోటు చేసుకున్న నిరసన ఇప్పుడు ప్రపంచాన్ని ఆకర్షిస్తోంది. యూకే చరిత్రలోనే అతి పెద్ద నిరసనగా దీన్ని అభివర్ణిస్తున్నారు. వలసలకు వ్యతిరేకంగా చేపట్టిన ర్యాలీలో లండన్ రోడ్లపైకి 1.10 లక్షల మంది వచ్చి నిరసన తెలిపారు. దీనికి వ్యతిరేకంగా స్టాండ్ అప్ టు రేసిజిమ్ పేరుతో మరో నిరసన జరిగింది.లండన్ లో ఈ నిరసనకు వలసలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న కార్యకర్త టామీ రాబిన్సన్ ఆధ్వర్యంలో యునైట్ ది కింగ్ డమ్ పేరుతో ఈ ప్రదర్శనను నిర్వహించారు. ఈ ప్రదర్శనల్లో అమెరికా.. ఇజ్రాయెల్ జెండాల్ని కొందరు నిరసనకారులు ప్రదర్శించారు. అంతేకాదు.. యూకే ప్రధాని కీర్ స్టార్మర్ విధానాల్ని తప్పుపడుతూ నినాదాలు చేశారు. వలసల్ని వెంటనే వెనక్కి పంపేయాలంటూ వలసలకు వ్యతిరేకంగా నినాదాలు రాసి ఉన్న ప్లకార్డుల్ని పెద్ద ఎత్తున ప్రదర్శించారు. ఈ నిరసనల్లో పాల్గొన్న వారిలో కొందరు మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ అనే క్యాప్షన్ ఉన్న టోపీల్ని ధరించటం గమనార్హం.ఇటీవల కాలంలో బ్రిటన్ కు అక్రమ వలసలు భారీగా పెరిగాయి. ఒక అంచనా ప్రకారం ఈ ఏడాది ఇప్పటివరకు 28 వేల మందికి పైగా వలసదారులు పడవల ద్వారా బ్రిటన్ కు చేరుకున్నట్లుగా కొన్ని రిపోర్టులు చెబుతున్నాయి. ఇలా వలసలు పెద్ద ఎత్తున చేరుకోవటంపై స్థానిక జనాభా ఆగ్రహంతో ఉన్నారు. అంతేకాదు.. వలసల్ని ప్రభుత్వం హోటళ్లలో ఉంచటాన్ని తప్పు పడుతున్నారు. అక్రమ వలసలు దేశానికి భారంగా మారినట్లుగా యాంటీ ఇమిగ్రేషన్ నిరసనకారులు మండిపడుతున్నారు.ఈ ర్యాలీకి నాయకత్వం వహించిన టామీ రాబిన్ సన్ కు ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ లాంటి ప్రముఖుల మద్దతు ఉందన్న వార్తలు వస్తున్నాయి. వలసదారులు దేశ వనరుల్ని వాడేస్తున్నారని.. స్థానిక ఉద్యోగాల్ని కొల్లగొడుతున్నట్లుగా నిరసనకారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే బ్రిటన్ ఆర్థికవ్యవస్థ తీవ్రకష్టాల్లో ఉంటే.. అక్రమ వలసదారులు దేశానికి భారంగా మారటమేకాదు.. తమ జాతీయ గుర్తింపు.. సాంస్కృతి విలువలు ప్రమాదంలో పడుతున్నట్లుగా భావిస్తున్నారు. నిరసనకారులకు నాయకత్వం వహిస్తున్న టామీ రాబిన్సన్ జర్నలిస్టుగా పని చేస్తున్నారు.వలసలకు వ్యతిరేకంగా నిరసనలు తెలుపుతున్న వారికి వ్యతిరేకంగా "స్టాండ్ అప్ టు రేసిజమ్" పేరుతో నిరసన చేపట్టారు. ఇందులో కేవలం 5 వేల మంది మాత్రమే పాల్గొన్నారు. వీరు తమ నిరసనలు తెలిపే వేళలో చేసిన రచ్చ అంతా ఇంతా కాదు. పోలీసుల ముందస్తు జాగ్రత్తల కారణంగా ఈ రెండు వర్గాలు ఒకరి ఎదుట మరొకరు పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. పోటాపోటీగా నిరసనలు నిర్వహించిన నిరసనకారులు ఎదురుపడి ఉంటే పెద్ద సమస్యగా మారటమే కాదు శాంతిభద్రతల సమస్య ఉత్పన్నమయ్యేదని చెబుతున్నారు.స్టాండ్ అప్ టు రేసిజమ్ పేరుతో నిరసనలు తెలిపిన ఐదువేల మంది సమూహం పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వీరిని చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నించగా.. వారిపై వాటర్ బాటిళ్లు.. ప్లకార్డులతో దాడికి పాల్పడ్డారు. ఈ అల్లర్లతో దాదాపు 26 మంది పోలీసు అధికారులు గాయపడగా.. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెబుతునారు. ఈ అల్లర్లకు కారణమైన వారిలో పాతిక మందిని పోలీసులు అరెస్టు చేసినట్లుగా తెలుస్తోంది. అల్లర్లలో పాల్గొన్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోనున్నట్లుగా పోలీసు ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు. వలసలకు వ్యతిరేకంగా యూకే చరిత్రలో ఇప్పటివరకు ఎప్పుడూ లేని రీతిలో నిర్వహించిన ఈ భారీ ర్యాలీ రానున్న రోజుల్లో తీవ్రమైన రాజకీయ పరిణామాలకు కారణమవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. విదేశాల నుంచి వచ్చిన వలసదార్లు, ప్రధానంగా భారతీయులకు వ్యతిరేకంగా ఆదివారం ఆస్ట్రేలియాలోని పలు నగరాల్లో ప్రదర్శనలు జరిగాయి. ఒక ప్రణాళిక ప్రకారం 'మార్చ్ ఫర్ ఆస్ట్రేలియా' పేరుతో ఈ ప్రదర్శనలను నిర్వహించారు. భారతీయుల వలసలు దేశ సంస్కృతికి ముప్పు కలిగిస్తున్నాయని నిర్వాహకులు ఆరోపించారు. ఇది 'కొత్త సంస్కృతి స్థాపన'కు దారి తీస్తుందని అభిప్రాయపడ్డారు. 100 ఏళ్లలో వచ్చిన గ్రీకులు, ఇటాలియన్ల కన్నా అయిదేళ్లలో వచ్చిన భారతీయుల సంఖ్యే అధికంగా ఉందని విమర్శించారు. ఉంది. లండన్ వీధుల్లో ఏకంగా లక్షన్నర మంది వలసలకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలో పాల్గొనడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. జర్మనీ, డబ్లిన్, వార్సా వంటి నగరాల్లోనూ ఇదే తరహా ఆందోళనలు జరిగాయి. ఈ పరిణామాలన్నీ విదేశాల్లో విద్య, ఉద్యోగాల కోసం వెళ్లే భారతీయులపై ప్రతికూల ప్రభావం చూపుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కేవలం ఆర్థిక భద్రతే కాకుండా, సామాజిక భద్రత కూడా కరవయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ వలస వ్యతిరేక నిరసనలు ముదిరితే, భారతీయులే లక్ష్యంగా జాతి విద్వేష దాడులు జరిగే ప్రమాదం లేకపోలేదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# మోడీకి ట్రంప్ కాల్...

### బర్త్ డే విషెస్ చెప్పిన అమెరికా ప్రెసిడెంట్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఫోన్ చేసి 75వ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. దీనికి ప్రధాని మోదీ అధ్యక్షుడు ట్రంప్‌నకు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల ట్రంప్ సుంకాల తర్వాత, భారత్-అమెరికా మధ్య సంబంధాలలో కొంత ఉద్రిక్తత నెలకొంది. కానీ ఇప్పుడు ఈ ఉద్రిక్తత నెమ్మదిగా తొలగిపోతోంది. రెండు దేశాల మధ్య సంబంధాలు ఇప్పుడిప్పుడే తిరిగి గాడిన పడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ట్రంప్ ఫోన్ కాల్ ప్రాధాన్యత సంతరించుకుంది.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఫోన్ చేసి 75వ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. దీనికి ప్రధాని మోదీ అధ్యక్షుడు ట్రంప్‌నకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాని మోదీ ట్వీట్ చేస్తూ, "ధన్యవాదాలు నా మిత్రమా, నా 75వ పుట్టినరోజు




సందర్భంగా మీ ఫోన్ కాల్, శుభాకాంక్షలకు ధన్యవాదాలు. మీలాగే, నేను కూడా భారతదేశం-అమెరికా ప్రపంచ భాగస్వామ్యాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లడానికి పూర్తిగా కట్టుబడి ఉన్నాను. ఉక్రెయిన్ వివాదానికి శాంతియుత పరిష్కారం కోసం మీరు చేస్తున్న చొరవకు మేము మద్దతు ఇస్తున్నాము." అంటూ ప్రధాని మోదీ పేర్కొన్నారు.ట్రంప్ సుంకాల తర్వాత, భారత్-అమెరికా మధ్య సంబంధాలలో కొంత ఉద్రిక్తత నెలకొంది. కానీ ఇప్పుడు ఈ ఉద్రిక్తత నెమ్మదిగా తొలగిపోతోంది. రెండు దేశాల మధ్య సంబంధాలు ఇప్పుడిప్పుడే తిరిగి గాడిన పడుతున్నాయి. మంగళవారం (సెప్టెంబర్ 16) భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై చర్చించారు. చర్చల తర్వాత, దీనిపై భారతదేశ ప్రకటన కూడా వచ్చింది. ప్రతిదీ సానుకూలంగా ఉందని భారత్ సర్కార్ తెలిపింది. భారతదేశంతో ఒప్పందంలో ఎటువంటి అడ్డంకులు ఉండవని అటు అమెరికన్ చీఫ్ నెగోషియేటర్ బ్రెండన్ లించ్ హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో భారత అదనపు కార్యదర్శి రాజేష్ కూడా పాల్గొన్నారు. వాణిజ్య భాగస్వామ్యం, ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన ముఖ్యమైన అంశాలపై సమావేశంలో చర్చించారు. మంగళవారం జరిగిన ఈ సమావేశంలో, నవంబర్ నాటికి ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం మొదటి దశను పూర్తి చేయడంపై ఇరుపక్షాలు చర్చించాయి. దీంతో పాటు, ఆరవ రౌండ్ చర్చలు ఎప్పుడు ప్రారంభమవుతాయి. ఏ అంశాలపై చర్చించాలో కూడా నిర్ణయించారు.భారతదేశంపై 50 శాతం సుంకం విధించిన తర్వాత రెండు దేశాల మధ్య సంబంధాలు క్షీణించాయి. వాస్తవానికి, భారతదేశం రష్యా నుండి చమురు కొనుగోలు చేయకూడదని అమెరికా కోరుకుంది. ఇటీవల దీనిపై అభ్యంతరాలు వ్యక్తం చేసింది. భారతదేశం రష్యా నుండి చౌకగా చమురు కొనుగోలు చేసి దాని నుండి భారీ లాభాలను ఆర్జిస్తోందని అమెరికా చెప్పింది. దీనిపై భారతదేశం తీవ్రంగా స్పందించింది. దీని తర్వాత, రెండు దేశాల మధ్య కొంతకాలంగా ఉద్రిక్తతలు పెరిగాయి.

# అటెండన్స్ పక్కా చేసిన సీబీఎస్ఈ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డు తాజాగా కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించే 10, 12 తరగతుల బోర్డు పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల అర్హత నిబంధనలను మరింత కఠినతరం చేస్తూ ప్రకటన వెలువరించింది. కఠినమైన విద్యా పనితీరు, కనీస అటెండెన్స్ లేకుండా ఏ విద్యార్థి పరీక్షలు రాయడానికి వీలులేదంటూ స్పష్టం చేసింది. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలోని సీబీఎస్ఈ ఈ మేరకు నూతన మార్గదర్శకాలను జారీ చేసింది. జాతీయ విద్యా విధానం 2020కి జవాబుదారీతనం, క్రమశిక్షణ, సరైన అమలును నిర్ధారించడానికి వీటిని జారీ చేసింది. రెగ్యులర్ తరగతులకు హాజరు కాకుండా నమోదు చేసుకునే డమ్మీ విద్యార్థులు, తగిన సౌకర్యాలు లేకుండా అనుమతి లేని సబ్జెక్టులను అందించే పాఠశాలలు, ఇంటర్నల్ అసెస్మెంట్‌కు హాజరుకాని విద్యార్థుల కోసం వీటిని తీసుకువచ్చినట్లు బోర్డు పేర్కొంది.బోర్డు నూతన మార్గదర్శకాలు ఇవే..సీబీఎస్ఈ అధికారికంగా పదవ తరగతి, పన్నెండో తరగతిని రెండేళ్ల ప్రోగ్రామ్‌లుగా పరిగణిస్తున్నట్లు ప్రకటించింది. అంటే తొమ్మిదవ తరగతి, పదో తరగతి కలిసి 10వ తరగతి పరీక్షకు పూర్తి కోర్సుగా ఏర్పడతాయి. అలాగే 11వ తరగతి, పన్నెండో తరగతి కలిసి 12వ తరగతి పరీక్షకు పునాదిగా నిలుస్తాయి. బోర్డు తరగతుల్లో తీసుకున్న ఏదైనా సబ్జెక్టు వరుసగా రెండు సంవత్సరాలు చదివి ఉండాలి.ఆలస్యంగా చేరడం లేదా ఫౌండేషన్ తరగతులను దాటవేసే విద్యార్థులు బోర్డు పరీక్షలకు అనర్హులు.బోర్డు పరీక్షలకు అర్హత సాధించాలంటే విద్యార్థుల కనీస హాజరు 75 శాతం కలిగి ఉండాలి. ఈ మేరకు పాఠశాలలు రోజువారీ రిజిస్టర్లను నిర్వహించాల్సి ఉంటుంది.వైద్యపరమైన అత్యవసర పరిస్థితులు, జాతీయ స్థాయిలో క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనడం వంటి తీవ్రమైన పరిస్థితులలో మాత్రమే 25 శాతం వరకు హాజరు మినహాయింపు ఉంటుంది. అయితే తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే డాక్యుమెంటేషన్ ఉండాలి.హాజరు తక్కువగా ఉండి, సరైన కారణాలు లేని విద్యార్థులు రెగ్యులర్ అభ్యర్థులుగా నమోదు చేసుకున్నారా? లేదా? అనే దానితో సంబంధం లేకుండా అనర్హులుగా గుర్తిస్తారు.ఔఇఖ-2020 ప్రకారం అంతర్గత మూల్యాంకనాలు ఇకపై ఐచ్ఛిక యాడ్-ఆన్ కాదు. ఇంటర్నర్ అసెస్మెంట్ (అంతర్గత మూల్యాంకనం) రెండు సంవత్సరాల పాటు నిర్వహించబడుతుంది.పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరు కాని విద్యార్థులు ఈ మూల్యాంకనాలను కోల్పోవల్సి ఉంటుంది.అంతర్గత మూల్యాంకన రికార్డులు లేకుండా, సీబీఎస్ఈ ఫలితాలను ప్రకటించదు. అటువంటి విద్యార్థులు థియరీ పరీక్షలకు హాజరైనప్పటికీ 'ఎసెన్షియల్ రిపీట్' విభాగంలో ఉంచబడతారు.పదవ తరగతి విద్యార్థులు తప్పనిసరి ఐదు సబ్జెక్టులకు అదనంగా మరో రెండు సబ్జెక్టులను ఎంచుకోవచ్చు.పన్నెండో తరగతి విద్యార్థులు ఒక అదనపు సబ్జెక్టును మాత్రమే తీసుకోవడానికి అవకాశం ఉంటుంది. రెండేళ్ల ప్రోగ్రామ్ అంతటా వీటిని చదవవల్సి ఉంటుంది.ఉపాధ్యాయులు, సీబీఎస్ఈ స్కూల్ అధికారిక అనుమతి లేకపోతే విద్యార్థులు ప్రధాన లేదా అదనపు పేపర్ల సబ్జెక్టులను నమోదు చేసుకోవడానికి అనుమతి ఉండదు.గతంలో అదనపు సబ్జెక్టులను ఎంచుకున్న విద్యార్థులు కంపార్ట్మెంట్ లేదా ఎసెన్షియల్ రిపీట్ కేటగిరీలలో ఉంచబడిన వారు ప్రైవేట్ అభ్యర్థులుగా పరీక్ష రాయాల్సి ఉంటుంది.నిర్దేశించిన రెండేళ్ల అధ్యయనం, హాజరు నిబంధనలను పాటించని విద్యార్థులు ప్రైవేట్ అభ్యర్థులుగా అదనపు సబ్జెక్టులను ఎంచుకోవడానికి అనర్హులు.రెండేళ్ల తరగతి గది అభ్యాసం, తప్పనిసరి హాజరు, నిరంతర అంతర్గత మూల్యాంకనంతో అనుసంధానించడానికి సీబీఎస్ఈ 360-డిగ్రీల విధానాన్ని అమలు చేస్తోంది. ఈ సంస్కరణలు ఔఇఖ-2020కి అనుగుణంగా ఉన్నాయి. ఇది బట్టీ విధానం, పరీక్ష-కేంద్రీకృత అభ్యాసం కంటే సమగ్రమైనది.

# బొడ్డెమ్మ అయింది..ఇక బతుకమ్మ



హైదరాబాద్, సెప్టెంబర్ 17,తెలంగాణలో సంస్కృతి, సంప్రదాయాలు ప్రకృతితో ముడిపడి ఉంటాయి. తెలంగాణ ప్రాంతంలో మాత్రమే జరుపుకొనే బొడ్డెమ్మ, బతుకమ్మ పండుగలు విశిష్టమైనవి. బాలికలు, మహిళలకు ఎంతో ఉత్సాహాన్ని, ఆప్యాయత, అనురాగాలకు ఈ రెండు పండుగలు ప్రత్యేకం. ఇవి మట్టి, పూలతో సంబంధం ఉన్న ప్రకృతి పండుగలు. సెప్టెంబర్ 12న బొడ్డెమ్మ వేడుకలు ప్రారంభమయ్యాయి.భాద్రపద మాసంలో వచ్చే పౌర్ణమిని బొడ్డెమ్మల పున్నమి అంటారు. ఈ నెలలో పౌర్ణమి తర్వాత వచ్చే పంచమి నుంచి చతుర్దశి వరకు బొడ్డెమ్మ పండుగ జరుపుకొంటారు. ఈ మట్టి పూల పండుగ ముఖ్యంగా బాలికలకు సంబంధించినది. తొమ్మిది రోజులు సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 7 నుండి 8 గంటల వరకు యువతుల జీవన విధానం, ప్రకృతి, గౌరీదేవిని కలగల్పుకొని ఆటపాటలతో తొమ్మిది రోజులు ఆడుకుంటారు. తొమ్మిదవ రోజు రాత్రి బొడ్డెమ్మను స్థానిక చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేస్తారు.యువతులు, మహిళలు అందరూ బొడ్డెమ్మ వద్ద అడుకున్నా. బొడ్డెమ్మ ను కాలనీ లో లేదా గల్లి లో ఆనవాయితీ ప్రకారం మాత్రమే బొడ్డెమ్మను (వేస్తారు) రూపొందిస్తారు. చుట్టుపక్కల బాలికలంతా బొడ్డెమ్మ ఆటపాటల్లో పాల్గొంటారు. ఆచారం ఉన్న కుటుంబాల్లో బాలికలతో దీన్నొక నోముగా పట్టిస్తారు. బాలికకు మూడు లేదా ఐదేండ్లప్పుడు ఈ నోమును పట్టించి యుక్తవయసు వచ్చేవరకు కొనసాగిస్తారు. అమ్మాయికి పెళ్లి కావాలని, వైవాహిక జీవితం బాగుండాలని గౌరీదేవిని అర్చించే నోము ఇది. బొట్టె, బొడ్డె అంటే చిన్న అని. బొడ్డెమ్మ అంటే చిన్న పిల్ల అనే అర్థంతో ఈ పండుగ జరుపుకొంటారు.బొడ్డెమ్మను వేసేవారు చెరువు దగ్గరకు వెళ్ళి పుట్టమన్ను తెచ్చి నీటితో తడిపి ఒక చెక్క పీటపై నాలుగు మూలలతో ఐదు అంతస్తులుగా పేరుస్తారు. ఆపైన ఒక చెంబు, ఆ పైన జాకెట్ ముక్క పెట్టీ బియ్యం పోస్తారు. ప్రతి రోజు అనగా తొమ్మిది రోజులు సాయంత్రం ఎర్రమట్టి అలికి బియ్యం పిండి, కుంకుమ, పసుపుతో పాటు సహజ సిద్ధంగా దొరికే పూలతో అందంగా అలంకరిస్తారు. ఇలా తొమ్మిది రోజులు అమ్మాయిలు, మహిళలు చప్పట్లు, కోలాటాలతో పాటలు పాడుతూ చుట్టూ తిరుగుతారు. సంధ్యా సమయంలో దేవతలు ఇంటిలోకి ప్రవేశిస్తారనే విశ్వాసంతో ఈ ఆట ఆడతారు. పూజలో రోజుకొక రకం ప్రసాదాన్ని నైవేద్యంగా సమర్పిస్తారు. బొడ్డెమ్మ బొడ్డెమ్మా కోల్... బిడ్డాలెందారే కోల్... నా బిడ్డలేడుగురు కోల్... నీళ్ళల్లో పడ్డారూ కోల్... అంటూ పాడుకుంటారు. చిన్న చిన్న గుళ్ళు చిత్తారి గుళ్ళు... చూస్తూ చూస్తూ మా తాత సున్నమేయించాడు. నవ్వుతూ మా నాన్న నంది తెప్పించాడు అని ఇలా రకరకాల పాటలు పాడుతూ బొడ్డెమ్మను కొలుస్తారు.ఆట ముగిశాక అందరూ చుట్టూ కూర్చొని నిద్రపో బొడ్డెమ్మ... నిద్రపోమ్మా. నిద్రాకు నూరేండ్లు నీకు వెయ్యేండ్లు. నిన్ను గన్నతల్లికి నిండునూరేండ్లు. అంటూ అన్ని రకాల పూల పేర్లు వచ్చే పాటలు పాడుతారు.పీట బొడ్డెమ్మ, గుంట బొడ్డెమ్మ, పందిరి బొడ్డెమ్మ, బాయి బొడ్డెమ్మ, అంతరాల బొడ్డెమ్మ అనే పేర్లతో బొడ్డెమ్మను తయారుచేస్తారు. బొడ్డెమ్మను పీట పై రూపొందించిన కొందరు పందిరి వేయడం, కేవలం పీఠం పై రూపొందించిన ఇలా కొలిచిన భావం ఒక్కటే.

# అక్టోబరు 1 నుంచి రైల్వే కొత్త నిబంధనలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17, )తక్కువ ఖర్చులో సుదూరం ప్రయాణించడానికి రైలు ప్రయాణమే ఉత్తమమైన మార్గం. కొన్ని ప్రాంతాల్లో కేవలం రైలు ప్రయాణాలపైనే ఆధారపడతారు. ఎందుకంటే ఈ ప్రయాణంలో ఎలాంటి అలసట ఉండదు. అంతేకాకుండా చార్జీలు కూడా తక్కువగా ఉంటాయి. ఎంత దూరమైనా వెళ్లే అవకాశం ఉంటుంది. అయితే రైలు ప్రయాణం చేసే సమయంలో రైల్వే బోర్డ్ విధించే నిబంధనలను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికే ఎన్నో రకాల నియమాలను రైల్వే బోర్డ్ ప్రవేశపెట్టింది. ముఖ్యంగా టికెట్ల బుకింగ్ విషయంలో ఎప్పటికప్పుడు కొత్త నిబంధనలను తీసుకొస్తుంది. తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇవి అక్టోబర్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. సాధారణంగా రిజర్వేషన్ టికెట్ బుక్ చేసుకోవడానికి మూడు నెలల ముందే సెర్చ్ చేస్తూ ఉండాలి. ఈ సమయంలో ఏ ట్రైన్ అవైలబుల్ ఉందో దానిని సెలెక్ట్ చేసుకుని బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. తిరుపతి, ముంబై, ఢిల్లీ వంటి ముఖ్యమైన ప్రాంతాలకు నిత్యం ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ఈ రూట్లో ఎప్పుడూ టికెట్ల డిమాండ్ ఉంటుంది. ఆయా రూట్లో రిజర్వేషన్ టికెట్స్ రిలీజ్ చేసిన వెంటనే బుకింగ్ అయిపోతాయి. అయితే కొందరు అక్రమార్కులు కొన్ని సాఫ్ట్వేర్ల ద్వారా ఈ టికెట్లను బుక్ చేసి బ్లాక్ లో అమ్ముకుంటున్నారు. దీంతో సాధారణ ప్రయాణికులు వీటిని దక్కించుకునే అవకాశం లేకుండా పోయింది.అయితే ఈ సమస్యను గుర్తించిన రైల్వే బోర్డ్ తాజాగా కొత్త నిబంధనలను తీసుకొచ్చింది. ఎవరైతే రైల్వే టికెట్ బుక్ చేసుకుంటారో.. వారి ఆధార్ అతెంటికేషన్ తప్పనిసరిగా చేసింది. అంటే ప్రయాణికులు ఎవరైనా ఎఖీఉఅ ద్వారా టికెట్ బుక్ చేసుకోవాలని అనుకుంటే తమ ఆధార్ను వెరిఫై చేయాల్సి ఉంటుంది. ఈ నిబంధన ఇప్పటివరకు తత్కాల్ టికెట్లకు ఉంది. ఇప్పుడు కొత్తగా రిజర్వేషన్ టికెట్లకు కూడా వర్తింపజేయనున్నట్లు తెలుస్తోంది. దీని ద్వారా సాధారణ ప్రయాణికులు సైతం సొంతంగా టికెట్ బుక్ చేసుకుని అవకాశం ఉంటుంది. ఈ నిబంధన అక్టోబర్ 1 నుంచి అమల్లోకి రానున్నట్లు రైల్వే బోర్డు తెలిపింది.ఉదాహరణకు తిరుపతికి వెళ్లాలని అనుకునే వారు 60 రోజుల ముందే టికెట్ బుక్ చేసుకోవాలనుకుంటే.. తమ ఆధార్ ను తప్పనిసరిగా వెరిఫై చేసుకోవాల్సి ఉంటుంది. దీంతో కొందరు ట్రావెల్స్ ఏజెన్సీలు టికెట్లను పక్కదారి పట్టించే అవకాశం ఉండదు. అంతేకాకుండా సాధారణ ప్రయాణికులు సైతం నేరుగా టికెట్ బుక్ చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ప్రస్తుతం రిజర్వేషన్ టికెట్ బుకింగ్ లో ఆధార్ అథెంటికేషన్ లేకపోవడంతో కొంతమంది ఎక్కువగా టికెట్స్ బుక్ చేసుకుని ఇతరులకు బ్లాక్ లో అమ్ముతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ సమస్యలను నివారించడానికి కొత్తగా ఈ నిబంధనలు తీసుకొచ్చింది.

# గులాబీని బీట్ చేసేలా ప్రోగ్రామ్స్

హైదరాబాద్, సెప్టెంబర్ 17,బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన సొంత కార్యక్రమాలతో పార్టీ కంటే ముందుండేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎక్కువగా తన సోదరుడు కేటీఆర్ ను కార్యక్రమాల్లో బీట్ చేయడానికి నిర్ణయించుకున్నట్లు కనపడుతుంది. అందుకే కవిత నిర్ణయాలు బీఆర్ఎస్ పార్టీని కొంత ఇరుకునపడేస్తున్నాయి. అయితే కల్వకుంట్ల కవిత మాత్రం ఏ చిన్న అవకాశం వచ్చినా వదిలిపెట్టడం లేదు. కారు పార్టీ కన్నా జాగృతిని ముందుంచే ప్రయత్నం చేస్తున్నారు. అయితే కవిత వెనక కొందరు కార్యకర్తలు ఉన్నప్పటికీ, ఆమెకు సపోర్టుగా కుటుంబ సభ్యులు కానీ, పార్టీ సభ్యులు కానీ లేరు. తాను ఒంటరిగానే కార్యక్రమాలను చేపడుతూ ముందుకు వెళుతుండటంపై ఇప్పుడు చర్చ జరుగుతుంది. ఇక జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లోనూ పోటీ చేయాలని కవిత భావిస్తుంది. మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి కవితను కలవడంతో ఇప్పుడు చర్చనీయాంశమైంది.కవిత తాను బీఆర్ఎస్ లీడర్ నే అని చెప్పుకుంటున్నారు. తమ నేత కేసీఆర్ అంటున్నారు. కానీ కార్యక్రమాలు మాత్రం జాగృతి పేరుతో చేస్తున్నారు. కవిత ఈ సొంత రాజకీయం చేయడం పార్టీకి నష్టమా? లాభమా? అన్న చర్చ గులాబీ పార్టీ నేతల్లోనే వినిపిస్తుంది. రేపు భవిష్యత్ లో తెలంగాణ జాగృతి నేతలకు టిక్కెట్లు కావాలన్న డిమాండ్ కూడా కల్వకుంట్ల కవిత ఉంచబోతున్నట్లు సమాచారం. తన అనుచరులకు ఇన్ని సీట్లు ఇస్తేనే తాను పార్టీకి మద్దతుగా ఉంటానని, లేకపోతే వేరే కుంపటిపెట్టుకుంటానన్నహెచ్చరికలు కూడా చేసేఅవకాశాలు కనిపిస్తున్నాయి. అందుకే కల్వకుంట్ల కవిత సొంతంగా ప్రజా ఉద్యమాలు చేపడుతున్నారన్న అనుమానం పార్టీ నేతల్లో వ్యక్తమవుతుంది. కల్వకుంట్ల కవిత బీసీ రిజర్వేషన్ల కోసం ఆ మధ్య రైల్ రోకుకు పిలుపునిచ్చారు.అయితే ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీచేయడంతో ఆ కార్యక్రమాన్నివాయిదా వేసుకన్నారు. కానీ వ్యూహాత్మకంగా కాంగ్రెస్ పార్టీ తీసుకున్న నిర్ణయానికి సంబరాలు చేసి వాయిదా వేసుకున్నారు. భద్రాచలం రామాలయ భూముల గురించి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు. మహిళలకు డబ్బులు ఇస్తామన్న కాంగ్రెస్ హామీపై పోస్టు కార్డుల ఉద్యమం చేపట్టారు. అందులో స్వయంగా పాల్గొన్నారు కూడా. ధర్నా చౌక్ దగ్గర ఎవరైనా ధర్నాలు చేస్తుంటే వెళ్లి మద్దతు పలుకుతున్నారు. కవితతో పోటీగా రాజకీయాలు చేయడంలో బీఆర్ఎస్ విఫలవుతోందన్న కామెంట్స్ వినపడుతున్నాయి.. కవిత రాజకీయాలను ఎలా ఎదుర్కొనేందుకు అవసరమైన వ్యూహాలు మాత్రం లేవనే చెప్పాలి. కడుపు చించుకుంటే కాళ్ల మీద పడినట్లుంటుందన్న పరిస్థితిలో కారు పార్టీ ఉంది. కవితను సస్పెండ్ చేయడంతో ఆమె మరింత దూకుడుగా వ్యవహరించే అవకాశాలున్నాయి. కేసీఆర్ నుంచి సరైన నిర్ణయం కూడా లేకపోవడంతో ఎవరూ కిమ్మనడం లేదు. బీసీ రిజర్వేషన్లను ఆమోదించాలని ఈ దీక్షను సొంతంగానే చేపట్టారు. దీంతో బీఆర్ఎస్ కూడా ఆరోతేదీ కరీంనగర్ లో ఇదే అంశంపై ఆందోళన కార్కక్రమం చేపట్టాలని భావించింది.కానీ భారీ వర్షాలు కారణంగా అది వాయిదా వేసుకుంది. ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కవిత తన జాగృతి తరుపున అభ్యర్థిని దించితే బీఆర్ఎస్ గెలుపు పై ప్రభావం చూపుతుందని అంచనాలు విపడుతున్నాయి.

## హైదరాబాద్ లోనూ బ్రేక్ ఫాస్ట్ స్కీమ్

హైదరాబాద్, సెప్టెంబర్ 17, సరత్తు చేస్తోంది. హరేకృష్ణ ఫౌండేషన్ ద్వారా ఈ టిఫిన్ అందించనున్నారు. ఇందిరమ్మ క్యాంటీన్లలో త్వరలో ఈ బ్రేక్ ఫాస్ట్‌ను అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌ను ప్రారంభిస్తారని అధికారులు చెబుతున్నారు. హైదరాబాద్‌లో పేదవాళ్ల ఆకలి తీర్చేందుకు రూ.5 భోజన కార్యక్రమం 2013లో మొదలైంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జీహెచ్ఎంసీ పరిధిలోని రూ.5కే భోజనం అందిస్తున్న ఇందిరమ్మ క్యాంటీన్ల స్టాల్స్‌ను అధికారులు కొత్తగా మారుస్తున్నారు. ప్రస్తుతం 139 చోట్ల ఈ స్టాల్స్ ఉండగా.. వీటి సంఖ్యను 150కు పెంచారు. చాలా ఏళ్లుగా ఈ క్యాంటీన్లు ఏర్పాటు చేయడంతో కొన్ని డ్యామేజ్ అయ్యాయి. మరికొన్నిచోట్ల పూర్తిగా పాడై వినియోగించేందుకు వీలులేకుండా పోయాయి. దీంతో వీటి స్థానంలో రూ.11.43 కోట్లతో బల్దియా కొత్త వాటిని ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే 60 చోట్ల స్టాల్స్ ఏర్పాటు చేయగా.. గతంలో ఉన్న సైజుతో పోలిస్తే మూడింతలు ఎక్కువ స్పేస్ తో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. హరేరామ హరే కృష్ణ మూవ్‌మెంట్‌తో కలిసి ప్రభుత్వం రూ.5కే నాణ్యమైన, పౌష్టికరమైన భోజనాన్ని అందిస్తుంది.

అయితే, జీహెచ్ఎంసీ త్వరలో ఈ ఇందిరమ్మ క్యాంటీన్లలో రూ.5కే బ్రేక్ ఫాస్ట్ స్కీం ను అందుబాటు లోకి తేనున్నారు. ఒక్క బ్రేక్ ఫాస్ట్ కు రూ. 19 ఖర్చు అవుతుండగా.. ఇందులో రూ.5 ప్రజల నుంచి తీసుకుంటారు. ఇక జీహెచ్ఎంసీ రూ.14 భరించనుంది. ఈ పథకాన్ని ఈ నెలాఖరులోపు సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని అధికారులు చెబుతున్నారు.ఇందిరమ్మ క్యాంటీన్లలో త్వరలో అందుబాటులోకి బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ రానుంది. ఈ స్కీంలో భాగంగా ఒక్కో రోజు ఒక వెరైటీ టిఫిన్ పెట్టాలని జీహెచ్ఎంసీ భావిస్తోంది. సోమవారం నుంచి శనివారం వరకు ఆరు రోజులకు ఆరు రకాల పౌష్టికమైన టిఫిన్స్ పెట్టేందుకు జీహెచ్ఎంసీ మెనూ సిద్ధం చేసింది. ఇండ్లీ, పొంగల్, పూరి, ఉప్మా వంటి అల్పాహారాలు ఇందులో ఉన్నాయి. ఇప్పటికే ఇందిరమ్మ క్యాంటీన్ల ద్వారా రూ.5కే భోజనం అందిస్తుండగా.. రూ.5కే బ్రేక్ ఫాస్ట్ స్కీం అందుబాటులోకి వస్తే బస్తీ వాసులు, రోజువారీ కూలీలు, చిన్న ఉద్యోగులకు ఎంతో ఉపయోగపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. హైదరాబాద్ నగరంలో రోజుకు 25వేల మందికి బ్రేక్ ఫాస్ట్ అందించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## మేడారం సరికొత్తగా...




వరంగల్, సెప్టెంబర్ 17, తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన మేడారం జాతర ప్రాంగణాన్ని విస్తరించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. భక్తుల సౌకర్యార్థం సమ్మక్క, సారలమ్మ గద్దెల స్థానాల్లో మార్పులు చేసి, క్యూలైన్లను క్రమబద్ధీకరించనున్నారు. ట్రైబల్ డిజైన్స్ సంస్థ రూపొందించిన నూతన మాస్టర్‌ప్లాన్‌కు ఆమోదం లభించడంతో.. భక్తులకు మెరుగైన దర్శనం, సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.కుంభమేళాగా పిలుచుకునే ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం జాతరకు మహర్దశ పట్టనుంది. సమ్మక్క, సారలమ్మ గద్దెల ప్రాంగణాన్ని విస్తరించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ ట్రైబల్ డిజైన్స్ సంస్థ రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌కు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ కొత్త డిజైన్‌ను పూజారులు, ఆదివాసీ సంఘాలు కూడా ఆమోదించాయి. గతంలో భక్తులకు క్యూలైన్ల వల్ల పగిడిద్దరాజు, గోవిందరాజుల దర్శనం సరిగ్గా లభించేది కాదు. మహాజాతర సమయంలో ఇది భక్తులకు పెద్ద ఇబ్బందిగా మారింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు, కొత్త మాస్టర్‌ప్లాన్‌లో గద్దెల స్థానాల్లో మార్పులు చేశారు.గద్దెల ప్రాంగణంలో మొదట సమ్మక్క, తర్వాత సారలమ్మ, ఆ తర్వాత వరుస క్రమంలో పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెలు ఉంటాయి. భక్తుల సౌకర్యార్థం గద్దెల ప్రాంగణాన్ని కూడా విస్తరిస్తారు. గతంలో ఒక ప్రైవేట్ ఆర్కిటెక్ట్ రూపొందించిన డిజైన్‌ను పూజారులు వ్యతిరేకించడంతో, ఇప్పుడు ట్రైబల్ డిజైన్స్ సంస్థ చేసిన డిజైన్‌ను ప్రభుత్వం ఆమోదించింది. ఈ కొత్త డిజైన్‌లో గద్దెలను చిన్న మార్పులతో యథాతథంగా కొనసాగిస్తారు. ఈ ప్రాజెక్ట్ మేడారం మహాజాతరకు వచ్చే లక్షలాది భక్తులకు మెరుగైన దర్శనం, సౌకర్యాలు కల్పిస్తుందని భావిస్తున్నారు.మేడారం జాతరను ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతరగా పరిగణిస్తారు. ఈ జాతర ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి మాఘ మాసంలో (సాధారణంగా ఫిబ్రవరి నెలలో) జరుగుతుంది. గత ఏడాది 2024లో జరగ్గా.. మళ్లీ 2026లో మహా జాతర జరుగుతుంది. సమ్మక్క, సారలమ్మలు కరువు, పన్నుల సమస్యల నుండి తమ ప్రజలను రక్షించడానికి కాకతీయ రాజులతో పోరాడిన యోధులుగా పూజింపబడతారు. ఈ జాతర వారి త్యాగాలకు నివాళిగా గిరజనులు నిర్వహిస్తారు. భారతదేశం నలుమూలల నుంచి ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్రల నుండి లక్షలాది మంది భక్తులు ఈ జాతరలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకుంటారు. తాజాగా చేపట్టిన విస్తరణ పనులు పూర్తయితే, మేడారం మహా జాతరకు వచ్చే భక్తులకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి

## హైడ్రా కార్యాలయం ముందు హైడ్రా డిఆర్ఎఫ్ సిబ్బంది నిరసన

హైదరాబాద్,హైడ్రా డీఆర్ఎఫ్ సిబ్బంది బుధవారం నాడు నిరసనకు దిగారు. జీతంలో 5 వేలు కట్ చేసారని ఆందోళన చేసారు. రాత్రి , పగలు పనులు చేయించుకుని జీతం తగ్గించడం పై మండిపడ్డారు. గతంలో జిహెచ్ఎంసి అండర్లో ఈవిడిఎం లో డిఆర్ఎఫ్ సిబ్బంది పని చేసారు 1,100 మంది ఔట్సోర్సింగ్ సిబ్బంది . ప్రస్తుతం హైడ్రాలో డిఆర్ఎఫ్ లో విధులు నిర్వహిస్తున్నారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జీతాలపై అందరికీ ఒకేలా అందేలా రాష్ట్ర ప్రభుత్వం జీవో తెచ్చింది. ఈ జీవోతో 5వేల రూపాయల జీతం తగ్గిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు డిఆర్ఎఫ్ సిబ్బంది. ఇందులో సగానికి పైగా సిబ్బందికి ఈనెల 5వేల రూపాయలు జీతం తగ్గిందని ఆందోళనకు దిగారు. ఈరోజు నుండి విధులకు వెళ్లకుండా నిరసన వ్యక్తం చేస్తాం అంటున్నారు.

# 11 కోట్ల స్థలాన్ని కాపాడిన హైడ్రా

హైదరాబాద్, సెప్టెంబర్ 17, హైదరాబాద్ కొండాపూర్ మాధవ హిల్స్‌లోని వెయ్యి గజాల పార్క్ భూమిని ఆక్రమణల నుంచి హైడ్రా రక్షించింది. స్థానికుల ఫిర్యాదుతో వెంటనే స్పందించిన హైడ్రా అధికారులు, పోలీసు బందోబస్తు మధ్య గోడలు, షెడ్లను కూల్చివేశారు. సుమారు రూ.11.50 కోట్ల విలువైన ఈ స్థలాన్ని తిరిగి ప్రజలకు అందించారు. హైడ్రా వేగవంతమైన చర్యలు ప్రజల నమ్మకాన్ని పెంచి, పచ్చని ప్రదేశాలను కాపాడుతున్నాయి. ఈ చర్యల వల్ల వాయు కాలుష్యం తగ్గిపోవడం, పిల్లలకు ఆడుకునే ప్రదేశం, వృద్ధులకు విశ్రాంతి స్థలం లభించడం వంటి లాభాలు కలుగుతున్నాయి. నగర భవిష్యత్తుకు పచ్చదనం నిలబెట్టడంలో హైడ్రా చేస్తున్న కృషి ప్రశంసనీయమైంది.హైదరాబాద్ అభివృద్ధి చెందుతున్న నగరంగా మారుతున్న కొద్దీ ప్రజా వనరులపై ఒత్తిడి పెరుగుతోంది. పెద్ద పెద్ద భవనాలు, వాణిజ్య సముదాయాలు వేగంగా పెరిగిపోతున్న ఈ కాలంలో పార్కులు, గ్రీన్ స్పేస్‌లు క్రమంగా తగ్గిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో హైడ్రా చేపడుతున్న చర్యలు నగరానికి ఎంతో అనుకూలంగా ఉంటోంది. తాజాగా కొండాపూర్ మాధవ హిల్స్ ఫేజ్?2లో సుమారు వెయ్యి గజాల విస్తీర్ణంలో ఉన్న పార్క్ భూమి అనధికారికంగా ఆక్రమించబడింది. స్థానికులు గోడలు కట్టి, షెడ్లు వేసి పార్కు స్థలాన్ని వ్యక్తిగత అవసరాల కోసం ఉపయోగించుకుంటున్నారని మాధవ హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణి ద్వారా ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు అందుకున్న వెంటనే హైడ్రా అధికారులు స్పందించి, స్థానిక రెవెన్యూ మరియు పోలీసు శాఖలతో కలిసి పరిశీలనలు జరిపారు. నిర్ధారణ అనంతరం మంగళవారం కూల్చివేతలు చేపట్టి, పార్కు స్థలాన్ని తిరిగి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ స్థలపు అంచనా విలువ దాదాపు రూ.11.50 కోట్లు. ఇంత పెద్ద విలువైన భూమిని కాపాడటం కేవలం ప్రభుత్వ ఆస్తి రక్షణకే కాకుండా భవిష్యత్తు తరాల కోసం ప్రదేశాన్ని కాపాడినట్టే. హైడ్రా చర్యతో ప్రాంతీయులు సంతోషం వ్యక్తం చేశారు.ఇదిలా ఉండగా.. వర్షాలు ముంచెత్తుతున్న వేళ నాలాల ఆక్రమణలపై ఫిర్యాదులు అందుతున్నాయి. ఒక చెరువు నుంచి మరో చెరువుకు ఉన్న నాలాలు కబ్జాకు గురి అవ్వడంతో పాటు.. వరద కాలువలన్నీ ఎక్కడో ఒక దగ్గర ఆక్రమణలకు గురై వరద నీరు తమ నివాసాలను ముంచెత్తుతోందని పలువురు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. క్యాచ్‌మెంట్ ఏరియా ఎంత ఉంది.. నాలా ఎంత వెడల్పులో ఉంటే సరిపోతుంది అనే విషయాన్ని అధ్యయనం చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.వీటితో పాటు.. సర్వే నంబరు ఒకటి చూపించి మరో చోట ఉన్న ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపడుతున్నారని.. పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు కబ్జా చేస్తున్నారంటూ పలువురు ఫిర్యాదులందజేశారు. ఇలా హైడ్రా ప్రజావాణికి వచ్చిన 26 ఫిర్యాదుల్లో ఎక్కువ నాలాలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపైనే ఉన్నాయి. ఫిర్యాదులను హైడ్రా అదనపు కమిషనర్ శ్రీ ఎన్ అశోక్ కుమార్ పరిశీలించి సంబంధిత అధికారులకు వాటి పరిష్కార బాధ్యతలను అప్పగించారు.బతుకమ్మ కుంటకు వైభవంఒకప్పుడు కబ్జాల చెరలో చిక్కి, నిర్మాణ వ్యర్థాలతో నిండిపోయి ఉనికినే కోల్పోయే దశకు చేరుకున్న బతుకమ్మ కుంట.. ఇప్పుడు పునరుజ్జీవం పొంది బతుకమ్మ ఉత్సవాలకు వేదిక కాబోతోంది. ఈ నెల 25న ఇక్కడ వైభవంగా బతుకమ్మ వేడుకలు జరగనుండగా, సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై.. సర్వాం గ సుందరంగా తీర్చిదిద్దిన బతుకమ్మకుంటను నగర ప్రజలకు అంకితం చేయనున్నారు.ఉత్సవాల ఏర్పాట్లను సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి ఏర్పాట్లను వారికి వివరించారు. ఈ సందర్భంగా వేం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బతుకమ్మకుంటకు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చేలా ఉత్సవాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.బతుకమ్మకుంట పునరుద్ధరణలో హెచ్‌ఎండీఏ కృషిని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, సీనియర్ నేత వి హనుమంతరావు కొనియాడారు. చూడటానికే భయపడేలా ఉన్న బతుకమ్మకుంటకు జీవం పోసిన ఘనత హెచ్‌ఎండీఏదే అని, కమిషనర్ రంగనాథ్ దీన్ని ఒక యజ్ఞంలా పూర్తి చేశారు అని అభినందించారు.ఈ నెల 25న జరిగే ఉత్సవాల్లో ప్రజలందరూ పార్టీలకతీతంగా పాల్గొని బతుకమ్మ ఆడి వేడుకలను విజయవంతం చేయాలని మేయర్, వీహెచ్ పిలుపునిచ్చారు. నగరంలో తొలి విడతగా చేపట్టిన ఆరు చెరువుల్లో బతుకమ్మకుంట మొదటిగా పూర్తికావడం ఆనందంగా ఉందని వీహెచ్ అన్నారు.

## స్థానిక ఎన్నికల కోసం జంబో కమిటీలు

హైదరాబాద్, సెప్టెంబర్ 17, స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర పీసీసీ పదవులపై దృష్టి సారించింది. డీసీసీని బలోపేతం చేసేందుకు కార్యాచరణను సిద్ధం చేసింది. అధికార కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రణాళిక ప్రకారంగా ఆచితూచి అడుగులు వేస్తుంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన దాదాపుగా రెండేళ్ల దగ్గర పడుతున్న కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు పార్టీ పదవులు నామినేషన్లపై పోస్టుల భర్తీపై పెద్దగా దృష్టి సారించలేదు.పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు క్షేత్రస్థాయిలో కష్టపడిన నేతలు కార్యకర్తలకు పదవులు దక్కకపోవడంతో వారిలో కొంత నిరుత్సాహం దాపురించింది. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే కొందరికి నామినేషన్ పోస్టులు దక్కగా మిగతావారు కొంత నారా జ్‌గా ఉన్నారు.అవకాశం వచ్చిన ప్రతి సందర్భంలో సీఎం రేవంత్ రెడ్డి పీసీసీ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ ను సభలు సమావేశాల్లో పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి గుర్తింపు లభిస్తుందని వారిలో కొంత ఉత్సా హం నింపుతూ వచ్చారు. అప్పటినుంచి పార్టీ నాయకులు కార్యకర్తలు నామినేషన్ల పదవులు పార్టీపదలో కోసం కళ్లలో ఒత్తులు వేసుకుని మరి ఎదురుచూస్తున్నారు. నామినేటెడ్ లేదా పార్టీ పదవులు దక్కుతాయనే వారిలో ఆశ కొట్టుమిట్టాడుతుంది. స్థానిక ఎమ్మెల్యేల ద్వారా అర్హులైన పార్టీ నాయకులు కార్యకర్తలకు పదవులు కేటాయించేందుకు ఇప్పటికే ఆయా మండలాల నుంచి పూర్తిస్థాయి జాబితాను పిసిసి తెప్పించుకుంది. జిల్లా రాష్ట్ర పార్టీ ముఖ్య నేతలు, ఎమ్మెల్యేల సలహా మేరకు డీసీసీ కమిటీ, నామినేటెడ్ పదవుల భర్తీ కోసం వారి నుంచి గ్రీన్ సిగ్నల్ తీసుకుంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా లో డిసిసి కార్యవర్గ కోరుకున్న సిద్ధం చేశారని పీసీసీ సైతం అట్టి కమిటీని అమోద ముద్ర వేసినట్లు విశ్వసనీయ సమాచారం. డిసిసి అధ్యక్షుని ఎంపిక మాత్రం ఏఐసిసి ఆదేశాల మేరకు ప్రకటించనున్నట్లు పార్టీ నేతలు పేర్కొన్నారు.రంగారెడ్డి జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలు కల్వకుర్తి, షాద్ నగర్, చేవెళ్ల, రాజేంద్రనగర్, శేర్లింగంపల్లి, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, ఎల్బీనగర్, వికారాబాద్ జిల్లాలో వికారాబాద్, కొడంగల్, పరిగి, తాండూరు, మేడ్చల్ జిల్లాలో మేడ్చల్, మల్కాజ్ గిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్ పల్లి నియోజకవర్గాల నుంచి అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఇన్చార్జి నేతల నుంచి ఆశావహుల జాబితా ఇప్పటికే పీసీసీకి చేరింది. పీసీసీ కార్యాలయం నుంచి పార్టీ ముఖ్య నేతలు అభ్యర్థులకు సైతం ఫోన్లు చేసి వారి బయోడేటా వివరాలను సైతం కన్ఫామ్ చేసుకున్నట్లు సమాచారం.పార్టీ పదవుల ఎంపికలో ఆది నుంచి కాంగ్రెస్ పార్టీ సామాజిక వర్గాల తూర్పు పైనే ప్రత్యేక దృష్టి సారించింది. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ, ఓసీ వర్గాలను డీసీసీ కమిటీలో స్థానం కల్పించింది. పార్టీ పదవుల ఎంపికలో ఎక్కడ నేతల మధ్య భేదాభిప్రాయాలు రాకుండా ఎంపీ, ఎమ్మెల్యే, నియోజకవర్గ, పార్లమెంట్ ఇన్చార్జి ల అభిప్రాయాలను క్రోడీకరించింది. ప్రధానంగా పార్టీ కోసం కష్టపడిన నేతలు, పార్టీని సమన్వయం చేస్తూ అధికారంలోకి తీసుకొచ్చేలా కృషిచేసిన నేతలకు పార్టీ పదవిలో ప్రయారిటీ దక్కనుంది. స్థానిక సంస్థల ఎన్నికలే ప్రధాన టార్గెట్ గా డిసిసి కమిటీ ఎంపిక చేశారు.జిల్లాలో పార్టీ పదవులు ఎందుకు ఎంపిక చేసామో, అక్కడ క్షేత్రస్థాయి పార్టీ పరిస్థితులు, స్థానిక సంస్థల ఎన్నికల టాస్క్, భవిష్యత్తు వాటిని బలోపేతం చేసేందుకు డీసీసీ కమిటీ ఎంపిక అనంతరం కార్యవర్గానికి పీసీసీ అధ్యక్షుడు దిశానిర్దేశం చేయనున్నారు. పార్టీ పదవులు ఇలా కేటాయించనున్నారు. డిసిసి ప్రెసిడెంట్ తో పాటు ఈ దపా అసెంబ్లీకి వైస్ ప్రెసిడెంట్, స్పొక్స్ పర్సన్, ఇద్దరు జనరల్ సెక్రటరీలు, మండల పార్టీ అధ్యక్షుడుతో పాటు జనరల్ సెక్రెటరీ గ్రామస్థాయి కమిటీలు నియమించనున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన అనంతరం ఆరు గ్యారెంటీలు అమలు, ప్రజాపాలన, విద్య,వైద్యం, సంక్షేమ పథకాల అర్హులకు అందేలా ప్రభుత్వం చేస్తున్న కృషిని పార్టీ నేతలంతా ఇకనుంచి క్షేత్రస్థాయిలో సంచరిస్తూ ప్రజలకు మరింత చెరువు అయ్యేలా నూతన కమిటీకి ప్రత్యేక టాస్క్ ఇవ్వనున్నారు. ఇచ్చిన మాట ప్రకారం స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తామంటూ ఇటీవలనే పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ప్రకటన సైతం చేశారు.దానిలో భాగంగానే స్థానిక సంస్థ ఎన్నికల్లో బిఆర్ఎస్, బిజెపిలకు భంగపాటు అయ్యేలా పిసిసి కొత్త ప్రణాళికలు రచిస్తుంది. రాష్ట్రంలో సర్పంచులు ఎంపీటీసీలు జడ్పిటిసిలు తమ పార్టీ ఖాతాలో వేసుకునేలా ఇప్పటికే క్షేత్ర స్థాయిలో డిసిసి జిల్లా ఇన్చార్జి,మంత్రులు, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో పార్టీ నేతలు కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కొత్తగా పార్టీ పదవులు వచ్చే నేతలకు ప్రధానంగా పార్టీ జెండా ఎజెండాపై పిసిసి అధ్యక్షుడు వివరించి ఆ దిశగా పార్టీని బలోపేతం చేసేందుకు ఇప్పటికే కసరత్తులు మొదలయ్యాయి.

## సాయుధ అమరుల త్యాగం.. తెలంగాణ విమోచనం

**కరెంటు లేదు, రోడ్డు లేదు,నీళ్ల లేవ్వ**

**స్వతంత్ర భారతములో ఆదివాసీల బతుకులు అగమ్య గోచరం**

**తెలంగాణ విమోచన దినోత్సవంలో భాగంగా జాతీయ జెండా ఎగురేసిన సామాజిక కార్యకర్త న్యాయవాది కర్నె రవి**

భద్రాద్రి కొత్తగూడెం , ఎందరో తెలంగాణ సాయుధ పోరాట వీరుల కృషి ఫలితంగా నేడు తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని, మణుగూరుకు చెందిన సామాజిక కార్యకర్త అడ్వకేట్ కర్నె రవి అన్నారు. బుధవారం కరకగూడం మండలం కన్నాయిగూడెం పంచాయతీలోని ఆదివాసీ గ్రామం అంగూరి గూడెం గ్రామంలో కర్నే రవి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండా ఆవిష్కరించి తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎందరో త్యాగదనులు మహానుభావులు తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమించి తమ ప్రాణ త్యాగం చేసి, రాష్ట్రాన్ని సాధించి పెట్టారని అన్నారు. గ్రామంలోని ఆదివాసీల సమస్యలు నేటికీ పరిష్కారం కాకుండా అలాగే ఉన్నాయని అన్నారు. గ్యాస్ సౌకర్యం, కరెంటు సౌకర్యం, రోడ్డు సౌకర్యం లేకుండా ఆదివాసులు ఇబ్బంది పడుతున్న ఎమ్మెల్యేలు ఎంపీలు ఏమి పట్టించుకోకుండా పబ్బం గడుపుతున్నారని ఆరోపించారు. అంగూరి గూడెం గ్రామానికి రోడ్డు సౌకర్యం, కరెంటు వచ్చినప్పటికీ, స్థానిక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు నిర్లక్ష్యం అధికారులు అశ్రద్ధా చేస్తున్నారు అన్నారు. అతి త్వరలోనే గ్రామానికి రోడ్డు కరెంటు నీళ్ల సౌకర్యం కల్పిస్తానని కర్నె రవి గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

## జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం

**జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి**

**పాల్గొన్న కమిషనర్ కర్ణన్, అధికారులు, ఉద్యోగులు.**

హైదరాబాద్,జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం జరిగింది. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కమిషనర్ కర్ణన్, అధికారులు, ఉద్యోగులు పాల్గోన్నారు.మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ 77 ఏండ్ల క్రితం సరిగ్గా ఇదే రోజు సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రాంతం రాజరిక, నిరంకుశ పాలనకు విముక్తి పలికి ప్రజా పాలనకు అడుగులు వేసుకుంది. ఆ నాటి సాయుధ పోరాటంలో ప్రాణాలు వదిలిన అమరవీరులకు నివాళులు. సంక్షేమ పథకాల అమలులో ప్రజా ప్రభుత్వం దేశంలోనే తన ప్రత్యేకతను చాటుకుంటుందని అన్నారు. ఒక్క హైదరాబాద్ నగరంలో 50 వేలకు పైగా రేషన్ కార్డులను ప్రభుత్వం పేద కుటుంబాలకు అందజేసింది. రాష్ట్రానికి గుండెకాయ లాంటి హైదరాబాద్ మహా నగర బ్రాండ్ ఇమేజ్ పెంచేందుకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుంది.

# పచ్చని పోలాల్లో ఇసుక మేటలు

అదిలాబాద్, సెప్టెంబర్ 17, ) నిర్మల్ జిల్లాలో సాగునీటి అవసరాల కోసం నిర్మించిన చెరువుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో రైతులకు శాపంగా మారుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పంటలకు నీరు భూగర్భ జలాల పెంపు పశువులకు నీటి అవసరాల కోసం నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో చెరువులు నిర్మించిన వాటి నిర్వహణ లేకపోవడంతో చెరువులు తెగి కాల్వల కు గండ్లు ఏర్పడి రైతులకు తీవ్ర నష్టం జరుగుతుంది.వర్షాలు కురిస్తే చాలు ఏ చెరువు ఎక్కడ తిరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొందని నీటి పాదాల శాఖ అధికారులు చెబుతున్నారు. నిర్మల్ జిల్లాలో 18 మండలాలు ఉండగా 400 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో వర్షపు నీరును నిలువచేసి పంటల సాగు పశువుల దాహార్తి ఇచ్చేందుకు అప్పట్లో పంచాయతీరాజ్ నీటిపారుదల శాఖ చెరువులను నిర్మించింది.అయితే ఈ చెరువుల నిర్వహణను ప్రభు త్వం ఇటీవలే పంచాయతీరాజ్ నుంచి నీటిపారుదల శాఖకు బదులాయింపు చేసింది. జిల్లావ్యాప్తంగా 624 చెరువులు ఉండగా వీటిని నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో వర్షాలు కురిసి వరదలు వస్తే ఎక్కడ గండిపడి ఏ నష్టం చేకూర్నుందని భయం గ్రామ స్తులను ఆందోళనకు గురిచేస్తుందినిర్మల్ జిల్లాలో ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన చెరువుల నిర్వహణపై అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణ పనులను చేపట్టింది . 2018 2019 సంవత్సరాలు రెండు విడుదలగా జిల్లాలోని 240 చెరువులను మిషన్ కాకతీయ ద్వారా కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి మరమ్మత్తులు చేపట్టారు. ఈ నిధులతో కట్ట వెడల్పు చేయడం ఎత్తు పెంచడం అలుగు రిపేర్ తూము రిపేర్ కాలువల మరమ్మతులు వంటి పనులు చేపట్టినప్పటికీ అవి నాణ్యతగా చేపట్టకపోవ డంతో ఇటీవల కురిసిన వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్నాయి.ఆగస్టు సెప్టెంబర్ మాసాల్లో జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో మొత్తం 28 చెరువులకు గండిపడగా మరో 50 చెరువులు తాత్కాలికంగా బుంగలు లీకేజీలు ఏర్పడడంతో రైతు లు అప్రమత్తమై అలుగు తవ్వకాలు చేపట్టడం ఇసుక బస్తాలతో గండ్లు పూడ్చడంతో మిగతా చెరువులకు ప్రమాదం జరగలేదు. జిల్లాలోని నర్సాపూర్ మండలం దేవుని చెరువు కడ్తాల్ మండలంలోని పెద్ద చెరువు చాక్పల్లి చెరువు అందాపూర్ చెరువు కుబేర్ తానూరు లోకేశ్వరం కుంటాల సారంగాపూర్ తదితర మండలాలు చెరువులకు గండ్లు పడడంతో నీరు మొత్తం ఖాళీ అయిపోయింది.

చెరువు వరద నీరు పంట పొలా లను ముంచెత్తడంతో పంట పొలాల్లో ఇసుకమేటలు వేయడం రహదారిపై ప్రవహిం చడంతో రహదారులు పూత గురికావడం తీవ్ర నష్టాన్ని కలిగించాయి జిల్లావ్యాప్తంగా సుమారు 2000 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు అధికారులు తెలిపారు. 14 చోట్ల రోడ్లు ధ్వంసం అయ్యాయి. చెరువులు ప్రమాదకరంగా ఉన్నాయని మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టు రైతులు జిల్లా అధికారులకు ప్రభుత్వానికి ప్రజాప్రతినిధులకు విన్నవిస్తున్న నిధుల లేమితో మరమ్మత్తులు చేపట్టడంతో భారీ నష్టం జరిగినట్టు అధికారులు తెలిపారు.తెగిపోయిన చెరువులను మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వ అధికారులు సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిన ప్రస్తుతం గండ్లు పూడ్చే పరిస్థితి లేకపోవడంతో రైతులకు ఈ వాహనాకాలంలో పంటలు కోల్పోయే ప్రమాదం ఉండడంతో ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు పంట పొలాలు కూతకు గురికావడం ఇసుక మేటలు మద్దిదిబ్బలు పెట్టడంతో వాటిని తొలగించేందుకు అదనంగా లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టవలసి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.చెరువుల కింద వేలకు వేలు పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేస్తే గండ్లు పడి పంట మొత్తం నాశనం కావడంతో తమ పరిస్థితి ఏం కావాలని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గండ్లను పూర్తి చెరువులను మరమ్మత్తు చేసి నష్టపోయిన రైతులకు 25000 చెల్లించాలని జిల్లా రైతులు .కోరుతున్నారు.

# టీడీపీకి దూరంగా... కూటమికి దగ్గరగా

## కమలంలోకి నేతలు

విశాఖపట్టణం, సెప్టెంబర్ 17, ఎమ్మెల్సీ పదవులకు రాజీనామాలు చేసిన వారిని తెలుగుదేశం పార్టీ దగ్గర చేర్చుకోవడం లేదు. కొందరు కీలక నేతలను మాత్రమే పార్టీలోకి తీసుకునేందుకు అనుమతిస్తున్నారు తప్పించి అందరినీ చేర్చుకోవాలన్న ఉద్దేశ్యంతో లేదు. వైసీపీలో ఉన్నప్పుడు తెలుగుదేశం పార్టీపైన, పార్టీ అధినేత చంద్రబాబునాయుడు, లోకేశ్ లపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేసిన ఎమ్మెల్సీలకు మాత్రం టీడీపీ నో ఎంట్రీ బోర్డు పెట్టేసింది. అయితే తిరిగి వారు వైసీపీ గూటికి వెళ్లకుండా టీడీపీ ప్రత్యామ్నాయ మార్గాన్ని వారికి సూచించినట్లు కనపడుతుంది. తెలుగుదేశం పార్టీ చేర్చుకోని ఎమ్మెల్సీలను బీజేపీలో చేరుస్తూ నయా ట్రెండ్ కు తెరతీసినట్లు కనిపిస్తుంది. బీజేపీ కూడా పెద్దగా ఆలోచించకుండానే పార్టీ కండువా కప్పేస్తుంది.. వైసీపీ అధికారం కోల్పోయిన వెంటనే టీడీపీలో చేరి తిరిగి పెద్దల సభలో స్థానం పొందడానికి రాజ్యసభ సభ్యులు, శాసనమండలి సభ్యులు తమ పదవులకు రాజీనామా చేశారు. అయితే ఎమ్మెల్సీ రాజీనామాలను మాత్రం శాసనమండలి ఛైర్మన్ మోషేన్ రాజు ఆమోదించలేదు. దీనిపై కొందరు న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించారు. కానీ ఇంత వరకూ ఛైర్మన్ మాత్రం వారి రాజీనామాల విషయంలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రాజీనామాలను ఆమోదించి ఆ స్థానాలకు తిరిగి ఎన్నికలు జరిగితే అవి ఖచ్చితంగా కూటమి ప్రభుత్వం ఖాతాలో పడతాయి. అందులో ఎలాంటి సందేహం లేదు. ఎందుకంటే శాసనసభలో వైసీపీ సభ్యుల సంఖ్య పదకొండు మాత్రమే కావడంతో ఖాళీ అయ్యే ప్రతి స్థానం కూటమి ఖాతాలోకే వెళుతుంది. ఈ సమయంలో శాసనమండలి డిప్యూటీ ఛైర్ పర్సన్ జకియా ఖానమ్ ఎమ్మెల్సీకి, వైసీపీకి రాజీనామా చేశారు. జిల్లాలో అనేక మంది నేతలున్నప్పటికీ నాడు మైనారిటీ వర్గమని భావించి జకియా ఖానమ్ కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడమే కాకుండా ఆమెకు డిప్యూటీ ఛైర్ పర్సన్ పదవిని కేటాయించారు. 2020లో జకియాఖానమ్ ను ఎమ్మెల్సీ పదవి ఇచ్చింది. వచ్చే ఏడాది ఈ పదవి ఖాళీ కానుంది. అయితే జకియా ఖానమ్ తిరుమల దర్శనాల విషయంలో వివాదంలో చిక్కుకోవడంతో టీడీపీ, జనసేన పార్టీలు దూరం పెట్టాయి. దీంతో జకియా ఖానమ్ కూటమి పార్టీలోని మిత్రపక్షమైన బీజేపీలో చేరారు. ఆమెకు రాష్ట్ర బీజేపీ నేతలు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే తాజాగా మరో రాజీనామా చేసిన వైసీపీ ఎమ్మెల్సీ పోతుల సునీత బీజేపీలో చేరారు. జేపీ నడ్డా సమక్షంలో పోతుల దంపతులు బీజేపీలో చేరడం ఇప్పుడు రాజకీయంగా హాట్ టాపిక్ గా మారింది. ఎమ్మెల్యే కోటాలో గెలిచిన పోతుల సునీత రాజీనామా చేసి టీడీపీలో చేరాలని భావించినప్పటికీ ఆమె చేరికకు తెలుగుదేశం పార్టీ నేతలే అడ్డుపడ్డారు. పార్టీ అధినేతపై చేసిన విమర్శలతో ఆమెను పార్టీలో చేర్చుకుంటే తప్పుడు సంకేతాలు వెళతాయని భావించిన టీడీపీ నాయకత్వం పోతుల సునీత చేరికకు బ్రేక్ వేసింది. దీంతో ఆమె కూటమిలోని బీజేపీలో చేరారు. 2017లో తొలిసారి టీడీపీ ఎమ్మెల్సీగా గెలిచినా 2019 ఎన్నికల్లో టీడీపీ ఓటమి పాలయిన తర్వాత వైసీపీలో చేరారు. ఇప్పుడు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరాలని ప్రయత్నించి విఫలమై బీజేపీలో చేరారు.

# కాక రేపుతున్న కోవర్టు రాజకీయాలు

కాకినాడ, సెప్టెంబర్ 17, శెట్టిబలిజ సమాజిక వర్గానికి జారీ చేసే కుల ధృవీకరణ పత్రాల్లో గౌడ్ శెట్టిబలిజ పేరున పత్రాలు జారీ అవుతుండడంపై వైసీపీకి చెందిన శెట్టిబలిజ నేతలు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని ప్రచారం జరుగుతున్న నాటి నుంచి అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రాజుకున్న రగడ నానాటికీ ముదురుతోంది. ఇది టీడీపీ, వైసీపీ శెట్టి బలిజ నాయకుల్లో మరింత మాటల యుద్ధం కొనసాగుతోంది. చినికి చినికి గాలివానలా మారి ఇప్పుడు టీడీపీలోనే నిప్పును రాజేసింది. అది ఎంతలా అంటే ఏపీ మంత్రి వాసంశెట్టి సుభాష్ వైసీపీ కోవర్టుగా మారి సొంత పార్టీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుపై విజిలెన్స్ కమిటీకు ఫిర్యాదు చేశారని, వైసీపీ నేత ఆరోపణలు చేయడం మరింత అగ్గి రాజేసింది. ఇటీవల శెట్టిబలిజ సామాజిక వర్గీయులకు కుల ధృవీకరణ పత్రాల్లో శెట్టిబలిజ అని కాకుండా గౌడ్ శెట్టిబలిజ అని రావడంతో ఆ సామాజిక వర్గానికి చెందిన అమలాపురానికి చెందిన వైసీపీ నేతలు కోనసీమ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో అక్కడున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి కూడా దీనిపై స్పందించి ఇది ముమ్మాటికీ శెట్టిబలిజలను ఓసీలోకి మార్చే కుట్ర అని విమర్శించారు. అధికార పార్టీలో ఉన్న మంత్రి వాసంశెట్టి సుభాష్ శెట్టిబలిజ అయి ఉండి అవగాహన లేకుండా ఉన్నారా అంటూ ప్రశ్నించారు. దీనికి కౌంటర్‌గా మాట్లాడిన మంత్రి సుభాష్ మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు.. నువ్వు ఒక జోకర్‌లా మాట్లాడుతున్నావని, చిర్ల జగ్గిరెడ్డివి కాదు నువ్వు చీరల జగ్గిరెడ్డి అంటూ వ్యాఖ్యలు చేయడంతో వివాదం మరింత ముదిరింది. దీనికి కౌంటర్‌గా అమలాపురం చిర్ల జగ్గిరెడ్డితోపాటు పట్టణ వైసీపీ శెట్టిబలిజ నాయకులు వేర్వేరుగా ప్రెస్‌మీట్లు పెట్టి మండిపడ్డారు. ఈ సమావేశంలో వైసీపీ నేత, మంత్రి సామాజిక వర్గానికి చెందిన సంసాని నాని చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి. టీడీపీ మంత్రి వాసంశెట్టి సుభాష్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా అమలాపురం పట్టణ వైసీపీ నేత సంసాని బులినాని చేసిన వ్యాఖ్యలు అంబేద్కర్ కోనసీమ జిల్లాలో తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. మంత్రిగా ఉన్న టీడీపీ నేత వాసంశెట్టి సుభాష్ వైసీపీ కోవర్టు అని, నీ పార్టీకి చెందిన అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తులు ఆనందరావుపై విజిలెన్స్ ఎంక్వయిరీ వేయించావని ఆరోపించారు. సొంత పార్టీ ఎమ్మెల్యే పైనే మంత్రి సుభాష్ విజిలెన్స్ కంప్లైంట్ ఇవ్వడం సిగ్గుచేటన్నారు. మంత్రి సుభాష్ వ్యవహార శైలి వల్ల బీసీ సామాజిక వర్గం ఇతర సామాజిక వర్గాలతో సంబంధాలు దెబ్బతింటున్నాయని, అవగాహన రాహిత్యంతో వ్యవహరిస్తూ సొంత సామాజిక వర్గానికి అందర్నీ దూరం చేస్తున్నారన్నారని మండిపడ్డారు. గతంలో ఎంతో మంది శెట్టిబలిజ సామాజికవర్గం నుంచి మంత్రులుగా పనిచేశారని, అయితే వారు చాలా హుందాగా వ్యవహరించేవారని, నువ్వు అయితే దిగజారి ప్రవర్తిస్తున్నావని దుయ్యబట్టారు. అమలాపురానికి చెందిన మంత్రి వాసంశెట్టి సుభాష్ రామచంద్రపురం నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి తొలిసారిగా గెలవడమే కాదు.. సామాజిక సమీకరణాల్లో ఏకంగా మంత్రి పదవిని సొంతం చేసుకున్నారు. అమలాపురం నియోజకవర్గం నుంచి రెండో సారి ఎమ్మెల్యే అయిన అయితాబత్తుల ఆనందరావు మంత్రి పదవి ఆశించారు కానీ ఆయనకు దక్కలేదు.. దీనిపై కొంత అసంతృప్తిలో ఉన్న ఆనందరావు, మంత్రి సుభాష్‌ల మధ్య పెద్దగా సత్సంబంధాలు లేవనే చెప్పవచ్చు. తన నియోజకవర్గంలో కొన్ని వ్యవహారాల్లో మంత్రి సుభాష్ పెత్తనం కొనసాగుతోందని ఎమ్మెల్యే అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని వినిపిస్తోంది. అయితే మంత్రి సుభాష్ దీనిని పలుస్లార్లు కొట్టిపడేశారు. అమలాపురం మున్సిపాలిటీలో జరుగుతోన్న అభివృద్ధి పనులకు సంబందించి మాత్రం ఎమ్మెల్యే వర్గీయులకు, మంత్రి సుభాష్ వర్గీయులకు మధ్య అంతర్గత పోరు మాత్రం నడుస్తోందంటూ గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యే అవినీతికి పాల్పడుతున్నాడంటూ కొంత మంది విజిలెన్స్ కు కంప్లైంట్ చేయడం వెనుక మంత్రి ఉన్నారని, దీనికి బలం చేకూరేలా వైసీపీ నేత తాజాగా సొంత పార్టీకి చెందిన ఎమ్మెల్యేపై విజిలెన్స్ ఎంక్వయిరీ వేయించాడన్న ఆరోపణలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అయితే ఈ ఎపిసోడ్‌లో టీడీపీ ఎమ్మెల్యే అయితాబత్తులు ఆనందరావు సైలెంట్‌గా ఉండడం గమనార్హం..

# అసెంబ్లీకి వైసీపీ ఎమ్మెల్యేలు

విజయవాడ, సెప్టెంబర్ 17, ప్రజాస్వామ్యంలో అసెంబ్లీని రాజకీయ కారణాలతో బహిష్కరించిన పార్టీగా ప్రజల్లో ఛీత్కారాలను ఎదుర్కొంటున్న వైసీపీ.. తమపై ప్రజాగ్రహం వెల్లువెత్తే అవకాశాలను గుర్తించినట్లుగా కనిపిస్తోంది. రాజ్యాంగం ప్రకారం ప్రజా ప్రతినిధి పని.. అసెంబ్లీకి హాజరై.. చట్టాలు చేయడంలో పాలు పంచుకోవడం.. తమ నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించడమే. బయట దందాలు చేసుకుంటామని.. రాజకీయాలు చేయడానికి ఎమ్మెల్యే పదవి అవసరం లేదు. బాధ్యతలు నిర్వహిస్తేనే పదవి ఉంటుంది. ఇప్పటి వరకూ వైసీపీ ఎమ్మెల్యేల్లా ఎవరూ వ్యవహరించలేదు. ఇది వైపరీత్యం కిందకే వస్తుంది. అందుకే ప్రజలు కూడా వీరి గురించి ఆలోచించాల్సిన పరిస్థితిలో పడ్డారు. జగన్ మోహన్ రెడ్డి తనకు అనుకూల మీడియాతో సమావేశం పెట్టినా.. వారు కూడా అసెంబ్లీకి ఎందుకు వెళ్లరని ప్రశ్నిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఓ జాతీయ మీడియాకు చెందిన రిపోర్టర్ ఇదే ప్రశ్న అడిగారు. ఇక్కడ ప్రెస్మీట్లు పెట్టి గంటల తరబడి మాట్లాడే బదులు ఆ చెప్పేదేదో అసెంబ్లీకే వెళ్లి చెప్పవచ్చు కదా అని అడిగితే జగన్ సమాధానం చెప్పడానికి ఇబ్బంది పడ్డారు. జాతీయ మీడియాలోనూ ఆయన వ్యవహారశైలి, చేస్తున్న రాజకీయంపై చర్చ జరుగుతోంది. ప్రజాస్వామ్యంపై ఏ మాత్రం నమ్మకం లేని ఆయన రాజకీయాలపై విమర్శలు వస్తున్నాయిఅసెంబ్లీకి హాజరు కాని వాళ్లకు జీతభత్యాలు ఆపేయడం, అనర్హతా వేటు వేయడంపై సముచితమని.. ముఖ్యంగా.. సరైన కారణం లేకుండా.. చిన్నపిల్లల్లా చట్ట విరుద్ధమైన డిమాండ్లను పెట్టి.. అవి ఇస్తేనే వస్తామని మంకుపట్టు పట్టే రాజకీయ నేతలకు షాక్ ట్రీట్ మెంట్ అవసరమని భావిస్తున్నారు. భవిష్యత్ లో ఇలాంటివి పెరగకుండా ఉండాలంటే.. ఇప్పుడు ఇలాంటి తప్పుడు పనులు చేయుకండా శిక్షించాల్సిందేనన్న భావన ఉంది. అందులో భాగంగానే .. స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఈ అంశాన్ని విస్తృతంగా చర్చల్లోకి పెడుతున్నారు. ప్రజల్లో కూడా వైసీపీ ఎమ్మెల్యేలు, జగన్ తీరుపై చర్చ జరుగుతోంది. గతంలో పార్టీల అధినేతలు అసెంబ్లీని బహిష్కరించారు కానీ మొత్తం ఎమ్మెల్యేలు కూడా వెళ్లవద్దని ఎవరూ నిర్ణయం తీసుకోలేదు. ఆ తరహాలోనే జగన్ కూడా.. ఇప్పుడు తన విధానం మార్చుకుని పార్టీ ఎమ్మెల్యేలను పంపించాలని.. తాను మాత్రం దూరంగా ఉండాలని అనుకుంటున్నారు. మాట్లాడే అవకాశం వస్తే తాము అసెంబ్లీకి వస్తామని ఎమ్మెల్యే చంద్రశేఖర్ ఇప్పటికే మీడియాకు చెప్పారు. స్పీకర్, డిప్యూటీ స్పీకర్ మాట్లాడే అవకాశం ఇస్తామని అంటున్నారు. వారు అసెంబ్లీకి వెళ్తేనే కదా మాట్లాడే అవకాశం ఇస్తారో లేదో తెలిసేది. అందుకే.. ఎమ్మెల్యేలను అసెంబ్లీకి పంపాలని జగన్ ప్రాథమికంగా నిర్ణయించుకున్నట్లుగా చెబుతున్నారు.

# టీటీడీ కేంద్రంగా రాజుకున్న రాజకీయం

తిరుమల సెప్టెంబర్ 17,తిరుమల తిరుపతి దేవస్థానాలను రాజకీయాలు వదిలి పెట్టడం లేదు. తాజాగా మాజీ టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అలిపిరి వద్ద ఓ విగ్రహం పడి ఉందని .. ఈ విగ్రహం చూస్తుంటే కన్నీళు వస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైందవ ధర్మం పట్ల తీవ్ర నిరక్ష్యం జరిగిందన్నారు. తక్షణమే టీటీడీ ఛైర్మన్, పాలకమండలి రాజీనామా చేయాలని, సీఎం, డిప్యూటీ సీఎం స్పందించాలని డిమాండ్ చేశారు. అలిపిరి ఓల్డ్ చెక్ పాయింట్ కారు పార్కింగ్ ఆ విగ్రహం ఉంది. టీటీడీ ఛైర్మన్ ఆరోపణలపై టీటీడీ బోర్డు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్దపు, అసత్య ప్రచారాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ...తిరుమల పవిత్రత టీటీడీ ప్రతిష్ఠ దెబ్బతీస్తున్నారని టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంగళూరు కి చెందిన ఓ భక్తుడు శనీశ్వరుడు విగ్రహం ఆర్డర్ ఇచ్చాడని.. శిల్పం తయారీలో లోపం రావడంతో.....ఆ రాతివిగ్రహం అక్కడ పడేశారని.. గత పదేళ్లుగా ఆ విగ్రహం ఆ ప్రాంతంలోనే ఉంది....నేడు కరుణాకర్ రెడ్డి ఆ విగ్రహాన్ని మహావిష్ణువు విగ్రహమని అబద్ధపు ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రక్కా ప్లాన్ ప్రకారం ఆ విగ్రహం చుట్టుప్రక్కల నిన్న రాత్రి మద్యంసీసాలు పడేసి... పనిగట్టుకొని టీటీడీపై దుష్ప్రచారం చేయడం మానుకోవాలని హెచ్చరించారు. గతంలో శ్రీవారి ఆలయంలోని రాములవారి ఉత్సవవిగ్రహానికి వేలు విరిగిపోయింది ..మూడున్నర సంవత్సరాలు పట్టించుకున్న పాపానపోలేదు..కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాములవారి విగ్రహానికి ఆగమశాస్త్రం ప్రకారం మరమ్మత్తు చేశాన్నారు. స్వామివారి పట్ల ఇంత నిర్లక్ష్యం ఉన్న నువ్వా..? హిందుత్వం గురించి మాట్లాడేదని ప్రశ్నించారు. అసత్య ప్రచారాలు మానుకోకపోతే కఠిన చర్యలు తప్పవని మరో బోర్డు సభ్యుడు ఎంఎస్ రాజు హెచ్చరించారు. ఇంట్లో ఆచరించే మత విశ్వాసాలు వేరు...బయట రాజకీయ ఉనికి కోసం, ధనర్జాన కోసం హిందువుడిలా కరుణాకర్ రెడ్డి నటిస్తున్నారని మండిపడ్డారు. రాజకీయ ఉనికి కోసం, మీడియాలో కనిపించాలనే ఉద్దేశంతో....భూమన కరుణాకర్ రెడ్డి దిగజారిపోయారని మరో సభ్యుడు దివాకర్ రెడ్డి అన్నారు. టీటీడీ పై అసత్య ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుకోవడం చాలా దారుణమనన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక...అసత్య ప్రచారాలతో హిందువుల మనోభావాలు దెబ్బతీయడమే పనిగట్టుకున్నారని.. మహావిష్ణువు విగ్రహానికి.... అసంపూర్ణమైన శనిభగవానుడి విగ్రహానికి తేడా తెలీదని విమర్శించారు. ఇలాగే ఉంటే.... కరుణాకర్ రెడ్డిని ప్రజలు తిరగబడి తరమికొట్టడం ఖామమని మరో సభ్యురాలు పనబాక లక్ష్మి విమర్శించారు. అలిపిరి సమీపంలో ఉన్న విగ్రహం శనేశ్వరుడిది అని 22 సంవత్సరాల నుండి అక్కడే ఉందని స్తపతి గురుస్వామి తెలిపారు. తిరుమల అన్నమయ్య భవన్ వద్ద మీడియాతో మాట్లాడారు. రాయచెరువు రోడ్డు లో తాము నివాసం ఉండగా విగ్రహం సిద్దం చేశామని.. ఆ విగ్రహం తయారు చేయమని ఆర్డర్ ఇచ్చిన ఆ దాత మరణించారు. ఆ స్థలం సరిపోకపోవడంతో అక్కడి నుంచి అలిపిరి మార్చామన్నారు. బాంబు దాడి ఘటన అనంతరం అక్కడి నుంచి ఖాళీ చేయించారని.. దీంతో చిన్న విగ్రహాలను తీసుకుని ఆ విగ్రహం అక్కడే వదిలేసి వెళ్లామని తెలిపారు. వైఖానస ఆగమ సత్రం తెలియని వాళ్ళు నాపై అసత్యాలు మాట్లాడుతున్నారని భూమన ఆరోపిచారు. ఆది శనీశ్వర విగ్రహం అని చెప్తున్నారు. శంకు చక్రాలు ధరించిన విగ్రహం ఎలా శనీశ్వర విగ్రహము అవుతుందని ఆయన ప్రశ్నించారు. ఆది శిల్పి చెక్కి పడేశారు అని నిరక్ష్యంగా పడేశారు నిరక్ష్యపు సమాధానం చెప్తున్నారని మండిపడ్డారు. నాపై తప్పుడు కేసు పెట్టీ, జైల్లో వేసినా నేను చెప్తూనే ఉంటానన్నారు. తాను హిందూ ధర్మం పట్ల పూర్తి నమ్మకం ఉన్నవాడిని, నాపై ఎన్ని సార్లు దుష్పచారం చేసిన ఎవ్వరు నమ్మరన్నారు.

# వెయ్యి కళ్లతో రొయ్య రైతుల ఎదురు చూపు

ఏలూరు, సెప్టెంబర్ 17, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ పై విధించిన టారిఫ్‌లతో అత్యధికంగా నష్టపోతోంది ఆంధ్రప్రదేశ్ అక్వారంగమే. మంచి క్వాలిటీ రొయ్యల ఉత్పత్తిలో పేరుగాంచిన ఏపీ రైతులు.. తమ ఉత్పత్తులను అమెరికాకు ఎక్కువగా ఎగుమతి చేస్తూంటారు. ఇప్పుడు టారిఫ్‌ల కారణంగా ఆర్డర్లన్నీ రద్దు అవుతున్నాయి. దాదాపుగా రూ. 25వేల కోట్ల నష్టం జరుగుతుందని అంచనా. ఈ పరిస్థితిని గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాశారు. టారిఫ్‌ల వల్ల నష్టపోతున్న పరిశ్రమలను ఆదుకునేందుకు ఓ పథకం తెచ్చే ఆలోచన చేస్తున్నామని కేంద్రం ఇప్పటికే ఓ ప్రకటన చేసింది. డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్‌లు ఆంధ్రప్రదేశ్‌లోని రొయ్యల ఎగుమతి పరిశ్రమకు దాదాపుగా రూ. 25,000 కోట్ల నష్టాన్ని కలిగిస్తున్నాయని ఇండస్ట్రీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇప్పటికే సగానికిపైగా ఎగుమతి ఆర్డర్లు రద్దయ్యాయి. ఎగుమతి సంక్షోభం వల్ల ఆక్వా రైతులు తీవ్ర కష్టాలను ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం అమెరికా టారిఫ్‌లు 59.72 శాతానికి చేరాయి. ఇందులో ముందు ప్రకటించిన 25 శాతం మీద మరో 25 శాతం అదనపు టారిఫ్‌లు, 5.76 శాతం కౌంటర్‌వెయిలింగ్ డ్యూటీ, 3.96 శాతం యాంటీ-డంపింగ్ డ్యూటీలు ఉన్నాయి. ఈ టారిఫ్‌ల కారణంగా 200 కంటెయినర్లపై ఏకంగా రూ. 600 కోట్లు అదనపు పన్ను చెల్లించాల్సి వచ్చింది. అందుకే దిగుమతి దారులు ఆర్డర్లు క్యాన్సిల్ చేసుకుంటున్నారు. దేశం నుంచి ఎగుమతి అయ్యే రొయ్యలలో 80 శాతం, మెరైన్ ఎగుమతులలో 34 శాతం ఆంధ్రప్రదేశ్ నుంచే వెళున్నాయి. రాష్ట్రంలో ఆక్వా పరిశ్రమపై ఆధారపడి 30 లక్షల మంది ఉపాధి పొందుతున్నారు. 2024-25లో 7.38 బిలియన్ల విలువైన సీఫుడ్ ఎగుమతులు జరిగాయి, ఇందులో 92 శాతం రొయ్యలు. మొత్తం ఎగుమతుల్లో అమెరికాకు 54 శాతం వెళ్తాయి. అందుకే ప్రభావం ఏపీపై తీవ్రంగా ఉందిటారిఫ్‌ల వల్ల అక్వా రైతులు , వారి కుటుంబాలు కష్టాల్లో పడ్డారని వారిని ఆదుకునేందుకు తక్షణం చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అక్వా ఫీడ్ ధరను కేజీకి రూ. 9 తగ్గించింది. కొన్ని అంశాల్లో సబ్సిడీలను ప్రకటించింది. ఎగుమతిదారులు, అక్వా కంపెనీలకు బ్యాంకుల మద్దతు అవసరమని, రుణాలు, వడ్డీ రీపేమెంట్లకు 240 రోజుల మారటోరియం, వడ్డీ సబ్సిడీలు, ఫ్రోజన్ రొయ్య పై 5 శాతం జీఎస్టీ తాత్కాలిక మాఫీ వంటి చర్యలు చేపట్టాలని చంద్రబాబు కేంద్రాన్ని కోరుతున్నారు. అలాగే అమెరికాపై మాత్రమే ఆధారపడకుండా ఇతర ఎగుమతి మార్కెట్లను విస్తరించడానికి ఐరోపా యూనియన్, సౌత్ కొరియా, సౌదీ అరేబియా, రష్యాతో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్లు కుదుర్చుకోవాలని చంద్రబాబు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంత సాయం చేసినా కేంద్ర జోక్యంతోనే సమస్య పరిష్కారం అవుతుందని చంద్రబాబు భావిస్తున్నాకు. భారత్ కు పోటీగా ఈక్వెడార్.. సముద్ర ఉత్పత్తులు అమెరికాకు ఎగుమతి చేస్తోంది. ఈ దేశంపై ట్రంప్ పదిహేను శాతం పన్ను విధించారు. దాంతో పోలిస్తే భారత్ పై చాలా ఎక్కువ పన్నులు వేసినట్లే. భారత్, అమెరికా మధ్య ట్రేడ్ డీల్ కుదిరే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతోంది. అక్వారంగానికి మేలు చేసేలా.. డీల్ కుదిరితే..మంచిదే.. లేకపోతే ఆదుకునేందుకు గట్టి చర్యలు తీసుకోవాల్సిందేనని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి.



# భారంగా మారుతున్న వైఎస్ స్కీమ్స్

విజయవాడ, సెప్టెంబర్ 17, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు భారంగా మారినట్లు కనిపిస్తున్నాయి. అందుకే రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ పథకాలకు నిధులను కేటాయించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 2004లో ముఖ్యమంత్రి బాధ్యతలను చేపట్టిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి తొలిసారిగా రైతులకు ఉచిత విద్యుత్తు ప్రవేశపెట్టారు. అలాగే సామాన్య ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించాలని ఆరోగ్యశ్రీని తెచ్చారు. పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించాలని ఫీజు రీఎంబర్స్ మెంట్ పథకాన్ని తెచ్చిపెట్టారు. 2004 నుంచి 2014 వరకూ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉండటంతో పాటు వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణించినా ఈ పథకాలను కొనసాగించారు. వీటికి నాటి ప్రభుత్వం నిధులను కేటాయించింది. కానీ ఆ తర్వాత రెండు తెలుగు రాష్ట్రాలు విడిపోయాయి. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత రెండు తెలుగు రాష్ట్రాల్లో రైతులకు ఉచిత విద్యుత్తు మాత్రం కొనసాగిస్తూనే నేటి వరకూ కొనసాగిస్తున్నాయి. కానీ ఆరోగ్య శ్రీ పథకంతో పాటు ఫీజు రీఎంబర్స్ మెంట్ పథకాల విషయంలో మాత్రం 2014 నుంచి వచ్చిన ప్రభుత్వాలు వాటికి నిధులను విడుదల చేయడంలో జాప్యం చేస్తున్నాయి. అది ఏపీలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం కావచ్చు. తెలంగాణలో నాటి బీఆర్ఎస్ కావచ్చు.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కావచ్చు.. నిధులను విడుదల చేయడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నాయి. పథకాల అమలులో లోపాలు ఉండవచ్చు. అవినీతి ఉండవచ్చు. కానీ ప్రజలకు ఉపయోగపడే పథకాలకు నిధులను విడుదల చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి ఆంధ్రప్రదేశ్ లో అయితే తాజాగా ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రభుత్వం ఎత్తివేసింది. ఎన్టీఆర్ ఆరోగ్య భరోసా కింద కొత్త పథకాన్ని తెచ్చింది. ఇది ప్రభుత్వంపై భారం పడకుండా కేవలం బీమా సంస్థలు చెల్లించేలా కొత్త పథకాన్ని ప్రారంభించారు. అయితే ఆరోగ్యశ్రీ బకాయిలను తమకు రెండు వేల కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉందని, బీమా మొత్తం ఆ కంపెనీలకు ఎలా చెల్లిస్తారని ప్రయివేటు ఆసుపత్రుల యాజమాన్యం ఏపీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి. తమకు చెల్లించలేని స్థితిలో ఉన్న ప్రభుత్వం బీమా సంస్థలకు ఎలా ప్రీమియం చెల్లిస్తుందని నిలదీస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ లో ఎన్టీఆర్ వైద్య సేవలు నిలిచిపోయాయి. నిన్నటి నుంచి ఓపీ సేవలను ప్రయివేటు ఆసుపత్రులు బంద్ చేశాయి. వారంలోగా సమస్య పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశాయి. తెలంగాణలో ప్రయివేటు ఆసుపత్రుల యాజమాన్యం కూడా ఇదే నిర్ణయం తీసుకుంది. నేటి నుంచి ఆరోగ్య శ్రీ సేవలను నిలిపివేయాలని నిర్ణయించింది. ఇప్పటికే తమకు బకాయిలున్న పధ్నాలుగు వందల కోట్ల రూపాయలను వెటనే చెల్లించాలని ప్రయివేటు ఆసుపత్రుల యాజమాన్యం కోరుతుంది. ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలం కావడంతో ఆరోగ్య శ్రీ సేవలను నేటి నుంచి బంద్ చేయాలని నిర్ణయించాయి. చర్చలు విఫలం కావడంతో... ప్రయివేటు ఆసుపత్రుల యాజామాన్యం ఆరోగ్య శ్రీ బకాయిలపై గత ఇరవై రోజులుగా చర్చలు జరుపుతుంది. అయితే చర్చలు కొలిక్కి రాలేదు. దీంతో ఈరోజు అర్ధరాత్రి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్య శ్రీ సేవలను నిలిపివేయాలని ప్రయివేటు యాజమాన్యం నిర్ణయించింది. తెలంగాణలో మొత్తం 33 ఆసుపత్రులకు ఏడాదిగా బకాయిలు పెండింగ్ లో ఉన్నాయని అసోసియేషన్ చెబుతుంది. ఫీజు రీఎంబర్స్ మెంట్ విషయంలోనూ రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు సకాలంలో చెల్లించకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు అవస్థలు పడుతున్నారు. ఈ రెండు పథకాల్లో పెద్దయెత్తున అవినీతి జరుగుతుందని ప్రస్తుత ప్రభుత్వాలు భావిస్తున్నాయి. అవినీతి జరగకుండా, కరప్షన్ కు పాల్పడకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలి కానీ, నిధులు ఆపేస్తే సేవలు నిలిచిపోతే ఇబ్బంది పడేది ప్రజలు కదా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. లోపాలను సరిదిద్దలేని ప్రభుత్వం కొత్త పాలసీలను తీసుకు రావడం సరికాదంటున్నారు. అదే సమయంలో తెలంగాణ ప్రభుత్వం మాత్రం ఫీజు రీఎంబర్స్ మెంట్ విషయంలో కొత్త నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఇకపై ఈ నిధులను నేరుగా తల్లిదండ్రుల ఖాతాల్లో వేయాలని భావిస్తున్నట్లు సమాచారం. అంతవరకూ ఓకే గాని.. పూర్తిగా పథకాలను నిలిపేస్తే ఇబ్బందులు పడేది ప్రజలు అన్నది గుర్తుంచుకోవాల్సి ఉంటుంది. ఎన్నికల సమయంలో ఆ యా పార్టీల అధినేతలు ఇచ్చిన హామీలను అమలుచేయడానికి ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వాలు విద్య, వైద్యం కోసం ఉపయోగపడే పథకాలను మాత్రం నీరుగార్చేలా చర్యలు తీసుకుంటున్నాయి.

# దాల్చిన చెక్క పాలతో ఇన్ని లాభాలా – దెబ్బకు షుగర్ లెవల్స్ నియంత్రణలో..!!



దాల్చిన చెక్క. దీంతో వంటలకు చక్కని రుచి, వాసన వస్తాయి. దాల్చిన చెక్క ఘాటుగా ఉంటుంది. ఇందులో అనేక ఔషధ గుణాలు ఉంటాయి. దాల్చిన చెక్కను తీసుకుంటే పలు వ్యాధులను నయం చేసుకోవచ్చని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. కానీ ఘాటుగా ఉంటుంది కాబట్టి దీన్ని నేరుగా తినలేరు. అయితే రాత్రి పూట ఒక గ్లాస్ గోరు వెచ్చని పాలలో కాస్త దాల్చిన చెక్క పొడిని కలిపి తాగవచ్చు. దీంతో అనేక ప్రయోజనాలు కలుగుతాయి. షుగరు లెవల్స్ ను నియంత్రణలో ఉంచుతాయి. దాల్చిన చెక్క పాలను తీసుకోవటం వలన ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. దాల్చిన చెక్క పాలను తాగుతుంటే షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. దాల్చిన చెక్క వల్ల శరీరం ఇన్సులిన్‌ను మరింత మెరుగ్గా ఉపయోగించుకుంటుంది. దీంతో షుగర్ లెవల్స్ తగ్గుతాయి. టైప్ 2 డయాబెటిస్ లేదా ప్రీ డయాబెటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. డయాబెటిస్ ను అదుపులో ఉంచుకోవచ్చు. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. జీర్ణక్రియ మెరుగు పడుతుంది. ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. కడుపు ఉబ్బరం, గ్యాస్, అజీర్తి వంటి సమస్యలు తగ్గుతాయి. అలాగే ఇరిటబుల్ బౌల్ సిండ్రోమ్ అనే సమస్య ఉన్నవారికి ఎంతగానో ఉపశమనం లభిస్తుంది. దాల్చిన చెక్క పాలను సేవిస్తే రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. పాలలో, దాల్చిన చెక్కలో ఉండే అనేక రకాల యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, మినరల్స్ రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తాయి. దీంతో సీజనల్‌గా వచ్చే దగ్గు, జలుబు వంటి సమస్యలకు చెక్ పెట్టవచ్చు. అలాగే ఇన్‌ఫెక్షన్లు సైతం తగ్గుతాయి. దాల్చిన చెక్క పొడి కలిపిన పాలను తాగుతుంటే శరీరానికి క్యాల్షియం సమృద్ధిగా లభిస్తుంది. రాత్రి పూట దాల్చిన చెక్క పాలను సేవిస్తుంటే ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మనస్సు ప్రశాంతంగా మారుతుంది. నిద్ర చక్కగా పడుతుంది. అలాగే దాల్చిన చెక్కలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోని కొలెస్ట్రాల్ లెవల్స్‌ను నియంత్రణలో ఉంచుతాయి. దీంతో రక్త సరఫరా మెరుగు పడుతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. బరువు తగ్గాలనే ప్రణాళికలో ఉన్నవారు ఈ పాలను రోజూ సేవిస్తుంటే ఫలితం ఉంటుంది. అయితే కొవ్వు తీసిన పాలను తాగాల్సి ఉంటుంది. దాల్చిన చెక్క పాలలో సినమాల్డిహైడ్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలను కలిగి ఉంటుంది. కనుక శరీరం లోపల, బయట ఉండే వాపులు తగ్గిపోతాయి. అయితే గర్భిణీలు, అలర్జీలు ఉన్నవారు, రక్తాన్ని పలుచగా చేసే మందులను వాడేవారు, లివర్ సమస్యలు ఉన్నవారు మాత్రం ఈ పాలను తాగకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# ఇది పిచ్చి మొక్క కాదు.. వంద అనారోగ్య సమస్యలకు చెక్..!



మన చుట్టూ పరిసరాల్లో చాలా మొక్కలను చూస్తుంటాం. రకరకాల మొక్కలు పెరుగుతుంటాయి. వాటిలో ఔషధ గుణాలు కలిగిన మొక్కలు కూడా చాలానే ఉన్నాయని మనకు తెలియదు. వాటిని పిచ్చి మొక్కలుగా భావిస్తుంటాం. కానీ ఈ మొక్కల్లో వంద అనారోగ్య సమస్యలకు చెక్ పెట్టేంత సామర్థ్యం ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. వాటిలో వాము మొక్క ప్రధానమైనది. ఇది పిచ్చి మొక్కలా కనిపిస్తుంటుంది.. కానీ ఈ మొక్క ఎన్నో ఔషధ గుణాలను కలిగి ఉంది. ఈ మొక్క అద్భుతమైన లాభాలను అందిస్తుంది.వాము మొక్క ఆకులను నీటిలో మరిగించి ఆ నీళ్లను తాగితే అనేక ప్రయోజనాలు కలుగుతాయని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. వాము పలు వ్యాధులను నయం చేస్తుందని అంటున్నారు. అలాగే వాములోని థైమోల్ అనే సమ్మేళనం జీర్ణ ఎంజైమ్ ల ఉత్పత్తిని పెంచుతుది. తద్వారా ఆహారం త్వరగా జీర్ణమయ్యేలా సహాయపడుతుందని నిపుణులు వివరిస్తున్నారు. అంతేకాక వాము గ్యాస్, ఉబ్బరం, అజీర్ణం నుంచి ఉపశమనం కలిగిస్తుందని చెబుతున్నారు.ఈ ఆకులను తీసుకోవడం ద్వారా వల్ల దగ్గు, జలుబు, ఇతర శ్వాస సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. గొంతు, ఊపిరితిత్తుల్లో ఉండే కఫం కరిగిపోతుందని వైద్యులు వివరిస్తున్నారు. ముక్కు దిబ్బడ నుంచి ఉపశమనంతో పాటుగా ఆస్తమా, బ్రాంకైటిస్ ఉన్నవారికీ మేలు జరుగుతుందని చెబుతున్నారు. ఆయుర్వేదంలో వామును కడుపు ఉబ్బరం, అలసట, విరేచనాలు, పొత్తికడుపు నొప్పి, శ్వాసకోశ సమస్యలు, ఆకలి వేయకపోవడం వంటి వివిధ చికిత్సలకు ఉపయోగిస్తారని వైద్యులు వివరిస్తున్నారు. అలాగే వాము శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడంలో సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు.

# బెండ.. వీరి ఆరోగ్యానికి హానికరం



దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు కొన్ని రకాల కూరగాయలకు దూరంగా ఉండాల్సి ఉంటుంది. బెండకాయ విషయంలో కూడా ఇది వర్తిస్తుంది. బెండకాయ ఆరోగ్యానికి మంచిది కాదని దీని అర్థం కాదు గానీ.. ఇందులో ఉండే మెగ్నీషియం, విటమిన్ ఏ, విటమిన్ కే, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు మన ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపుతాయి. కొన్ని రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు దీనికి దూరంగా ఉండటం మంచిది. వారిపై ఇది ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. కిడ్నీ సమస్యలతో బాధపడేవారు బెండకాయకు దూరంగా ఉండాలి. బెండకాయలో ఆక్సలేట్ పుష్కలంగా ఉంటుంది. ఇది శరీరంలోని కాల్షియంతో కలిసి కాల్షియం ఆక్సలేట్ రాళ్లను ఏర్పరుస్తుంది. మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడటానికి బెండకాయలు పరోక్షంగా కారణమౌతాయి. ఇప్పటికే మూత్రపిండాల్లో రాళ్లు ఉన్నవారు లేదా అలాంటి ఫ్యామిలీ హిస్టరీ ఉన్నవాళ్లు కూడా బెండకాయ తినడం మానుకోవాలి. తప్పనిసరిగా తినాలనిపిస్తే తక్కువ పరిమాణంలో తీసుకోవచ్చు. ఆ తర్వాత తగినంత నీళ్లు తాగాలి." కీళ్ల నొప్పులతో బాధపడేవారు కూడా బెండకాయ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. శరీరంలో యూరిక్ యాసిడ్ పెరగడం వల్ల ఎముకలకు సంబంధించిన సమస్యలు త్వరగా వస్తాయి. బెండకాయలో ఉండే ఆక్సలేట్‌లు యూరిక్ యాసిడ్ స్ఫటికీకరణను ప్రోత్సహిస్తాయి. ఇవి కీళ్ల నొప్పులు, వాపులను మరింత పెంచుతాయి. ఎముకలకు సంబంధించిన వ్యాధులు ఉన్నవారు బెండకాయకు దూరంగా ఉండటం మంచిది. బెండకాయలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. సాధారణంగా జీర్ణక్రియకు ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. ఉబ్బరం, గ్యాస్ట్రిక్, ఇరిటబుల్ బోవెల్ సిండ్రోమ్ లేదా జీర్ణశక్తి సమస్యలు ఉన్నవాళ్లు బెండకాయను తీసుకోవడం వల్ల ఆయా ఆరోగ్య సమస్యలు మరింత తీవ్రతరం కావడానికి అవకాశం ఉంది. ఇది కడుపులో తిమ్మిర్లు, అజీర్ణానికి దారి తీస్తాయి. రక్తం పలుచబరచే మందులు తీసుకునేవారు బెండకాయకు దూరంగా ఉండాలి. బెండకాయలో విటమిన్ కే అధికంగా ఉంటుంది. రక్తం గడ్డకట్టే ప్రక్రియకు విటమిన్ కే చాలా అవసరం. రక్తం పలుచబరచే మందులు తీసుకుంటున్నవారు తమ ఆహారంలో విటమిన్ కే పరిమాణాన్ని పరిమితం చేయాలి. ఈ సమయంలో బెండకాయను ఆహారంలో చేర్చుకుంటే మందుల ప్రభావం తగ్గుతుంది, ఇది రోగికి సమస్యలు సృష్టించవచ్చు 'దీన్ని తినడం వల్ల అలర్జీలు వచ్చే అవకాశం ఉంది. అలర్జీ లక్షణాలలో దురద, దద్దుర్లు, వాపు లేదా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉండవచ్చు. బెండకాయ తిన్న తర్వాత ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించండి. పోషకాహార నిపుణులు బెండకాయను సరైన కూరగాయలతో, సమతుల్య పద్ధతిలో తినాలని సిఫార్సు చేస్తారు. ఉల్లిపాయలు, టమోటాలు లేదా బంగాళాదుంపలతో వండటం సురక్షితం, రుచికరంగా కూడా ఉంటుంది. పచ్చి బెండకాయలో అధిక కరిగే ఫైబర్ ఉన్నందున, ఎల్లప్పుడూ బాగా వండిన బెండకాయను తినాలి. పచ్చి బెండకాయ కొందరికి అజీర్తికి దారి తీయవచ్చు. బెండకాయలను తక్కువ మసాలా, అలాగే పరిమిత నూనెతో వండాలి, తద్వారా దాని పోషకాలు చెక్కుచెదరకుండా ఉంటాయి. డయాబెటిస్ లేదా జీర్ణ సమస్యలతో బాధపడేవారు దీన్ని పగటిపూట తినడం మంచిది. రాత్రిపూట తినడం వల్ల జీర్ణక్రియపై ప్రభావం చూపుతుంది. అంతేకాకుండా, పెరుగు లేదా మజ్జిగతో తినడం వల్ల జీర్ణక్రియకు మరింత ప్రయోజనకరంగా ఉంటుంది.

# యాపిల్ సైడర్ వెనిగర్ బీపీ, డయాబెటిస్ బాధితులకు దివ్యౌషధం – ఈ జాగ్రత్తలతో..!!



యాపిల్ సైడర్ వెనిగర్. దీంతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు. యాపిల్ పండ్లను పులియబెట్టి యాపిల్ సైడర్ వెనిగర్‌ను తయారు చేస్తారు. ఇది అనేక పోషకాలను, ఔషధ విలువలను కలిగి ఉంటుంది. మనకు అనేక లాభాలను అందిస్తుంది. యాపిల్ సైడర్ వెనిగర్‌లో అసిటిక్ యాసిడ్ ప్రధాన సమ్మేళనంగా ఉంటుంది. ఇది మనకు ఆరోగ్య ప్రయోజనాలను కలగజేస్తుంది. బీపీ, డియాబెటిక్ నియంత్రణలోనూ మేలు చేస్తుంది. అయితే, వినియోగంలో మాత్రం జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. యాపిల్ సైడర్ వెనిగర్ షుగర్ ఉన్నవారికి ఎంతో మేలు చేస్తుంది. దీన్ని తీసుకుంటే శరీరం ఇన్సులిన్‌ను మరింత మెరుగ్గా ఉపయోగించుకుంటుంది. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. ముఖ్యంగా టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. అధికంగా బరువు ఉన్నవారు కూడా దీన్ని తీసుకుంటే మేలు జరుగుతుంది. శరీరంలోని కొవ్వు కరిగేలా చేస్తుంది. కనుక బరువు తగ్గాలని చూస్తున్నవారు రోజూ దీన్ని తాగుతుంటే ఉపయోగం ఉంటుంది. యాపిల్ సైడర్ వెనిగర్‌ను రోజూ తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ లెవల్స్ తగ్గుతాయి. రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. బీపీ నియంత్రణలో ఉంటుంది. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా చూసుకోవచ్చు. యాపిల్ సైడర్ వెనిగర్‌లో యాంటీ మైక్రోబియల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. ఇవి మన శరీరంలో ఉండే బ్యాక్టీరియా, వైరస్‌లను నాశనం చేస్తాయి. దీంతో ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. రోగాలు రాకుండా ఉంటాయి. మరిన్ని కనుగొనండి ఆరోగ్యంగా వెనిగర్ సీమ రేగి పండు ఆరోగ్య వెనిగర్ ఆరోగ్యం వెనిగర్‌ను ఇక, యాపిల్ సైడర్ వెనిగర్ అంటే పులిసిన ఆహారం. కనుక ఇది జీర్ణ వ్యవస్థకు మేలు చేస్తుంది. ఇది ప్రో బయోటిక్ ఆహారంగా పనిచేస్తుంది. జీర్ణ వ్యవస్థలో ఉండే మంచి బ్యాక్టీరియాను వృద్ధి చేస్తుంది. దీని వల్ల జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. జీర్ణ సమస్యలు రాకుండా ఉంటాయి. యాపిల్ సైడర్ వెనిగర్ లో ఆమ్లత్వం అధికంగా ఉంటుంది. కనుక దీన్ని నేరుగా తాగకూడదు. నీటితో కలిపి తాగాల్సి ఉంటుంది. దంతాలకు ఇది తగలకుండా తాగాల్సి ఉంటుంది. లేదంటే దంతాలపై ఉండే ఎనామిల్ పొర దెబ్బ తినే అవకాశాలు ఉంటాయి. యాపిల్ సైడర్ వెనిగర్‌ను నేరుగా తాగితే ఆహార నాళంపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. దీంతో జీర్ణ సమస్యలు వస్తాయి. కనుక కచ్చితంగా నీటితో కలిపి తీసుకోవాల్సి ఉంటుంది. యాపిల్ సైడర్ వెనిగర్‌ను రోజుకు 15 నుంచి 30 ఎంఎల్ మోతాదులో తీసుకోవచ్చు. ఉదయం అల్పాహారానికి 30 నిమిషాల ముందు తాగాల్సి ఉంటుంది. దీని వల్ల షుగర్ లెవల్స్ రోజంతా నియంత్రణలో ఉంటాయి. యాపిల్ సైడర్ వెనిగర్‌ను నెమ్మదిగా తాగాలి. ఒకేసారి తాగేయకూడదు. ఇలా యాపిల్ సైడర్ వెనిగర్‌ను తీసుకుంటే అనేక లాభాలను పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు.



# భుజం నొప్పి.. ఫ్రోజెన్ షోల్డర్ కు ఉపశమనం కోసం ఇలా చెయ్యండి!

చాలామంది ఎదుర్కొంటున్న సమస్య ఫ్రోజెన్ షోల్డర్. భుజం కీళ్ళు గట్టిపడటం వల్ల చెయ్యి పైకి లేపలేని, నొప్పితో తెగ బాధ పడే పరిస్థితి ఈ ఫ్రోజెన్ షోల్డర్ కు ఉంటుంది. ఇది దేశవ్యాప్తంగా అనేక మందిని ప్రభావితం చేస్తుంది. ముఖ్యంగా ఇది డయాబెటిస్ బాధితులలో కనిపిస్తుంది. అయితే ఫ్రోజెన్ షోల్డర్ నొప్పిని తగ్గించుకోవడానికి కొన్ని చిట్కాలు బాగా పనిచేస్తాయి. మనం ఇంట్లోనే చేసుకోగలిగిన చిట్కాలు ఏంటి అనేది తెలుసుకుందాం. ఫ్రోజెన్ షోల్డర్ తో ఈ సమస్యలు ఫ్రోజెన్ షోల్డర్ సమస్యలో భుజం క్యాప్సూల్స్ మంద పడి బిగుతుగా మారుతుంది. ఇది భుజం కదలికలను నియంత్రిస్తుంది. అసౌకర్యాన్ని కలిగిస్తుంది. 40 నుండి 60 సంవత్సరాల వయసు ఉన్న వ్యక్తులలో ఇది సాధారణంగా కనిపిస్తుంది. ఈ ఫ్రోజెన్ షోల్డర్ సమస్య కొన్ని నెలలు లేదా కొన్ని సంవత్సరాల పాటు కొనసాగుతుంది. ఈ సమస్యను ముందుగా ప్రతి ఒక్కరు అర్థం చేసుకోవాలి. ఫ్రోజెన్ షోల్డర్ ఉపశమనానికి ఇంటి చిట్కాలు ఫ్రోజెన్ షోల్డర్ సమస్య తగ్గడానికి మనం ఇంట్లోనే చేయగలిగిన కొన్ని చిట్కాలు ఉన్నాయి. హీట్ ప్యాడ్ ను ఉపయోగించడం , సున్నితమైన స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయటం భుజం మొబిలిటీ ని మెరుగుపరచడంలో సహాయపడతాయి ఇవి క్రమం తప్పకుండా చేయడం వల్ల నొప్పి నుండి కాస్త ఉపశమనం కలుగుతుంది. షోల్డర్ పసుపు వేసుకున్న వేడి వేడి పాలు తాగడం వల్ల కూడా ఫ్రోజెన్ షోల్డర్ ను నివారించవచ్చు. పసుపును పేస్టులా చేసి ఫ్రోజెన్ షోల్డర్ కు రాసిన కాస్త ఉపశమనం కలుగుతుంది. అల్లం టీ తాగడం వల్ల కూడా ఫ్రోజెన్ షోల్డర్ నుంచి కాస్త రిలీఫ్ లభిస్తుంది. అంతేకాదు మనం మంచి ఆహారాన్ని తినడం వల్ల, సమతుల్య ఆహారం



కీళ్ల ఆరోగ్యానికి మద్దతు ఇచ్చి ఫ్రోజెన్ షోల్డర్ ను తగ్గిస్తుంది. వీటితో ఫ్రోజెన్ షోల్డర్ నుండి ఉపశమనం ఒమేగా 3 ఫ్యాటీ ఆసిడ్స్ తో ఉన్న ఆహారాలను తినడం ఫ్రోజెన్ షోల్డర్ కు ఉపశమనాన్ని కలిగిస్తుంది. శరీరాన్ని హైడ్రేటెడ్ గా ఉంచడం కూడా ఫ్రోజెన్ షోల్డర్ ను తగ్గిస్తుంది. ఇక వీటితో మాత్రమే కాకుండా ఫిజియోథెరపీ చేయించడం, వైద్యులను సంప్రదించి సరైన వైద్యాన్ని తీసుకోవడం కూడా ఫ్రోజెన్ షోల్డర్ కు అవసరం. ఇక ఫ్రోజెన్ షోల్డర్ సమస్య మరీ ఎక్కువగా బాధించకుండా ఉండాలంటే ప్రతిరోజు సున్నితమైన వ్యాయామాలను తప్పకుండా చేయాలి. మంచి ఆహారాలను తీసుకోవాలి.




# మిరాయ్ బాక్సాఫీస్ హవా.. మరోసారి 100 కోట్ల క్లబ్‌లో తేజ సజ్జా



: తెలుగు సినిమాల్లో బాక్సాఫీస్ హంగామా మళ్లీ మిరాయ్ రూపంలో కనిపిస్తోంది. యంగ్ హీరో తేజ సజ్జా ప్రధాన పాత్రలో తెరకెక్కిన ఈ చిత్రం ప్రతి రోజు కొత్త రికార్డులు సృష్టిస్తూ దూసుకుపోతోంది. విడుదలైనప్పటి నుంచి హౌస్‌ఫుల్ షోలు కొనసాగుతున్న ఈ సినిమాకి అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఇప్పటికే హనుమాన్ తో రికార్డ్ స్థాయిలో రెస్పాన్స్ అందుకున్న తేజ ఇప్పుడు మిరాయ్ తో మరో మైల్ స్టోన్ ను సొంతం చేసుకున్నాడు. ప్రత్యేకంగా 5 రోజులు పూర్తికావడానికి ముందే మిరాయ్ 100 కోట్ల గ్రాస్ క్లబ్‌లోకి అడుగుపెట్టడం ఇండస్ట్రీని ఆశ్చర్యపరుస్తోంది. సాధారణంగా ఇంత భారీ వసూళ్లు సాధించడం స్టార్ హీరోలకే సాధ్యమవుతుందని భావిస్తారు. కానీ తేజ సజ్జా మాత్రం తన కష్టానికి, తన ఎంపిక చేసిన కంటెంట్‌కి తగిన ప్రతిఫలాన్ని అందుకుంటూ కొత్త రికార్డులు క్రియేట్ చేస్తున్నారు. యాక్షన్, ఫాంటసీ, సూపర్ హీరో జానర్ కావడంతో మిరాయ్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. అమెరికా బాక్సాఫీస్ వద్ద కూడా ఈ సినిమా ఊహించని రీతిలో దూసుకుపోతోంది. కేవలం 5 రోజుల్లోనే మిరాయ్ 2 మిలియన్ డాలర్ల మార్క్ దాటేయడం అరుదైన ఘనత. హనుమాన్ తర్వాత వరుసగా మరోసారి తేజ సజ్జా ఈ రికార్డును నమోదు చేయడం ఆయన పెరుగుతున్న మార్కెట్‌కి నిదర్శనం. ఇక ఇండియాలో అయితే మంగళవారం ఒక్క రోజే ఒక లక్షకు పైగా టిక్కెట్లు బుక్ కావడం సినిమాపై ఉన్న డిమాండ్‌ని స్పష్టంగా చూపిస్తోంది. ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నట్లు, మిరాయ్ విజయానికి ప్రధాన కారణం తేజ సజ్జా డెడికేషన్, డైరెక్టర్ కార్తీక్ ఘట్టమనేని విజువల్ ట్రీట్, నిర్మాత టిజి విశ్వ ప్రసాద్ పెట్టిన భారీ కృషి అని అంటున్నారు. ఈ ముగ్గురి విజన్ వల్లే ఈ సినిమా సాధారణ కమర్షియల్ సినిమాలకన్నా విభిన్నంగా నిలిచి, ప్రేక్షకులను ఆకట్టుకుంటోందని పేర్కొంటున్నారు. అలాగే మనోజ్ మంచు విలన్ పాత్రలో చేసిన పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్ కూడా సినిమా బలంగా నిలిచేలా చేసింది. ఆయన ఎనర్జీ తేజ సజ్జా పాత్రకి సరైన బ్యాలెన్స్ ఇచ్చింది. ఈ ఇద్దరి మధ్య స్క్రీన్‌పై కనిపించిన కాంపిటీషన్ ప్రేక్షకులను బాగా ఎంటర్టైన్ చేస్తోంది. ముఖ్యంగా యాక్షన్ సీక్వెన్సులు, ఫాంటసీ ఎలిమెంట్స్ మిరాయ్‌ని పాన్ ఇండియా స్థాయిలో సూపర్ హిట్‌గా మార్చాయి. మొత్తం మీద, మిరాయ్ విజయంతో తేజ సజ్జా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. వరుసగా రెండు పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్లతో తెలుగు సినిమా ఇండస్ట్రీకి ఒక కొత్త తరహా సూపర్ హీరోని పరిచయం చేశాడు. ఇప్పుడు 100 కోట్ల క్లబ్‌లోకి చేరిన మిరాయ్, రాబోయే రోజుల్లో మరెన్ని రికార్డులను బద్దలుకొడుతుందో చూడాలి.



# ఆర్యన్ ఖాన్ కెమెరా ముందు అందుకే నవ్వడా?




బాలీవుడ్ బాద్ షా షారుఖ్ ఖాన్ కుమారుడు ఆర్యన్ ఖాన్ గురించి అందరికీ తెలిసిందే. హీరోగా ఎంట్రీ ఇస్తాడని అంతా అనుకుంటే.. అందరినీ ఆశ్చర్యపరిచేలా డైరెక్టర్ గా కెరీర్ ను స్టార్ట్ చేశారు. ఇప్పుడు డెబ్యూ మూవీ ది బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్ మూవీకి దర్శకత్వం వహిస్తున్నారు. మరికొద్ది రోజుల్లో ఆ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఆర్యన్ ను చూస్తే.. చిన్న షారుక్ లా కనిపిస్తాడు. కానీ ఓ విషయంలో మాత్రం కాదు. సాధారణంగా షారుక్.. ఫోటోలకు పోజులిచ్చినప్పుడు కచ్చితంగా నవ్వుతారు. ఆర్యన్ మాత్రం నవ్వడు. సీరియస్ లుక్ లో కనిపిస్తుంటాడు. ఎందుకు ఆర్యన్ సీరియస్ గా ఉంటాడని కొందరు నెటిజన్లు డిస్కస్ చేసుకోగా.. ఇప్పుడు ఓ క్లారిటీ వచ్చింది!ఆర్యన్ ఖాన్ డెబ్యూ మూవీలో నటిస్తున్న బాలీవుడ్ నటుడు రాఘవ్ జుయాల్ ఆ విషయంపై ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. అతడికి కెమెరా ముందు నవ్వడమంటే భయమని, అందుకే నవ్వరని చెప్పారు. అదే వైఖరిని కొనసాగించడానికి ఇష్టపడతాడని, కానీ మా విషయంలో మాత్రం నవ్విస్తుంటారని రాఘవ్ చెప్పుకొచ్చారు. ఆర్యన్ లో చిన్న పిల్లల శక్తి ఉందని, కానీ కెమెరా ముందు అతనికి నవ్వడం అలవాటు లేదని తెలిపారు. అయితే అది నాకు, గర్ల్ ఫ్యాన్స్ కు బాగా ఇష్టమని చెబుతూ నవ్వేశారు. ఒక రోజు తాను ఖచ్చితంగా కెమెరా ముందు నవ్విస్తానని చెప్పగా, అప్పుడు అతను వద్దు బ్రో.. అలా చేయవద్దు బ్రో అంటూ రిక్వెస్ట్ చేశాడని గుర్తు చేసుకున్నారు.తాను నవిస్తానని చెబుతానని తెలిపారు. అదే సమయంలో ఆర్యన్ మూవీలో నటిస్తున్న లక్ష్య కూడా మాట్లాడారు. ఒకవేళ ఆర్యన్ నవ్వినా.. ఆ ఫోటోలు అస్సలు బయటికి రావని చెప్పారు. దీంతో ఇప్పుడు రాఘవ్ జుయాల్, లక్ష్య చేసిన కామెంట్స్.. సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ గా మారాయి. దీంతో నెటిజన్లు రెస్పాండ్ అవుతున్నారు. అందుకే ఆర్యన్ నవ్వడా అంటూ మాట్లాడుకుంటున్నారు. అయితే ది బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్ మూవీ, థియేటర్ లో కాకుండా సెప్టెంబర్ 18 నుంచి నెట్ ఫ్లిక్స్ ఓటీటీలో స్ట్రీమింగ్ కు రానుంది. ప్రమోషనల్ కంటెంట్ మంచి హైప్ ను క్రియేట్ చేసింది. సినిమా కంటెంట్ అదే స్థాయిలో ఉంటే ఆర్యన్ కు డెబ్యూతో హిట్ పడడం ఖాయం. మరేం జరుగుతుందో వేచి చూడాలి.


# కాంచనకి శ్రీవల్లి తోడైతే.. పాన్ ఇండియా రచ్చ ఖాయం!

అల్లు అర్జున్, సుకుమార్ కాంబోలో వచ్చిన పుష్ప ఫ్రాంచైజీ మూవీలో శ్రీవల్లి పాత్రను పోషించడం ద్వారా రష్మిక మందన్న పాన్ ఇండియా రేంజ్‌లో మంచి గుర్తింపు దక్కించుకుంది. పుష్ప తర్వాత హిందీలో వరుస పెట్టి సినిమాలు చేస్తున్న ఈ అమ్మడు ముందు ముందు మరిన్ని సినిమాలు అక్కడ చేయడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. బాలీవుడ్ నుంచి బ్యాక్ టు బ్యాక్ సినిమాలు వస్తున్నప్పటికీ రష్మిక మందన్న సౌత్ సినిమాలను కొనసాగిస్తూనే ఉంది. అంతే కాకుండా కొన్ని లేడీ ఓరియంటెడ్ సినిమాలను చేస్తూ బిజీగా ఉంది. ఈ సమయంలో ఈమెను ప్రముఖ కొరియోగ్రాఫర్ కమ్ డైరెక్టర్ రాఘవ లారెన్స్ సంప్రదించాడు అనే పుకార్లు షికార్లు చేస్తున్నాయి. కోలీవుడ్‌లో ప్రస్తుతం ఈ వార్త ప్రముఖంగా వినిపిస్తోంది. తమిళ సినిమా ఇండస్ట్రీ వర్గాల వారు వీరిద్దరి కాంబోలో మూవీ ఉంటుందని బలంగా చెబుతున్నారు. కాంచన 4 సినిమా కోసం రష్మిక మందన్న.. ప్రస్తుతం రాఘవ లారెన్స్ కాంచన 4 సినిమాను చేస్తున్న విషయం తెల్సిందే. ఇప్పటి వరకు వచ్చిన కాంచన ఫ్రాంచైజీ సినిమాలకు పాన్ ఇండియా రేంజ్‌లో మంచి హిట్ టాక్ వచ్చింది. అందుకే ఈ సినిమాపై అన్ని భాషల ప్రేక్షకుల్లోనూ అంచనాలు భారీగా ఉంటాయి. ఇది తమిళ సినిమా అయినప్పటికీ తెలుగులో డైరెక్ట్ తెలుగు సినిమా స్థాయిలో విడుదల కావడం మనం చూడబోతున్నాం. అంతే కాకుండా ఇతర భాషల్లోనూ కాంచన 4 సినిమా భారీ రిలీజ్ కి ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా పూజా హెగ్డే నటిస్తూ ఉండగా, కీలక పాత్రలో బాలీవుడ్ స్టార్ నోరా ఫతేహీ నటిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఇదే సమయంలో కీలకమైన దెయ్యం పాత్రను రష్మిక మందన్నతో చేయిస్తే బాగుంటుంది అనే అభిప్రాయం ను కొందరు వ్యక్తం చేశారట. అందుకే లారెన్స్ చిన్న చిన్న మార్పులు చేసి రష్మిక వద్దకు వెళ్లాడని వార్తలు వస్తున్నాయి. పూజా హెగ్డే, నోరా ఫతేహీ హీరోయిన్స్‌గా.. నటనకు ఆస్కారం ఉన్న పాత్రలను చేసేందుకు రష్మిక ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. అందుకే కాంచన 4 సినిమాలో ఈ శ్రీవల్లి ఉంటుంది అనే విశ్వాసం ను చాలా మంది వ్యక్తం చేస్తున్నారు. ఇంతకు లారెన్స్ ఆమెను సంప్రదించాడా లేదా అనేది మాత్రం ఇప్పటి వరకు క్లారిటీ రాలేదు. సోషల్ మీడియాలో ఎవరికి తోచిన విధంగా వారు కామెంట్స్ చేస్తూ ఉన్నారు. కాంచన 4 లో దెయ్యంగా రష్మిక నటిస్తే ఖచ్చితంగా పాన్ ఇండియా రేంజ్‌లో రచ్చ రచ్చ అన్నట్లుగా కలెక్షన్స్ నమోదు కావడం ఖాయం. బాక్సాఫీస్ షేక్ కావాలంటే రష్మిక వంటి స్టార్ కాస్ట్ కాంచన 4 లో అవసరం అని లారెన్స్ కూడా భావిస్తున్నాడని, అందుకే ఆమెకు అత్యధిక పారితోషికం ఇచ్చి మరీ నటింపజేసే ప్రయత్నాలు చేస్తున్నారు అంటూ వార్తలు వస్తున్నాయి. అసలు విషయం ఏంటి అనేది ముందు ముందు తెలిసే అవకాశాలు ఉన్నాయి. కాంచన 4 పై రాఘవ లారెన్స్ కాన్ఫిడెన్స్.. సూపర్ హిట్ ఫ్రాంచైజీ మూవీ అయిన కాంచన 4 లో ఈమె ఉంటే ఖచ్చితంగా మంచి బిజినెస్ క్రియేట్ కావడంతో పాటు, మంచి బజ్ క్రియేట్ అవుతుంది అనేది ఇండస్ట్రీ వర్గాల అభిప్రాయం. ప్రస్తుతం రష్మిక మందన్నకు ఉన్న మార్కెట్ నేపథ్యంలో కాంచన 4 లో ఆమె నటిస్తే ఖచ్చితంగా అత్యధిక పారితోషికం ఇవ్వాల్సి ఉంటుంది. పైగా దెయ్యం పాత్రకు ఒప్పుకోవాలంటే అంతకు ముందు తీసుకున్న పారితోషికంతో పోల్చితే ఎక్కువగానే ఆమె డిమాండ్ చేసే అవకాశాలు ఉన్నాయి. భారీ బడ్జెట్‌తో కాంచన 4 ను ప్లాన్ చేస్తున్నారు కనుక ఆమె పారితోషికం వారికి సమస్య కాకపోవచ్చు. కానీ రష్మిక కు సినిమాలో స్కోప్ ఉందా, నిజంగానే లారెన్స్ ఆమెను సంప్రదించాడా అనే విషయాలపై చర్చ జరుగుతోంది. రష్మికను ఇప్పటికే చాలా మంది సోషల్ మీడియాలో ఈ విషయమై తెగ సంప్రదించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ ఇప్పటి వరకు ఎటువైపు నుంచి క్లారిటీ రాలేదు.



# రాజా సాబ్ ఫ్యాన్ ఫీస్ట్.. ప్లానింగ్ పీక్స్ అంతే..!

: రెబల్ స్టార్ ప్రభాస్ రాజా సాబ్ సినిమా 2026 జనవరి 9న రిలీజ్ ఫిక్స్ చేశారు. సంక్రాంతి బరిలో ప్రభాస్ తన స్టామినా చూపించాలని దిగుతున్నాడు. ఆల్రెడీ సంక్రాంతికి ఇప్పటికే కొన్ని సినిమాలు రిలీజ్ షెడ్యూల్ చేశాయి. ఐతే రాజా సాబ్ తో ఆ సినిమాలు పోటీ పడక తప్పదు. మారుతి డైరెక్షన్ లో హర్రర్ థ్రిల్లర్ జోనర్ లో వస్తుంది రాజా సాబ్. టీజర్ తోనే సినిమా సంథింగ్ స్పెషల్ అనిపించేశాడు మారుతి. రాజా సాబ్ కి థమన్ మ్యూజిక్ సినిమాను నెక్స్ట్ లెవెల్ కి తీసుకెళ్లేలా ఉంటుందనిపిస్తుంది.ప్రభాస్ ఎలివేషన్స్ పీక్స్.. రాజా సాబ్ సినిమా ఫ్యాన్ ఫీస్ట్ పక్కా అనేస్తున్నారు మేకర్స్. సినిమాలో ప్రభాస్ క్యారెక్టరైజేషన్ తో పాటు ఆయనకు ఇచ్చే ఎలివేషన్స్ ఇంకా స్క్రీన్ ప్లే అన్నీ కూడా రెబల్ ఫ్యాన్స్ కి మాత్రమే కాదు ఆడియన్స్ కి ఫుల్ ట్రీట్ ఇస్తాయట. ఈ సినిమాలో ప్రభాస్ ఎంట్రీ సాంగ్ ని కూడా ఒక ర్యాప్ సాంగ్ గా ప్లాన్ చేస్తున్నారట. థమన్ ఈ సాంగ్ ని డిఫరెంట్ గా డిజైన్ చేశాడని టాక్. రాజా సాబ్ సినిమాలో థమన్ బాలీవుడ్ ఓల్డ్ క్లాసిక్ సాంగ్ ఒకటి రీమిక్స్ చేస్తాడన్న టాక్ వచ్చింది. అది ఉందో లేదో తెలియదు కానీ ప్రభాస్ ఎంట్రీ సాంగ్ మాత్రం ర్యాపర్ సూరజ్ చెరుకత్ తో పాడిస్తున్నాడట. ఆల్రెడీ సాంగ్ కంపోజింగ్ పూర్తవగా త్వరలో షూట్ చేస్తారట. ఈ మూవీలో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ ఫిమేల్ లీడ్ గా చేస్తున్నారు. హర్రర్ జోనర్ లోనే కొత్త అటెంప్ట్.. రాజా సాబ్ సినిమా హర్రర్ జోనర్ లోనే కొత్త అటెంప్ట్ అని అంటున్నారు. మారుతి మార్క్ కామెడీ మిస్ అవ్వదని టీజర్ తోనే చూపించారు. ఇక రెబల్ ఫ్యాన్స్ కోరుకునే మాస్ అంశాలైతే కొదవ ఉండదని టాక్. ఏది ఏమైనా మారుతి రాజా గారి ఇమేజ్ కి తగ్గట్టుగానే రాజా సాబ్ ని చేస్తున్నాడని అనిపిస్తుంది. ప్రభాస్ రాజా సాబ్ సంక్రాంతికి వస్తుంటే హనుతో చేస్తున్న సినిమా సమ్మర్ లేదా సెకండ్ హాఫ్ లో రిలీజ్ ఉంటుందట. ఇక సందీప్ వంగతో చేసే స్పిరిట్ సినిమా సెట్స్ మీదకు వెళ్లేందుకు రెడీగా ఉంది. ప్రభాస్ డేట్స్ కోసమే సందీప్ వెయిటింగ్ అని టాక్. ఇదే కాకుండా మరో 3 సినిమాలు ప్రభాస్ లైన్ లో ఉన్నాయి. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ రీసెంట్ గా మిరాయ్ తో సూపర్ హిట్ అందుకుంది. ఆ సినిమా తర్వాత రాజా సాబ్ ఆ హిట్ జోష్ ని కొనసాగించేలా ఉంది.



# సెప్టెంబర్ 17 తెలంగాణ విలీన దినోత్సవమే



హైదరాబాద్,తెలంగాణ విలీన దినోత్సవం సందర్భంగా జాగృతి కార్యాలయంలో ఎమ్మెల్సీ కవిత జాతీయ జెండా ఎగురవేసారు. తరువాత ఆనాటి పోరాట యోధుడు ఎం. కె మొయినోద్దీన్ కు సత్కారం చేసారు.కవిత మాట్లాడుతూ రాచరికపు నీడను అడ్డుపెట్టుకొని భూస్వాములు, దొరలు ఆనాడు చేసిన అరాచకాలకు వ్యతిరేకంగా ప్రజలంతా పోరాటం చేశారు. ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా 1942 లో సాయుధ రైతాంగ పోరాటం మొదలైంది. ఆనాటి పోరాట స్ఫూర్తిని ఇప్పటికీ రష్యాన్ యూనివర్సిటీల్లో పాఠాలుగా చెబుతున్నారు. తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తికి రైతాంగ సాయుధ పోరాటం ఒక ఉదాహరణ అని అన్నారు.ఆనాటి నుంచి నేటి వరకు కూడా రాచరికపు పాలనను వ్యతిరేకిస్తామని తెలంగాణ ప్రజలు ప్రతి సందర్భంలో నిరూపిస్తూనే ఉన్నారు. బీజేపీ నాయకులు ఇది ముస్లిం రాజులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటమని చిత్రీకరిస్తున్నారు. అది హిందూ, ముస్లింల పోరాటం కానే కాదు. దొరలు, భూస్వాములు, రాచరిక పాలనకు వ్యతిరేక పోరాటం. కానీ దాన్ని మతతత్వ పోరాటమన్నట్లు ప్రచారం చేస్తున్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఫెడరల్ స్ఫూర్తికి వ్యతిరేకంగా తెలంగాణ చరిత్రను వక్రీకరిస్తోంది. సెప్టెంబర్ 17 ను తెలంగాణ విమోచన దినంగా రుద్దే ప్రయత్నం చేస్తోంది. 2023 ఎన్నికలకు ముందు తెలంగాణకు వచ్చి

### విమోచన దినోత్సవమంటూ ఫెడరల్ స్ఫూర్తికి వ్యతిరేకంగా బీజేపీ కార్యక్రమాలు
### తెలంగాణ విలీనంలో కాంగ్రెస్ చేసిందేమీ లేదు
### ఎమ్మెల్సీ కవిత

విమోచన దినోత్సవం అంటూ తప్పుడు ప్రచారం మొదలుపెట్టారని అన్నారు.ఎందుకు తెలంగాణ లో బీజేపీ వాళ్లు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. వేరే రాష్ట్రాల్లోకి కూడా వెళ్లి ఆ రాష్ట్ర చరిత్రను వక్రీకరిస్తున్నారా? ఫెడరల్ స్ఫూర్తికి వ్యతిరేకంగా కేంద్రం చేస్తున్న కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు వ్యతిరేకించటం లేదు. కేంద్ర ప్రభుత్వానికి తమ రాష్ట్రంలో ఇలాంటి కార్యక్రమాలు చేయవద్దని సీఎం లేఖ రాయాలి. 2023 లో కూడా తెలంగాణ విమోచన దినోత్సవం పేరుతో కేంద్రం ఓ కార్యక్రమాన్ని నిర్వహించే ప్రయత్నం చేసింది. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక సీఎం లను ఆ కార్యక్రమానికి ఆహ్వానించారు. కానీ తెలంగాణ చరిత్రను వక్రీకరిస్తున్నారంటూ కేసీఆర్ ఆ కార్యక్రమానికి వెళ్లలేదు. ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం చర్యలు ఉన్నాయంటూ విమర్శించారు. అదే సందర్భంలో భారతీయ సమైక్యత దినోత్సవం గా సెప్టెంబర్ 17 ను నిర్వహించారు. ఆనాటి సంఘటనను మొనార్కీ టు డెమక్రాసీ గా మాత్రమే చూశారు. తెలంగాణ చరిత్రను వక్రీకరించవద్దని నేను కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నాను. తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ కోసం పనిచేసే తెలంగాణ జాగృతి ఇలాంటి వాటికి వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. తెలంగాణను భారత్ లో తామే విలీనం చేశామంటూ పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ గౌడ్ సుద్దపూస మాటలు మాట్లాడారు. కాంగ్రెస్ చేసిందేమీ లేదు. వాళ్లకు అంత సీన్ లేదని అన్నారు.భారత్ లో తన సంస్థానాన్నిసెప్టెంబర్ 17 న విలీనం చేస్తానని అప్పటి ముస్లిం రాజు ప్రకటించారు. అయినప్పటికీ ఆపరేషన్ పోలో పేరుతో భారత సైన్యాన్ని ఇక్కడకు రప్పించారు. ఆపరేషన్ పోలో కారణంగా ఎంతో మంది హిందూవులు, ముస్లింలు చనిపోయారు. అప్పుడు భారత సైన్యం వచ్చిన మార్గాలను దండు బాటలు అంటారు. ఇప్పటికీ ఆ దండు బాటలు ఉన్నాయి. కాంగ్రెస్ చేసింది ఏమీ లేదు. వాళ్ల సెలబ్రేషన్స్ చేసుకోవటానికి కూడా ఏమీ లేదు. మీకు నిజంగా మోడీ మీద ప్రేమ లేకపోతే వెంటనే వాళు తెలంగాణలో చేస్తున్న కార్యక్రమాలను వ్యతిరేకించండి. ఆనాటి పోరాటంలో స్వయంగా పాల్గొన్న జనగాం ప్రాంతానికి చెందిన ఎం.కె మొయినోద్దీన్ ఇక్కడ ఉన్నారు. ఆస్తిని కూడా వదులుకొని దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేశారు. వారికి మా తాత రాఘవేంద్రరావు కూడా సహకారం అందించారు. ఇలాంటి పోరాట యోధున్ని గౌరవించుకోవటం నాతో పాటు జాగృతి సభ్యుల అదృష్టంగా భావిస్తున్నా. సెప్టెంబర్ 17 అంటే భారత్ లో విలీనమైన రోజుగానే భావిస్తాం. ఇక్కడి గంగా, జమున తెహజీబ్ సంస్కృతిని సెలబ్రేట్ చేసుసునే రోజుగానే చూస్తాం. తెలంగాణ జాగృతిగా మత విద్వేషాలను రెచ్చగొట్టే బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తామని అన్నారు.

## బెంగళూరు మా ప్రాణాలను తోడేస్తోంది- ఇక్కడి నుంచి వెళ్లిపోతాం




బెంగళూరులో ట్రాఫిక్ ఇబ్బందులు, అధ్వానంగా మారిన రోడ్ల కారణంగా జెయింట్ లాజిస్టిక్ కంపెనీ బ్లాక్ బక్ సంచలన నిర్ణయాన్ని తీసుకుంది. ఇక్కడి నుంచి వెళ్లిపోనుంది. తొమ్మిది సంవత్సరాలుగా బెల్లందూరు అవుటర్ రింగ్ రోడ్డులో గల ప్రధాన కార్యాలయాన్ని ఖాళీ చేయనుంది. రోజురోజుకూ ట్రాఫిక్ పెరిగిపోతోండటం, రోడ్లు అత్యంత దయనీయంగా మారడం, ఆఫీస్ కు వెళ్లడానికి ఉద్యోగులకు గంటన్నరకు పైగా సమయం పడుతోండటం వల్ల ఈ నిర్ణయానికొచ్చింది.ఈ విషయాన్ని బ్లాక్‌బక్ సహ వ్యవస్థాపకుడు రాజేష్ యాబాజీ వెల్లడించారు. తమ కంపెనీని ఇక్కడి నుండి మార్చనున్నట్లు తెలిపారు. ఇక్కడి మౌలిక సదుపాయాలు, రోడ్ల నిర్వహణ, ట్రాఫిక్ పరిస్థితు మెరుగుపడే అవకాశం లేదని ఆయన నిరాశ వ్యక్తం చేశారు. దీనికి సంబంధించిన సమాచారాన్ని తన అధికారిక ఎక్స్ అకౌంట్ లో పోస్ట్ చేశారుబ్లాక్‌బక్.. లాజిస్టిక్ టెక్నాలజీ ప్లాట్‌ఫాం. బెంగళూరు ప్రధాన కేంద్రంగా దేశవ్యాప్తంగా తన కార్యకలాపాలను కొనసాగిస్తోందీ సంస్థ. బెల్లందూరు అవుటర్ రింగ్ రోడ్ సమీపంలో ఈ సంస్థ ప్రధాన కార్యాలయం చాలాకాలం నుంచి కొనసాగుతోంది. బెంగళూరులో అత్యంత రద్దీగా ఉండే మార్గాల్లో ఇదీ ఒకటి. వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఒక్కసారి ట్రాఫిక్ లో చిక్కుకుంటే అప్పుడప్పుడే బయటపడటం కష్టం అని భావించే మార్గం ఇది.రోజువారీ ప్రయాణానికి ఎక్కువ సమయం పడుతుండటంతో ఉద్యోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని రాజేష్ యాబాజి తెలిపారు. ప్రస్తుతం అక్కడ కొనసాగడం చాలా కష్టమని అభిప్రాయపడ్డారు. ఆఫీస్ కు రావడానికి ఉద్యోగులకు గంటన్నరకు పైగా సమయం పడుతోందని తెలిపారు. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ గుంతలు ఉన్నాయని, దుమ్ము ధూళితో నిండి పోయాయని, వాటిని సరిచేయడానికి పెద్దగా ప్రయత్నాలు జరగట్లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.వచ్చే అయిదేళ్లలో కూడా ఈ పరిస్థితిలో పెద్దగా మార్పు వచ్చే అవకాశం లేదని అన్నారు. బెంగళూరు బెల్లందూర్ ఆఫీస్ తమకు ఇంటితో సమానమని యాబాజి ట్వీట్ చేశారు. ఇప్పుడిక్కడ కొనసాగడం చాలా కష్టమని వ్యాఖ్యానించారు. రోజువారీ ప్రయాణం గానీ, ఇతర కార్యకలాపాలు గానీ గగనం అయ్యాయని పేర్కొన్నారు. అందుకే ఇక్కడి నుంచి తరలిపోవాలని నిర్ణయించుకున్నామని స్పష్టం చేశారు.

## సూర్యుడి చుట్టూ తిరిగే ఓ బుల్లి చంద్రుడిని గుర్తించిన శాస్త్రవేత్తలు

న్యూ డిల్లీ సెప్టెంబర్ 17సాధారణంగా చంద్రుడు భూమి చుట్టూ తిరుగుతాడు. కానీ సూర్యుడి చుట్టూ తిరిగే ఓ బుల్లి చంద్రుడిని శాస్త్రవేత్తలు ఇటీవల గుర్తించారు. ఈ చిన్ని చందమామ సూర్యుడి చుట్టూ తిరుగుతున్నా భూమికి దగ్గరగా ఉందని తెలిపారు. నిజానికి ఆ చందమామ ఒక గ్రహశకలం. దానికి '2025 పీఎన్7' అని పేరు పెట్టారు. భూమి మాదిరిగానే ఈ అంతరిక్ష శిలకు కూడా సూర్యుడిని చుట్టి రావడానికి ఒక ఏడాది సమయం పడుతోందని సైంటిస్టులు చెప్పారు.ఇలాంటి అంతరిక్ష శిలలను క్వాసీ మూన్స్‌గా పిలుస్తారు. అరుదుగా భూమి చుట్టూ తిరిగే తాత్కాలిక మినీ మూన్‌లకు ఇవి భిన్నంగా ఉంటాయి. '2024 పీటీ5' అనే మినీ మూన్ ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. '2024 పీటీ5' గత ఏడాది రెండు నెలలపాటు మాత్రమే భూమి చుట్టూ తిరిగింది. గతంలో చందమామ నుంచి విడిపోయిన ఒక తునకగా దాన్ని భావిస్తున్నారు. భూమికి సమీపంలో క్వాసీ చందమామలు అనేకం ఉన్నాయని శాస్త్రవేత్తలు తెలిపారు.'2025 పీఎన్7'ను గత నెల 29న హవాయ్‌లోని పాన్-స్టార్స్ అబ్జర్వేటరీ గుర్తించింది. ఇది భూమి సమీప కక్ష్యలో దశాబ్దాలుగా తిరుగుతోందని పాత డేటాను పరిశీలించినప్పుడు వెల్లడైంది.

## రాచరికం నుండి ప్రజా పాలనకు : గుత్తా సుఖేందర్ రెడ్డి


నల్లగొండ, సెప్టెంబర్ 17 : రాచరిక వ్యవస్థ నుండి ప్రజా పాలనా వ్యవస్థ ఆవిర్భావానికి నాంది పలికిన రోజు సెప్టెంబర్ 17. తెలంగాణ చరిత్రలో కీలకమైన రోజు. హైదరాబాద్ సంస్థానం భారత్ యూనియన్‌లో చేరి నేటికి 77 సంవత్సరాలు పూర్తి చేసుకుని 78వ సంవత్సరంలోకి అడుగిడుతున్న శుభ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు, పాత్రికేయులు, ఉద్యమకారులకు, కార్మిక, కర్షక, విద్యార్థినీ, విద్యార్థులు, ప్రజలందరికీ రాష్ట్ర శాసన



మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి శుభాకాంక్షలు. బుధవారం తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాచరిక వ్యవస్థ నుండి ప్రజా పాలనా వ్యవస్థ ఆవిర్భావానికి నాంది పలికిన అమరులైన తెలంగాణ సాయుధ, రైతాంగ పోరాట యోధులకు, స్వాతంత్ర్య సమరయోధులందరికీ జోహార్లు అన్నారు.నైజాం పాలనలో కనీస హక్కుల కోసం, దోపిడీ, దౌర్జన్యాలను ఎదిరించిన ప్రజలపై దాడులు, దారుణాలు ఎక్కువ కావడంతో ప్రజలు ఎదురు తిరిగారు. రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా ఆంధ్ర మహాసభల ద్వారా మగ్దూం మోహియోద్దీన్, రాజ్ బహదూర్‌గౌర్, రామానందతీర్థ, మాడపాటి హనుమంత రావు, బూరుగుల రామ కృష్ణా రావు, కొండా వెంకట రంగారెడ్డి, రావి నారాయణ రెడ్డి, దేవలపల్లి రామానుజారావు, కె.ఎల్.మహేంద్ర, డా.మర్రి చెన్నారెడ్డి హైదరాబాద్ సంస్థాన ప్రజలను చైతన్య పరిచారు. ఆనాడు జరిగిన ప్రజా పోరాటాల్లో అప్పటి ఉమ్మడి నల్లగొండ జిల్లా కీలక పాత్ర పోషించింది.ప్రపంచ పోరాటాల చరిత్రలో తెలంగాణా సాయుధ పోరాటానికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. భూస్వామ్య, జమీందార్లకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో అప్పటి నల్లగొండ జిల్లాలోని గుండ్రాంపల్లి, కడవెండి, రావులపెంట ప్రాంతాలు ఉద్యమానికి కేంద్ర బిందువులుగా నిలిచినట్లు తెలిపారు. అంతే కాకుండా వీటన్నింటికి పరాకాష్టగా 1948 ఆగష్టు 27న జరిగిన భైరాన్ పల్లి కాల్పుల సంఘటన మరవరానిదన్నారు. ఆ తర్వాత 21 రోజులలోనే హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో చేరినట్లు చెప్పారు. హైదరాబాద్ సంస్థానం భారతదేశం భూభాగం మధ్యలో ఉండటం భవిష్యత్ లో సమస్యలకు దారి తీస్తుందని భారత ప్రభుత్వం భావించింది. మరోవైపు ప్రజలపై రజాకార్లు, జమీందార్ల దాడులు పెరిగిన నేపథ్యంలో అప్పటి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ హైదరాబాద్ సంస్థానాన్ని భారత దేశంలో విలీనం చేయాలని నిజాంకు రాయబారం పంపారు. తమ సంస్థానాన్ని భారత్‌లో విలీనం చేసేందుకు నిజాం అంగీకరించకపోవడంతో 1948 సెప్టెంబర్ 13న భారత సైన్యం రంగంలోకి దిగింది. దీనినే ఆపరేషన్ పోలో అని పిలిచారు.ఓవైపు సాయుధ పోరాటం..మరోవైపు భారత సైన్యం రంగంలోకి దిగడంతో చేసేదేమిలేక అప్పటి నిజాం భారత యూనియన్ లో విలీనానికి అంగీకరించాడు. 1948 సెప్టెంబరు 17 సాయంత్రం డెక్కన్ రేడియోలో ఇండియన్ యూనియన్ లో చేరుతానని ప్రకటించారు. నిజాం లొంగుబాటుతో హైదరాబాద్ సంస్థానాన్ని భారత దేశంలో కలపడం జరిగిందని తెలిపారు. అనంతర కాలంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల పేరుతో 1956లో ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పాటు చేశారు. కాలక్రమేణా ఆంధ్రా పాలకుల నిర్ణయాలకు వ్యతిరేకంగా తెలంగాణలో తొలి, మలి ఉద్యమాలు ఉవ్వెత్తున ఎగిసి 2014 జూన్ 2న ప్రత్యేక రాష్ట్ర కలను సాకారం చేసుకుంది. తెలంగాణ సాధన తర్వాత ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అన్ని రంగాల్లో రాష్ట్రనీ ప్రగతి పథంలో శరవేగంగా అభివృది చెంద తూ, దేశానికే తలమానికంగా తయారైందని ఆయన పేర్కొన్నారు.

## గాజా ఆక్రమణకు ఇజ్రాయెల్ భీకర దాడులు..! 78 మంది మృత్యువాత..!

పాలస్తీనాలోని గాజా నగరం ఆక్రమణ కోసం ఇజ్రాయెల్ ఇవాళ భారీ ఎత్తున భూతల దాడులు ప్రారంభించింది. ఇన్నాళ్లూ వైమానిక దాడులు చేస్తూనే పరిమిత స్థాయిలో భూతల దాడులు నిర్వహించిన ఇజ్రాయెల్.. ఇవాళ మాత్రం పూర్తి స్థాయిలో భూతల దాడుల్ని చేపట్టింది. ఇందులో గాజా నగరంలో ఉన్న పౌరులు మృత్యువాత పడుతున్నారు. ఇవాళ ఒక్కరోజే దాదాపు 80 మంది పౌరులు ఈ దాడుల్లో చనిపోయారు.గాజాపై దాడులు చేస్తామని, నగరాన్ని ఖాళీ చేసి వెళ్లిపోవాలని ఇజ్రాయెల్ ముందస్తు హెచ్చరికలు చేసింది. గాజా నగరాన్ని పూర్తిగా ఆక్రమించుకునే లక్ష్యంతో భారీ ఎత్తున సైన్యాన్ని పంపిన ఇజ్రాయెల్ ఎడతెరిపి లేకుండా దాడులు కొనసాగిస్తోంది. దీంతో భారీ సంఖ్యలో పౌరులు గాజా నగరాన్ని విడిచి పయనం అవుతున్నారు. కొందరు ట్రక్కుల్లో, మరికొందరు నడుచుకుంటూనే గాజా నుంచి భారంగా నిష్క్రమిస్తున్నారు.ఇవాళ ఆపరేషన్ ప్రారంభమైన వెంటనే ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ గాజా కాలిపోతోందంటూ



ప్రకటించారు. నిన్న రాత్రి నుంచే మొదలైన దాడులు ఇవాళ ఉదయం కూడా కొనసాగాయని తెలిపారు. గాజా నగర ఆపరేషన్ యొక్క ప్రధాన దశ ప్రారంభమైందని, నగర శివార్ల నుండి కేంద్రం వైపు తమ దళాలు కదులుతున్నాయని రక్షణమంత్రి వెల్లడించారు. ఇజ్రాయెల్ సైన్యం గాజా నగరంలో దాదాపు 2,000 నుండి 3,000 మంది హమాస్ ఉగ్రవాదులు మిగిలి ఉన్నారని పేర్కొంది. అలాగే ఉగ్రవాద సంస్థ ఉపయోగించే సొరంగాలు కూడా ఇంకా మిగిలి ఉన్నాయని అంచనా వేస్తోంది.ఇజ్రాయెల్ గాజాలో మారణహోమానికి పాల్పడిందని, ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహుతో సహా ఇజ్రాయెల్ ఉన్నతాధికారులు ఈ చర్యలను ప్రేరేపించారని ఐక్యరాజ్యసమితి విచారణ కమిషన్ తేల్చిన రోజే ఈ దాడులు మొదలయ్యాయి. ఐక్యరాజ్యసమితి కమిషన్ తన నివేదికలో ఇజ్రాయెల్ మారణహోమాన్ని నిర్ధారిస్తూ హత్యల స్థాయి, పౌరులకు అడ్డంకులు, బలవంతంగా ఖాళీ చేయించడం, సంతానోత్పత్తి క్లినిక్ విధ్వంసం వంటి ఉదాహరణలను చూపింది. అయితే ఇజ్రాయెల్ ఈ రిపోర్ట్ ను తోసిపుచ్చింది.

## గౌండ్లగూడెంలో నూతన బోర్ మోటార్ ప్రారంభం

నిడమనూరు, సెప్టెంబర్ 17 : నిడమనూరు మండల పరిధిలోని గౌండ్లగూడెంలో ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి చొరవతో మంజూరైన నూతన బోరు మోటార్‌ను వ్యవసాయ మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం బుధవారం ప్రారంభించారు. 40 ఇండ్లకు నీరందించే బోర్ మోటార్ ఇటీవల మరమ్మతుకు గురైంది. మార్కెట్ చైర్మన్ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో నూతన బోర్ మోటార్ మంజూరు చేయించారు. అంతకు ముందు స్వస్థ నారీ శక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా నిడమనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కంటి పరీక్షల శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.వి.అరవింద్, సీహెచ్‌ఓ రమేశ్, సూపర్‌వైజర్ మేరీ స్టెల్లా, నాయకులు కొండా శ్రీనివాస్ రెడ్డి, నర్సింగ్ విజయ్ కుమార్, చర్క శ్రీను, మెరుగు శ్రీనివాస్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## తల్లీబిడ్డల ఆరోగ్యంపై అంగన్‌వాడీలు ప్రత్యేక దృష్టి సారించాలి : కేవీ కృష్ణవేణి

నీలగిరి, సెప్టెంబర్ 17 : తల్లీబిడ్డల ఆరోగ్యంపై అంగన్‌వాడీలు ప్రత్యేక దృష్టి సారించాలని నల్లగొండ జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారి కేవీ కృష్ణవేణి అన్నారు. నల్లగొండ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పోషణ్ బీ ? పడాయి బీ కార్యక్రమంపై అంగన్‌వాడీ టీచర్లకు మూడు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో బుధవారం ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు తమ సర్వేలో ఉండే మహిళలపై ప్రత్యేక దృషి పెట్టాలన్నారు. తమ సర్వేలో గర్భిణీలను త్వరగా రిజిస్ట్రేషన్ చేసి వారికి పౌష్టికాహారం అందించాలన్నారు. గర్భం దాల్సిన నాటి నుండి ప్రసూతి అయి పిల్లలు స్కూల్‌కు వెళ్లేంత వరకు వారికి నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. గర్భిణిగా ఉన్నప్పుడు వారి ఆరోగ్యం, పిల్లలు వచ్చాక పిల్లల ఆరోగ్యం, వారు వయస్సుకు తగిన బరువు, ఎత్తు పెరుగుతున్నారా లేదా ప్రత్యేకంగా గుర్తించాలన్నారు.చిన్నారులకు ఆహారంతో పాటు విద్యను కూడా అందించాలని సూచించారు. చదువు పట్ల అక్షరాలను గుర్తించేలా ప్రీస్కూల్ కార్యక్రమాలు చేయించాలన్నారు. చిన్నారులకు శారీరక, మానసిక, సామాజిక అభివృద్ధికి ప్రీస్కూల్ కార్యక్రమాలు సక్రమంగా నిర్వహిస్తూ వెనకబడిన పిల్లలపై ప్రత్యేకంగా శ్రద్ధ చూపించాలన్నారు. ప్రతి బిడ్డ సమగ్రంగా ఎదగాలంటే టీచర్లుగా మీవంతు కృషి అవసరమని వివరించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ తూముల నిర్మల, సూపర్‌వైజర్లు పార్వతి, జయమ్మ, మల్లేశ్వరి, లక్ష్మమ్మ, మంజుల, శ్రీలత, పద్మ, సరస్వతి, ప్రణీత, వినోదకుమారి, స్వరూప, పోషణ్ అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ సతీశ్, అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా హిందీ దివస్

నార్నూర్ : నార్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం హిందీ దివస్ ను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో హిందీ భాష ప్రాముఖ్యత, ఔన్నత్యం గురించి విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపల్ వెంకట కేశవులు మాట్లాడుతూ హిందీ భాష దేశ సమైక్యత , సౌభాతృత్వాన్ని కాపాడే భాష అని కొనియాడారు. భారత దేశానికి స్వాతంత్రం రావడంలో కీలక పాత్ర పోషించిందని , ఈ భాషను ప్రతి ఒక్కరు నేర్చుకోవడం ఎంతో అవసరం ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో హిందీ అధ్యాపకులు బాలాజీ కాంబ్లేను శాలువాతో సన్మానించారు. కళాశాల ప్రిన్సిపల్ వెంకట కేశవులు, ఏజీఎంసీ కే వెంకటరమణ, ఎల్ సుజాత, బి సుజాత, పి ఉదయ్ కుమార , చెదల నరేష్, అజయ్ కుమార్, వరుణ్ రెడ్డి, జే రచన, బోధనేతర సిబ్బంది, గజానంద్, ఆడే కృష్ణవేణి, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహనీయుల త్యాగఫలం మన తెలంగాణ.

జయశంకర్ భూపాలపల్లి, సెప్టెంబర్ 17:ఎందరో మహనీయుల త్యాగఫలం మన తెలంగాణ. పరిపాలనలో, ప్రతి నిర్ణయం సందర్భంలో వారి త్యాగాలు గుర్తుంటాయని ట్రై కార్ అధ్యక్షులు డా.బెల్లయ్య నాయక్ పేర్కొన్నారు. నాలుగు కోట్ల ప్రజల సంక్షేమమే గీటురాయిగా ప్రజా ప్రభుత్వ పాలన సాగుతోందని, తెలంగాణ ప్రజలే ఈ రాష్ట్ర ప్రస్థానానికి నావికులని, వారి ఆలోచనలే ప్రభుత్వ ఆచరణ, వారి ఆకాంక్షలే... ప్రభుత్వ కార్యాచరణ తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ డా బెల్లయ్య నాయక్ అన్నారు.బుధవారం ఐడిఓసి కార్యాలయంలో జరిగిన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ముందుగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 77 సంవత్సరాల క్రితం తెలంగాణ గడ్డపై రాచరికానికి, నియంతృత్వానికి, పెత్తందారీ తనానికి వ్యతిరేకంగా సాయుధ వీరులు నిజాం నిరంకుశ రాజును, ఆనాటి రాచరిక వ్యవస్థను ముట్టడించి తెలంగాణ బానిస సంకెళ్లు తెంచిన చారిత్రాత్మక ఘట్టం సెప్టెంబర్ 17, 1948న మన రాష్ట్ర రాజధాని హైదరాబాద్ గడ్డపై ఆవిష్కృతమైందన్నారు. రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవం కోసం రాచరిక పోకడపై చేసిన తిరుగుబాటు అది పేర్కొన్నారు. తెలంగాణ అంటే త్యాగం. ఆ త్యాగాలకు ఆద్యుడు దొడ్డి కొమురయ్య, వరంగల్ కు చెందిన షేక్ బందగి భాను నాయక్ లకు నివాళులర్పించారు. తమ ప్రాణాలను ఒడ్డి సాయుధ పోరాటానికి ఊపిరి పోసిన నాటి సాయుధ పోరాటంలో ఎందరో తమ జీవితాలను త్యాగం చేశారని కొనియాడారు. సర్వం కోల్పోయినా లక్ష్య సాధనలో వెనుకంజ వేయక ఆనాటి సాయుధ పోరాటంలో ప్రాణాలు వదిలిన అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియచేశారు.సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రస్థానంలో అత్యంత కీలకమైన రోజని, ఈ శుభదినాన్ని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. సెప్టెంబర్ 17, 1948న తెలంగాణ ప్రజలు నిజాం రాచరిక వ్యవస్థను కూలదోసి... ప్రజాస్వామ్య ప్రస్థానానికి నాంది పలికారన్నారు. ప్రజా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం 4 కోట్ల ప్రజల ఆకాంక్ష, వారి ఆలోచన, నాటి తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తి, గడిచిన పదేళ్లలో ప్రజలు తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుతో తమ భాదలు తీరతాయని ఆశించారో అవి నెరవేరలేదన్నారు. ప్రభుత్వ ఆశ, ఆలోచన, ఆచరణ ప్రతీది ప్రజా కోణమేనని, అందుకే ఈ శుభ దినాన్ని ప్రజా పాలన దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు బంగారు కుటుంబాలు, మార్గదర్శుల సమన్వయ బాధ్యతలు

### - పి4 కార్యక్రమం పై అవగాహన సదస్సు

కడప(విజయసారథి):రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పి4 కార్యక్రమంలో భాగంగా జిల్లాలో గుర్తించిన బంగారు కుటుంబాలు,మార్గదర్శులకు సమన్వయ కర్తలుగా గ్రామ వార్డు సచివాలయాల కార్యదర్శులను నియమించారు.ఇందుకు సంబంధించి బంగారుకుటుంబాలను,మార్గదర్శులను గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో క్లస్టర్ వారీగా విభజించి కార్యదర్శులకు బాధ్యతలు అప్పజెప్పారు. బంగారు కుటుంబాల అవసరాలను గుర్తించి మార్గదర్శులకు సమన్వయకర్తలుగా వ్యవహరించడంపై,జూ 4 కార్యక్రమం పై అవగాహన సదస్సు బుధవారం సభా భవన్లో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సిపిఓ హాజరతయ్యా, శిక్షణ అధికారులు, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు



## అంగీకార్ - 2025 కరపత్రాలను ఆవిష్కరించిన చేసిన జిల్లా హౌసింగ్ అధికారిణి శైలజ

అనంతపురము(విజయసారథి):అంగీకార్ - 2025 కు సంబంధించిన కరపత్రాలను నేటి బుధవారం జిల్లా హౌసింగ్ శాఖ జిల్లా అధికారిణి శ్రీమతి ఎం. శైలజ స్థానిక హౌసింగ్ కార్యాలయంలో ఆవిష్కరించారు.అంగీకార్ 2025 కార్యక్రమ వివరాలు.

నిరుపేదల సొంతింటి కల నెరవేర్చడంలో భాగంగా పిఎంఏవై అర్బన్ 2.0 పథకం పై అవగాహన పెంచడానికి ఉద్దేశించినదే అంగీకార్ 2025 కార్యక్రమం

ఈ కార్యకమం 17 సెప్టెంబర్ నుండి 31 అక్టోబర్ 2025 వరుకు జరుగును.

సొంత స్థలం ఉండి ఇల్లు లేని వారికీ మొదటి ప్రాధాన్యం ఇవ్వటం జరుగుతుంది

ఇంటి నిర్మాణం పూర్తికాగానే సూర్యగర్ యోజన పథకం క్రింద సబ్సిడీపై సౌర ఫలకలను ఏర్పాటు చేసి, సౌర విద్యుత్ ఉత్పత్తి జరిగేలా చూస్తారు. ఇందుకోసం అవసరమైన అవగాహన మరియు సహకారం



అందించటం.అసంపూర్తిగా ఉన్న ఇంటికి సంబందించిన లబ్ధిదారుని కలిసి ఇల్లు పూర్తి అగు విదంగా సహాయ సహకారాలు అందించటం.

ఇల్లు పూర్తయిన లబ్దిదారులను దసరాపండుగ పర్వదినాన గృహప్రవేశాలు చేయించటం.

లేఔట్లలో లబ్దిదారులకు హెల్త్ క్యాంప్స్ ఇన్వహించటం

లేఔట్లలో మొక్కలు నాటి పెంచేలా ప్రోత్సహించటం.

తడిచెత్త పొడిచెత్త పై అవగాహన కల్పించటం.

ఈ కార్యక్రమములో మేనేజర్ ఖాసీం, శ్రీమానారాయణ, విజయ భాస్కర్, రామ మూర్తి, సహాయక ఇంజనీర్లు,డేటా ఎంట్రీ ఆపరేటర్లు మరియు వర్క్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 18 వ & 19 వ తేదీలలో కర్నూలు మార్కెట్ యార్డ్ కు సెలవు, ఆ తేదీలలో ఏమ్మిగనూరు మార్కెట్ యార్డ్ లో ఉల్లి క్రయ విక్రయాలు జరుగును.

### సెప్టెంబర్ 18,19 వ తేదీలలో కర్నూలు మార్కెట్ యార్డ్ లో ఉల్లి బహిరంగ వేలం నిర్వహణ

### జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య

కర్నూలు(విజయసారథి):సెప్టెంబర్ 18 వ, 19 వ తేదీలలో కర్నూల్ మార్కెట్ యార్డ్ కు సెలవు ప్రకటించామని జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య తెలిపారు.17 వ తేదీన మార్కెట్ యార్డ్ కు ఉల్లి పంట ఎక్కువ వచినందున, మార్కెట్ యార్డ్ పూర్తి గా నిండిపోయినందున, నిలువ ఉన్న ఉల్లి ను ట్రేడింగ్ మరియు బహిరంగ వేలం ద్వారా బయటికి తరలించడానికి, రైతులకు ఇబ్బంది లేకుండా 18,19వ తేదీలలో కర్నూల్ మార్కెట్ యార్డ్ కు సెలవు అలాగే ఆ తేదీలలో ఏమ్మిగనూరు మార్కెట్ యార్డ్ లో ఉల్లి క్రయ విక్రయాలు జరుగును అని జాయింట్ కలెక్టర్ వివరించారు. రైతులు ఈ విషయాన్ని గమనించి ఉల్లిని 18,19 తేదీలలో కర్నూలు మార్కెట్ యార్డ్ కు తీసుకొని రాకుండా ఎమ్మిగనూరు మార్కెట్ యార్డ్ కు తీసుకెళ్ళమని జాయింట్ కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. 18 వ & 19 వ తేదీలలో కర్నూలు మార్కెట్ యార్డ్ లో ఉల్లి బహిరంగ వేలం నిర్వహిస్తామని, రిటైలర్స్, హోల్సేలర్స్, హోటల్స్ యాజమాన్యాలు తదితరులు బహిరంగ వేలంలో పాల్గొనాలని జాయింట్ కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.రైతులు ఉల్లి పంట కోతకు వచ్చేవరకు అనగా నాటిన 100 నుండి 120 రోజులవరకు తమ పొలంలో ఉంచి పక్వానికి వచ్చిన తర్వాత మాత్రమే కొయ్యాలి అని రైతులకు జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య సూచించారు.రైతులు పండించిన ఉల్లి పంటకు సరైన ధర లేకపోవడం వలన వ్యాపారస్తులు సరియైన ధర ఇవ్వక రైతుల నష్ట పోకూడదని ఉద్దేశంతో ప్రభుత్వము మద్దతు ధర రూపాయలు 1200 క్వింటా కి నిర్ణయించింది. ట్రేడర్స్ కొనుగులు చేసిన తరవాత మిగిలిన ఉల్లి ని మార్క్ ఫెడ్ ద్వారా 31.08.2025 నుండి కర్నూలు మార్కెట్ యార్డ్ నందు కొనుగోలు చేయడం ప్రారంభించడం జరిగినది. ట్రేడర్స్ కొన్న ధరకు మద్దతు ధరకు ఉన్న వ్యత్యాసపు ధరను ప్రభుత్వం రైతులకు జమచేయ్యడం జరుగుతుంది. ట్రేడర్స్ కొనని ఉల్లిని ప్రభుత్వం మార్క్ ఫెడ్ ద్వారా రూపాయలు 1200 క్వింటా కి కొనుగోలు చేస్తుంది. ఇప్పటివరకు రైతుల నుండి దాదాపుగా 6700 టన్నుల ఉల్లి పంటను రైతులు నష్టపోకూడదని ఉద్దేశంతో క్వింటాలకు 1200 రూపాయలు చెల్లించి కర్నూలు మార్కెట్ యార్డ్ నందు కొనుగోలు చేస్తూ ఇతర జిల్లాల రైతు బజార్లకు, ఇతర జిల్లాల మార్కెట్లకు, పౌరసరఫరాలకు మరియు హోటల్ వారికి సరఫరా చేయగా మిగిలిన ఉల్లి పంట ను గోదాముల్లో నిల్వచేసినను రోజురోజుకు మార్కెట్ కు రైతులు తెచ్చే ఉల్లి పంట వ్యాపారస్తులు కొనలేకపోవడం వలన స్థలాభావం వలన మరియు నాణ్యతలేని ఉల్లిని రైతులు తెస్తున్నాకొనుగోలు చెయ్యడం వలన కొంత ఉల్లి కుళ్ళుతున్నది. కుళ్ళిన ఉల్లి పంటను డంపుయార్డ్కి ఉల్లిని తరలిస్తూ రైతులకు ఇబ్బంది కలగకుండా వారికి యార్డు నందు స్థల సౌకర్యం కల్పిస్తూ కొనుగోలు చేయడం జరుగుతుంది అని జాయింట్ కలెక్టర్ తెలిపారు.

## మహిళల ఆరోగ్య పరిరక్షణతో కుటుంబాల బలోపేతం సాధ్యమవుతుంది


### ఇంచార్జి కలెక్టర్ డా. బి.నవ్య

కర్నూలు(విజయసారథి):మహిళల ఆరోగ్య పరిరక్షణతో కుటుంబాల బలోపేతం సాధ్యమవుతుందని ఇంచార్జి కలెక్టర్ డా. బి.నవ్య పేర్కొన్నారు.బుధవారం స్థానిక ఏ క్యాంప్ లో ఉన్నటువంటి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ మాసోత్సవాలు, 8వ రాష్ట్రీయ పోషణ్ మాహ్ కార్యక్రమాలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి స్త్రీ ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందనే ఉద్దేశ్యంతో ప్రధానమంత్రి స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాలను ఈరోజు ప్రారంభించడం జరిగిందన్నారు.అదే విధంగా 8వ రాష్ట్రీయ పోషణ్ మాహ్ కార్యక్రమాలను కూడా ఈరోజు నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు.స్త్రీ ఆరోగ్యంగా ఉండడం ఎంత ముఖ్యమైనదని గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వారు స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాలను క్యాంపెయిన్ మోడ్ లో ఈ కార్యక్రమాన్ని లాంచ్ చేయడం ద్వారా తెల్పిస్తున్నారన్నారు.మన ఇంట్లో అందరూ తిన్న తర్వాతే అమ్మ భోజనం చేయడం అప్పుడప్పుడు మనం గమనిస్తూ ఉంటామని, అది కరెక్ట్ కాదని అందరూ కలిసి భోజనం చేయాలన్నారు. అమ్మల ఆరోగ్యనికి ప్రత్యేక ప్రాముఖ్యత ఇస్తూ అందుకు పెద్ద పీట వేస్తూ ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించడం జరిగిందన్నారు.ముఖ్యంగా ఇప్పుడు మనం చూసుకుంటే మన జీవనశైలి విధానం లైఫ్ స్టైల్ మోడిఫికేషన్ ద్వారా కూడా కొంత హెల్తీగా ఉండే పరిస్థితి ఉంటుందన్నారు. ముఖ్యంగా పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవాలి అనే విషయం పై ఎక్కువ శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంటుందని బ్యాలెన్స్ డైట్ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైస్ ఎక్కువ తింటామని, ప్రోటీన్ కంపోనేంట్ లు చాలా తక్కువ ఉంటుందన్నారు. పప్పులు, మిల్లెట్స్, రాగులు, సజ్జలు, కొర్రలు అలాగే పప్పు దినుసులు లాంటివి మన ఆహారంలో ఎక్కువ శాతం మనం తీసుకునే విధంగా ప్రజలలో అవగాహన వచ్చిందన్నారు.అలాగే ముడి పదార్థాలు, కార్బోహైడ్రేట్లు లాంటివి వినియోగం చేయడం తక్కువ చేసుకోవాలన్నారు. కార్బోహైడ్రేట్లు వినియోగం చేయడం వల్ల ఓబిసిటీ ప్రాబ్లం ఎక్కువ వస్తుందన్నారు. సమతుల్యమైన ఆహారాన్ని అందరూ కూడా ఇదొక లైఫ్ స్టైల్ మన జీవన శైలిలో దీన్ని ఒక భాగంగా చేసుకోవాలన్నారు.పిల్లలకి చిన్నప్పటినుంచి ఈ జీవన శైలిని అలవాటు చేయాలన్నారు.కొర్రలు, సజ్జలు తో ఆహార పదార్థాలు చేసి పిల్లలకి తినిపిస్తే మంచిగా పోషక విలువలు ఉన్న సమతుల్యమైన ఆహారం పిల్లలకి అందుతుందన్నారు. పిల్లలకి కంపల్సరీగా ప్రోటీన్ బేస్ డైట్ ఇవ్వడమనేది చాలా ముఖ్యమన్నారు.ఒత్తిడి, ఆందోళన వల్ల బిపి అనేది ఎక్కువ వస్తుందన్నారు.బిపి ద్వారా గుండె సంబంధిత సమస్యలు, నరాలకు సంబంధించిన సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. మహిళలలో ఎక్కువగా మెనోపాస్ టైం కి ఎముకలు బలహీనత పడి నడవడం కష్టంగా ఉండడం లాంటివి చూస్తూ ఉంటామన్నారు. వీటన్నిటిని అధిగమించడానికి మానవ జీవన శైలిలో యోగాన్ని ఒక విధానం కింద మార్చుకోవాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రోటోకాల్ ప్రకారం నేర్చుకున్న యోగా కార్యక్రమాలను ప్రతి రోజు కాసేపు చేసిన యెడల ఒత్తిడి, ఆందోళన కి సంబంధించి సమస్యలు తలెత్తకుండా ఉంటాయన్నారు.యోగ చేయడం ద్వారా చదువుకునే పిల్లల్లో ఏకాగ్రత దృష్టి పెరుగుతుందన్నారు.

అదే విధంగా వాకింగ్ కూడా రోజు కి అరగంట చేసిన ఆరోగ్య సమస్యలు రాకుండా ఉంటాయన్నారు.గర్భవతుల ఆరోగ్యం మీద రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన దృష్టి పెడతారన్నారు.టేక్ హోమ్ రేషన్ కిట్లు, ఐరన్ ఫోలిక్ యాసిడ్ సప్లిమెంటేషన్ ను వారికి అందచేస్తూ వాళ్ళ ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు మానిటర్ చేస్తూ ఉంటారన్నారు.టేక్ హోమ్ రేషన్ కిట్లలో ఇచ్చే ప్రతి పదార్థం కూడా దాంట్లో పోషక విలువలు అన్నీ కూడా ప్రెగ్నెంట్ మహిళ కి అవసరమైనవన్నారు. గర్భవతులు వాటిని తినడం చాలా అవసరమని అప్పుడే కడుపులో ఉన్న బిడ్డ ఎదుగుదల బాగుంటుంది, ప్రాపర్ గా మంచి వెయిట్ తో బేబీ డెలివరీ జరుగుతుందన్నారు.పోషణ్ మాహ్ కార్యక్రమాలు సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 16 వరకు నెల రోజులు వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ (మహిళల ఆరోగ్యం కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు) స్క్రీనింగ్ ప్రోగ్రాం కూడా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వ తేది వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు.ప్రతి ఒక మహిళ కూడా స్క్రీనింగ్ పరీక్షలను చేయించుకోవాలని ఇంచార్జ్ కలెక్టర్ మహిళలకి సూచించారు.రొమ్ము క్యాన్సర్ గానీ యుటరస్ క్యాన్సర్ గానీ ఇది మహిళల్లో ఎక్కువ ఉంటాయి కాబట్టి అప్పుడప్పుడు చెకప్ చేయించుకోవాలని ఇంచార్జ్ కలెక్టర్ మహిళలకి సూచించారు.అనంతరం ఇంచార్జి కలెక్టర్ గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం, చిన్న పిల్లలకి అన్నప్రాశన కార్యక్రమం నిర్వహించారు. అక్కడే ఏర్పాటు చేసిన అంగన్వాడి స్టాల్ ను పరిశీలించారు.స్క్రీనింగ్ పరీక్షలకు సంబంధించిన వాటిని బ్లడ్ డొనేషన్ కార్యక్రమాలను ఇంచార్జి కలెక్టర్ ప్రారంభించారు.కార్యక్రమంలో స్టేట్ నోడల్ అధికారులు రామనాథం, డా.నరేష్,ఐసిడిఎస్ పిడి విజయ, డిఎంహెచ్ఓ డా. శాంతి కళా,డిసిహెచ్ఎస్ డా.జాఫ్రుల్లా,డిఐఓ డా.నాగప్రసాద్,కార్పొరేటర్ పద్మలత,తదితరులు పాల్గొన్నారు.

## నమస్తే ప్రోగ్రాం కార్యక్రమం గురించి అవగాహన

బి కొత్తకోట(విజయసారథి):కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన నమస్తే ప్రోగ్రాం" అంటే భారత ప్రభుత్వం యొక్క నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకోసిస్టమ్ పథకం అని అర్థం, ఇది పారిశుధ్య కార్మికుల భద్రత,గౌరవాన్ని మెరుగుపరచడానికి రూపొందించబడింది. నమస్తే ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ పల్లవి,పట్టణ శానిటరీ ఇన్స్పెక్టర్ బాబు రెడ్డి నాయక్, నవజీవన ఆర్గనై?సేషన్ మునిసిపల్ నమస్తే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా,సుబ్రహ్మణ్య బాబు ఆధ్వర్యంలో పట్టణ పరిధిలో ఉన్న స్క్రాప్ షాపుల యజమానులకు నమస్తే పైన అవగాహన చేయడం జరిగింది. ఈ నమస్తే కార్యక్రమం ముఖ్య ఉద్దేశం పట్టణంలో వేస్ట్ పికర్స్ చెత్త కుప్పల్లో, రోడ్ల పక్కన,ఇతర ప్రాంతాల్లో కొంతమంది జీవన ఉపాధి కోసం ప్లాస్టిక్ బాటిల్స్, ఇనుప వస్తువులను మరియు ప్లాస్టిక్ వస్తువులను సేకరించి వాళ్ల జీవన ఉపాధి కోసం స్క్రాప్ షాపుల వద్దకు వెళ్లి అమ్మడం జరుగుతుంది అలాగే రాగ్ పికర్స్ వీరు వీధుల్లో రోడ్డు పక్కన మరియు ఇతర ప్రాంతాల్లో బట్టలు, గోనెలు వంటి వ్యర్థాలను సేకరించి స్క్రాప్ కొట్టులకి అమ్మి జీవనోపాధి కొనసాగిస్తుంటారు. వీరి కోసం కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు ఇలా జీవనాన్ని కొనసాగించిన కార్మికులను సురక్షితమైన, భద్రత కొరకు,గౌరవప్రదంగా గుర్తించి మురికి కాలువల్లో చెత్తకుప్పల్లో మరియు పెద్ద పెద్ద డ్రైనేజీల్లో ఇలా ప్రమాదకరమైన పనులను తగ్గించి యాంత్రిక (మెకనైజ్డ్) పద్ధతులను ప్రోత్సహించడం వీరికి తగిన శిక్షణ అందించడం ద్వారా వారి పనిని సంస్థగతీకరించడం.వెనకబడి ఉన్న వర్గాల నుండి వచ్చిన చాలామంది పారిశుద్ధ్య కార్మికులకు మేలు చేయడం అనేది ఈ పథకం యొక్క ముఖ్య లక్ష్యం. ఈ పథకం సామాజిక న్యాయం సాధికారిత మంత్రిత్వ శాఖ ద్వారా అమల చేయబడుతుంది.కావున సానిటరీ ఇన్స్పెక్టర్ స్క్రాప్ షాపు యజమానులకు తమ వద్దకు ఇలా రోడ్లపై చెత్త కుప్పల్లో మరియు ఇతర ప్రాంతాల్లో ఏరుకొని వచ్చినా వేస్ట్ పీకర్స్ మరియు రాగ్ పిక్చర్స్ కార్మికులు వచ్చిన వారి బయోడేటా సేకరించి వారి పేరు మరియు అడ్రస్ మున్సిపల్ కార్యాలయంలో పేరు నమోదు చేసుకోవాల్సిందిగా చెప్పడం జరిగింది.



## 8గంటలలో 20ఎకరాలు పొగాకు పాపనం.

### రికార్డు సృష్టించిన తిమ్మారెడ్డి ఎద్దులు

నందికొట్కూరు సెప్టెంబర్ 17:-నందికొట్కూరు పట్టణంలోని బుక్కాపురం తిమ్మారెడ్డి వృషబాలు రికార్డు సృష్టించాయి.8 గంటలలో 20 ఎకరాలు పొగాకు పొలంలో 2 గుంటిక లతో బుధవారం పాపనం పాయడం జరిగింది. నందికొట్కూరుకు చెందిన రైతు చింతలపల్లి సత్యనారాయణ సమ్మర్ స్టోరేజ్ నీటి ట్యాంక్ సమిపంలో వడ్డెమాన్ రాస్తాలో 20 ఎకరాలను బుక్కాపురం తిమ్మారెడ్డి కౌలుకు తీసుకోని పొగాకు పంట సాగుచేశాడు.ఏడు విత్తనాలు కలిగిన ఎద్దులతో తిమ్మారెడ్డి కుమారులు భాను ప్రకాష్ రెడ్డి,శివారెడ్డి లు కమల్ సాహెబ్ తో కలిసి పాపనం పాశారు.ఉదయం ఆరు గంటలకు మొదలు పెట్టి మధ్యాహ్నం 2గంటలకు పూర్తి చేశారు.రికార్డు సృష్టించిన వృషభాలను తిలకించేందుకు రైతులు పొలం వద్దకు తరలివచ్చారు.పలువురు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమం లో అయ్యపు రెడ్డి,నాగిరెడ్డి,వెంకటేశ్వర రెడ్డి, పెద్ద శివారెడ్డి,సుధాకర్ రెడ్డి, శంకర్ రెడ్డి,పెద్ద రాజు,వెంకట రామిరెడ్డి,చంటి,రఫీ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## కర్నూలు సిటీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ









కర్నూలు(విజయసారథి):జాతీయ కాంగ్రెస్ యువ నాయకులు రాహుల్ గాంధీ పిలుపుమేరకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి ఆదేశాల మేరకు ఓట్ చోర్ - గద్దె చోడ్ కార్యక్రమంలో భాగంగా సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని భాష ఆధ్వర్యంలో బుధవారం ఉదయం, సాయంకాలం నగరం నందలి గడియారం హాస్పిటల్, పాత బస్టాండ్ సర్కిల్ ప్రాంతాలలో దొంగ ఓట్లకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేపట్టారు. జిలాని భాష మాట్లాడుతూ ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియాకు ఉందని ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలి కానీ ఎన్నికలసంఘం ప్రధాని మోడీ చేతిలో బంది అయ్యింది. అన్ని వ్యవస్థలు మోడీ గుప్పెట్లో బీజేపీ కోసం పని చేస్తున్నాయి. ఎన్నికల సంఘం కూడా బీజేపీ కోసమే పనిచేస్తుంది. రాహుల్ గాంధీ ఉద్యమానికి సంఘీభావంగా ఈ కార్యక్రమం చేపట్టడం అయినదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, ఐ ఎన్ టి యు సి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ ఖాద్రి పాషా, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ ఎన్సి బజారన్న, ఓబీసీ సెల్ చైర్మన్ డివి సాంబశివుడు, కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ ఏ సూర్య ప్రకాష్ రెడ్డి, ఐఎన్టీయూసీ సిటీ అధ్యక్షులు రేపల్లె ప్రతాప్, కాంగ్రెస్ నాయకులు బి సుబ్రహ్మణ్యం, డబ్ల్యూ సత్యరాజు, జోసఫ్ నోయల్, దస్తగిరి వార్డు ఇన్చార్జులు కేశవరెడ్డి హుస్సేన్ భాష మొదలగు వారు పాల్గొన్నారు.

PRINTED, EDITED, PUBLISHED AND OWNED BY P.VENKATESWARLU, PRINTED AT UTTEJITHA PRINTERS, H.No.801, BUDHAWARPETA, KURNOO 518001, A.P, PUBLISHED FROM HO.NO.45/403- 10, BHAGATSING NAGAR, KURNOOL AP, Cell : 9700370499, Email : vijayasarathi2010@gmail.com